Government of Tamilnadu

# తెలుగు వాచకం

## TELUGU READER

ఏడో తరగతి

VII - STANDARD

**Untouchability**
**Inhuman - Crime**

Department of School Education

© Government of Tamilnadu
Fitst Edition - 2011
Reprint - 2012
(This Book is Published under Uniform System of School Education Scheme)

CHAIRPERSON

Dr.Vistali Sankara Rao,
Asst Prof,Department of Telugu,
University of Madras,
Chennai-600 005.

REVIEWER

J.Chandra Babu,
P.G.Asst, G.B.H.S.School,
Pallipat,
Tiruvallore.

AUTHORS

B.Kandaswamy,
Telugu Pandit, G.H.S.School,
Berikhai,
Krishnagiri Dt.

Hari Prasad Gangaraju,
S.G.Asst.,G.H.S.School,
Pallipat,
Thiruvallur Dt.

P.Chandrasekhar,
Telugu Pandit, G.H.School
Eguvarpalyam,
Thiruvallur Dt.

Laser Typeset , Layout & Illustrations: T. Raghu, M. Vijayasarathy, R.Raja

Drawings & Book Wrapper: Aras

Textbook Printing

Tamilnadu Textbook Corporation,
College Road, Chennai - 600 006

This book has been printed on 80 G.S.M.Maplitho Paper

Printed by web offset at :

# జాతీయ గీతం

జనగణ మన అధినాయక జయహే!
భారత భాగ్య విధాతా!
పంజాబ సింధు గుజరాత మరాఠా
ద్రావిడ ఉత్కళ వంగ!
వింధ్య హిమాచలయమునా గంగా
ఉచ్ఛలజలధి తరంగ!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాగే!
గాహే తవ జయ గాథా!
జన గణ మంగళ దాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!

- రవీంద్రనాథ్ ఠాగూర్

# భావం

(ప్రజల హృదయాలను పరిపాలించే భారతదేశ భాగ్యవిధాత అయిన నీకు జయం కలుగుతుంది. నీ శుభ నామం పంజాబు, సింధు, గుజరాతు, మహారాష్ట్ర, ద్రావిడం, ఉత్కళం, బంగాళ మొదలయిన దేశ ప్రజల మనసులను ఉప్పొంగ చేస్తోంది.

వింధ్య, హిమాలయ పర్వతాలలో ప్రతిధ్వనిస్తోంది. యమున, గంగా నదుల ప్రవాహంలో లీనమైంది.

నీ ఆశీర్వాదం కోసం నిన్ను కీర్తిస్తూ గానం చేస్తున్నారు. భారతదేశ భాగ్యవిధాత అయిన నీకు జయం కలుగుతుంది.

నీకు జయం కలుగుగాక! జయం కలుగుగాక! జయం కలుగుగాక!)

# తమిళ్ తాయ్ వాళ్త్తు

నీరారుం కడలుడుత్త నిలమడందై కెళిలొళుగుమ్
సీరారుం వదనమెన త్తిగళ్ భరత ఖండమిదిల్
తెక్కణముమ్ అదిర్ సిరంద ద్రావిడనల్ తిరునాడుమ్
తక్కసిరు పిరైనుదలుమ్ దరిత్తనరుమ్ తిలగముమే
అత్తిలగ వాసనైపోల్ అనైత్తులగుమ్ ఇన్బముర
ఎద్దిసైయుం పుగళ్ మణక్క ఇరుంద పెరుం
తమిళణంగే! తమిళణంగే!
ఉన్‌సీరిళమైత్తిరం వియందు
సెయల్ మరందు వాళ్త్తుదుమే!
వాళ్త్తుదుమే! వాళ్త్తుదుమే!

- మనోన్మణీయం, పె.సుందరం పిళ్ళై

## భావం

(నీలాలకడలి మధ్య భరత ఖండమనే మహిళ ఉంది. ఆమె అతి సుందర వదన. ఆ తల్లి నొసట తీర్చిదిద్దిన కస్తూరి తిలకంలా ఉంది ద్రావిడనాడు. ఆమె కమ్మని వలపు, తియ్యదనం, లేప్రాయం, ధీరత్వం తమిళ భాష. అది సర్వదిశలా వ్యాపించి ఉంది. అది నిత్యనూతనం, ప్రఖ్యాతం. ఆమెకు సర్వదా విజయోస్తు! విజయోస్తు!)

## ప్రతిజ్ఞ

భారత దేశం నామాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన, నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలందరిని గౌరవిస్తాను. ప్రతి ఒక్కరితోను మర్యాదగా నడచుకొంటాను. నా దేశం పట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## మా తెలుగు తల్లి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్న తల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి ॥ మా ॥

గలగల గోదారి కదిలిపోతుంటేను
బిరబిర కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి ॥ మా ॥

అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచి ఉండేదాక ॥ మా ॥

రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయని కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

– శంకరంబాడి సుందరాచారి

## జాతీయ సమైక్యత

నా జాతి స్వాతంత్ర్యాన్ని, ఏకత్వాన్ని సంరక్షించడానికి, దృఢతరం చేయడానికి నన్ను నేను సమర్పించుకొంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. హింసామార్గాన్ని ఎప్పుడూ నేను అవలంబించను. మత, భాష, ప్రాంత సంబంధమయిన, ఇతర రాజకీయార్థిక అన్యాయాలకు సంబంధించిన అన్ని విభేదాలను, వివాదాలను శాంతియుతంగాను, చట్టసమ్మతమయిన పద్ధతులద్వారానే పరిష్కరించుకొంటానని ప్రతిజ్ఞచేస్తున్నాను.

# విషయ సూచిక


| పద్యభాగం | | | పుట |
|---|---|---|---|
| 1. | గరుడ-కూర్మాల కథ | - మంచన | 1 |
| 2. | గజేంద్రమోక్షము | - బమ్మెర పోతన | 8 |
| 3. | ఊర్మిళాదేవి నిద్ర | | 14 |
| 4. | నాగుల చవితి | - బసవరాజు వెంకట అప్పారావు | 20 |
| 5. | కృషీవలుడు | - దువ్వూరి రామిరెడ్డి | 25 |
| 6. | జన్మభూమి | - రాయప్రోలు సుబ్బారావు | 30 |
| 7. | కాంక్ష | - వేదుల సత్యనారాయణ శాస్త్రి | 35 |
| **గద్యభాగం** | | | |
| 1. | మిత్రలాభం | - పరవస్తు చిన్నయసూరి | 38 |
| 2. | తంజావూరు | | 43 |
| 3. | రుక్మిణీదేవి అరుండేల్ | | 49 |
| 4. | భారతీయ భాషలు | | 53 |
| 5. | మన క్రీడలు-ఆవశ్యకత | | 57 |
| 6. | ప్లాస్టిక్ వాడకం | | 62 |
| 7. | డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ | | 68 |
| **ఉపవాచకం** | | | |
| 1. | త్యాగం (కర్ణుడు) | | 71 |
| 2. | సేవ (కర్మవీరుడు కామరాజు) | | 75 |
| 3. | కరుణ (మదర్ థెరిసా) | | 79 |
| 4. | వినయం (ఏకలవ్యుడు) | | 82 |
| 5. | పరోపకారం (కపోతి-కపోతం కథ) | | 84 |
| **వ్యాకరణం** | | | 86 |


సూచన : * గుర్తులున్న పద్యాల్ని కంఠస్థం చేయండి.

# 1. గరుడ - కూర్మాలకథ

- మంచన

**కవి పరిచయం:**

తిక్కన సమకాలికులలో ప్రసిద్ధమైన కవి మంచన. ఇతని కాలం క్రీ.శ 1300 ప్రాంతమని చరిత్రకారుల ఊహ. సంస్కృతంలో రాజశేఖరుడనే కవి రచించిన 'విద్ధసాలభంజిక' 4 అంకాలు గలిగిన దృశ్యకావ్యం. దీన్ని ఆధారంగా చేసుకుని మంచన తెలుగులో 'కేయూరబాహు చరిత్ర' అనే చక్కని కథాకావ్యం వ్రాశాడు. ఈ కావ్యాన్ని నండూరి గుండయామాత్యునికి అంకితమిచ్చాడు.

మంచన కేవలం 'విద్ధసాలభంజిక' కథలే కాక, పంచతంత్రం, హితోపదేశం గ్రంథాల నుండి కొన్ని కథలను, తన కాలంనాటి జనవ్యవహారంలో ఉన్న కొన్ని నీతి కథలను, సేకరించి మొత్తం 22 కథలతో కేయూరబాహు చరిత్రను రచించాడు.

మంచన కథను నడిపించే తీరు, సరళమైన కథాకథనశైలి, మనోరంజకంగా ఉంటాయి.



ప్రస్తుత పాఠ్యభాగం "గరుడ - కూర్మాలకథ" - 'కేయూరబాహుచరిత్రము' లోని తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. బుద్ధిబలం ఉపయోగించి కీడు చేసే వారి బారి నుంచి ఏ విధంగా బయటపడవచ్చో ఈ కథ తెలుపుతోంది.

1. క. అంబుధితీరంబునఁ గూ
ర్మంబులు చరియించుచుండఁ బ్రతిదినమును వా
నిం బట్టి తనకు నాహా
రంబుగఁ గొనుచుండుఁ బక్షిరాజుగ్రుం డై,

2. వ. అట్లు సెల్లుచుండ నొక్కనాఁడు.

*3. చ. వననిధినీట నిల్చి ఖగవల్లభుతో నొక కూర్మముఖ్యుఁ డి
ట్లనియె మదీయబంధునివహంబులు దేవరవాతఁ ద్రుంగె నే
న నిలచినాఁడ నిప్పటికి నాకుఁ దొలంగినఁ బోదు నీకు నా
కు నొకటి పన్నిదంబు సమకూఱునె యోలము మాని చెప్పుమా.

4. క. అనుటయు నవ్వుచు వినతా
తనయుం డది యేమి పన్నిదము సెప్పవయా
యనవుడు నలుగక చిత్తం
బున నించుక యవధరింపుము మహావిహగా!

*5. మ. ఉడువీధిన్ వెస నీవు వాఱు జవసత్వోత్సాహ! యంబోధిలోఁ
గడవం బాఱెద నేను నిన్ను మిగులంగాఁ జాలినట్లైన నె
న్నఁడు భక్షింపకు మమ్ము నోడినటు లైనన్ మా కులం బెల్ల నె
ప్పుడు నాహారము గొమ్ము నీవు వినతాపుత్రా! మహాధార్మికా!

6. వ. ఇవ్విధంబు సేయం దలంపు గలిగెనేని నొక్క నాఁ డిచటికి విజయం చేయుం డనిన సుపర్ణుం డట్లు చేయుదు నని యొడంబడి పోయిన.

7. క. తన చుట్టంబులనందఱి
ననువుగ నొకచోటఁ గూర్చి యా కూర్మము తా
ర్క్ష్యు నితోఁ దా నొడఁ బడి వ
చ్చిన చందము వారితోడఁ జెప్పుడు వారున్.

8. క. నినుఁ గడచిన మతిమంతులు
మన లోపలఁ గలరె పంపు మము నేపనియై
నను జేయుదు మనవుడు నది
మన మలరఁగఁ జెపుదు వినుఁడు మన మందఱమున్.

9. క. ఆమడ యెడఁ బదిపదిగా
సాముద్ర తటంబు నీరఁ జని యుండి ఖగ
స్వామి పఱవంగ నాతని
కా ముందటివాడు చూపునది పొడ వచటన్.

10. వ. అని యోజ చేసికొని విహగవల్లభుతోడఁ దాను మాటలాడిన యెడన యా
కచ్ఛపంబు నిలిచె నచ్చటు మొదలుకొని యనేక యోజనంబులు దాఁక దక్కి
నవియు నట్ల యుండ మఱునాఁడు సనుదెంచి.

11. క. గరుడుం డవ్వలనికి స
త్వరగతిఁ గూర్మంబుఁ బిలిచి వారిధిపై నం
బరవీధిబెద్దయును ద
వ్వరుగుచు నది చిక్క నోపు నని చీరుటయున్.

12. క. ఓ యని పలుకుచు ముందఱఁ
దోయధిలోఁ గచ్ఛపంబు దోఁచిన మఱియున్
వాయుగతిఁ బఱచి చీఱిన
నాయెడ నగ్రమునఁ గమఠ మల్లన నెగసెన్.

13. వ. అవ్విధంబుఁ గని యచ్చెరు వొందుచు.

14. క. అందుండి మగుడఁ బఱచుచు
ముందటి యట్లట్ల పిలువ ముందఱ నంతం
తం దోఁచుచు నవి పిఱుఁదులు
ముందఱఁగా జేసి పక్షిముఖ్యునిఁ గెలిచెన్.

15. క. అతఁడు తనయోటమిని ల
జ్జితుఁడై మీ కెందు నెగ్గు సేయం బ్రమద
స్థితి నిలువుఁ డనుచుఁ బోయిన
నతిసంతోషమునఁ గచ్ఛపావళి యుండెన్.

## అభ్యాసవేదిక

### అర్థాలు:

| | | |
|---|---|---|
| వననిధి | = | సముద్రం |
| ఖగవల్లభుడు | = | పక్షిరాజు, గరుడుడు |
| బంధు నివహంబు | = | చుట్టాలసమూహం |
| త్రుంగు | = | నశించు |
| పన్నిదము | = | పందెం |
| అలుగక | = | కోపించక |
| ఉడువీధి | = | ఆకాశం |
| సుపర్ణుడు | = | దృఢమైన రెక్కలుగలవాడు |
| తార్క్ష్యుడు | = | గరుత్మంతుడు |
| విహంగవల్లభుడు | = | పక్షిరాజు |
| కచ్ఛపము | = | తాబేలు |
| యోజనం | = | పదికోసులదూరం |
| వారధి | = | వంతెన |
| చీరు | = | పిలుచు |
| తోయధి | = | సముద్రం |
| కమఠము | = | తాబేలు |
| లజ్జ | = | సిగ్గు |
| మతిమంతులు | = | తెలివైనవారు |
| ఎగ్గుసేయుట | = | కీడుచేయుట |

### భావాలు:

1. తాబేళ్ళు సముద్ర తీరంలో సంచరిస్తుండగా ప్రతిదినం వాటిని పట్టి పక్షిరాజైన గరుత్మంతుడు తినడం ప్రారంభించాడు.

2. ఆ విధంగా జరుగుతుండగా ఒకరోజు -

3. తాబేళ్ళలో ముఖ్యుడు ఒకడు ఆ గరుత్మంతునితో ఇలా అన్నాడు. "నా బంధువు లెందరో నీ వాత పడి నశించిపోయారు. నేను మాత్రం మిగిలాను. నాకు కూడా నీ ముప్పు తప్పదు. అందుచేత నీకు ఒప్పందమయితే మనమిద్దరం ఒక పందెం వేసుకుందాం."

4. అనగానే వినతా కుమారుడైన గరుత్మంతుడు నవ్వుతూ, "అది ఏం పందెమో చెప్పవయ్యా?" అని అడిగాడు. " ఓ పక్షిరాజా! అయితే కోప్పడకుండా నే చెప్పేది విను...

5. ఆకాశవీధిలో వేగంగా ఎగిరే శక్తి గలవాడివి నువ్వు! సముద్రంలో అదే వేగంతో నేను ఈదుతాను. నీ కంటే ముందు నేను వెళితే - మమ్మల్ని ఎవరినీ నీవు తినకూడదు. ఒకవేళ నీవు నా కంటే ముందు ఉంటే మాజాతి మొత్తాన్ని నీవు ఆహారంగా తినవచ్చు.

6. ఇది నీకు సమ్మతమయితే ఈ పోటీకి నీవు రావచ్చు." అని తాబేలు చెప్పగానే సుపర్ణుడు, "సరే! అలాగే చేద్దా"మని అప్పటికి వెళ్ళిపోయాడు

7. అప్పుడు ఆ తాబేలు - మిగిలిన తన చుట్టాలందరిని ఒకచోట చేర్చి, తాను గరుడునితో వేసిన పందెం గురించి వారితో చెప్పింది.

8. వారందరూ, "మా అందరి కంటే నీవు బుద్ధిమంతుడవు. నీవు ఏం చెబితే - అది చెయ్యడానికి మేం సిద్ధంగా ఉన్నాం. చెప్పు! మేం ఏ పని చెయ్యాలో" అని అన్నారు. అపుడు ఆ కూర్మముఖ్యుడు, "అయితే మనసు పెట్టి జాగ్రత్తగా వినండి! మన మందరం...

9. నాలుగుకోసులదూరం ఒకరు చొప్పున విడిపోయి సముద్రం నీటిలోపల ఉండాలి. పక్షి స్వామి ఎగురుతూ వస్తున్నపుడు - ముందటివాడు అతని కంటే ముందు ఉన్నట్లుగా నీళ్ళ నుంచి పైకి లేచి తన గురుతు చూపుతుండాలి.

10. ఈ విధంగా ఆ తాబేళ్ళు అన్నీ ఆలోచించుకొన్నాయి. అనేక యోజనాలదూరం ఒకదాని తరువాత ఒకటి సముద్రం నీటిలోపల నిలిచాయి. ఆ మర్నాడు

11. గరుడుని పోటీకి పిలిచాడు కూర్మముఖ్యుడు. సముద్రం లోపల తాబేలు - అంబరవీధిలో గరుత్మంతుడు పోటీకి సిద్ధపడ్డాయి.

12. వరుసగా సముద్రం నీటిలోపల అమరి ఉన్న తాబేళ్ళు ఒకదాని తరువాత ఒకటి - పక్షిరాజు కంటే ముందే తలపైకెత్తి ఓ యని పలుక సాగాయి. అది చూచి గరుత్మంతుడు - తాను వాయువేగంతో ఎగురుతున్నప్పటికీ తన కంటే ముందే ఆ తాబేలు కనపడుతున్నదని అనుకున్నాడు.

13. అది చూసి మిక్కిలి ఆశ్చర్యపోయాడు.

14. ఆ విధంగా అతని కంటపడి - తాబేళ్ళు అన్నీ అతని కంటే ముందే ఉన్నట్లుగా భ్రమ కలిగించాయి. ఆ పక్షిని వెనుక పడినట్లుగా చేసి అతనిని పందెంలో ఓడించాయి.

15. గరుత్మంతుడు కూడా తన ఓటమిని ఒప్పుకొన్నాడు. "ఇక మీదట మీకు ఏ విధమైన కీడు చెయ్యను.సంతోషంగా ఉండండి!" అని చెప్పి, వెళ్ళిపోయాడు. అప్పట్నుంచి తాబేళ్ళు అన్నీ ప్రశాంతంగా జీవించాయి.

### ఈ క్రింది పదాలకు అర్థాలు గుర్తించండి.

ఉదా॥

| | | | | |
|---|---|---|---|---|
| | అంబుధి | = | చెఱువు | / <u>సముద్రం</u> / నది |
| 1. | కూర్మం | = | తాబేలు | / కొంగ / ఎండ్రకాయ |
| 2. | తీరం | = | కొండ | / గోపురం / ఒడ్డు |
| 3. | ఉగ్రుడు | = | భయంకరుడు | / శాంతం కలవాడు / ధైర్యం కలవాడు |

### ఈ క్రింది వాక్యాల్లో గుర్తించిన పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.

ఉదా॥ తాబేలు మెల్లగా నడుస్తుంది. కుందేలు <u>వేగంగా</u> పరుగెత్తుతుంది.

1. దీపావళి రోజు జాగ్రత్తగా టపాసులు కాల్చాలి __________ గా కాల్చరాదు.
2. తన <u>సంతోషమే</u> తనకు స్వర్గం. తన __________ తనకు నరకం.

### ఈ క్రింది పదాలను సొంత వాక్యాలలో రాయండి.

ఉదా॥ పందెం = కుందేలు తాబేలు ఒకరోజు పరుగు <u>పందెం</u> వేసుకొన్నాయి.

1. మతిమంతులు :
2. ఎగ్గుసేయుట :

### ఈ క్రింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

1. తాబేళ్ళు __________ తీరంలో సంచరిస్తుండేవి.
2. ప్రతిరోజు వాటిని పట్టి పక్షిరాజైన __________ తినేయడం ప్రారంభించాడు.
3. నీకు ఒప్పందమయితే మన మిద్దరం ఒక __________ వేసుకొందాం.
4. గరుడుని పోటీకి పిలిచాడు __________.
5. తాబేళ్ళు అన్నీ అతని కంటే ముందే ఉన్నట్లుగా __________ కలిగించాయి.

(పందెం, గరుత్మంతుడు, సముద్ర, భ్రమ, కూర్మముఖ్యుడు)

### ఈ క్రింది వాటికి వికృతులు రాయండి.

ఉదా ॥ ఆశ్చర్యం - అచ్చెరువు

1. ఆహారం -
2. పక్షి -
3. సముద్రం -
4. స్వామి -

### ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

ఉదా॥ తనయుడు = పుత్రుడు, కొడుకు

1. హృదయం : __________ , __________
2. అంబుధి : __________ , __________
3. ఎగ్గు : __________ , __________

### ఈ క్రింది పదాలను (సంధి) కలిపి రాయండి.

ఉదా॥ జవసత్వ + ఉత్సాహ = జవసత్వోత్సాహ

1. మనము + అందరము =
2. మాటలు + ఆడిన =

### ఈ క్రింది సంధి కార్యాలు విడదీసి రాయండి.

ఉదా॥ ఎగ్గుసేయన్ = ఎగ్గు + చేయన్

1. కచ్ఛపావళి =
2. ఇవ్విధము =

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. తమను పట్టి తినేస్తున్న పక్షిరాజుతో కూర్మముఖ్యుడు ఏమని పలికాడు?
2. కూర్మం గరుడునితో పందెం గురించి ఏమి చెప్పింది?
3. కూర్మముఖ్యుడు తన చుట్టాలతో ఏ విధంగా యోచించాడు?
4. గరుత్మంతుడిని - కూర్మాలు పందెంలో ఓడించిన విధం తెలపండి?
5. ఖగరాజు ఓడిన తరువాత తాబేలుతో ఏమని చెప్పాడు?
6. గరుడ - కూర్మాలకథ ద్వారా తెలియవచ్చే నీతి ఏమిటి?

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. మంచన చెప్పిన మరికొన్ని కథల్ని క్లుప్తంగా చెప్పాలి.
2. బుద్ధిబలం గొప్పదనాన్ని తెలిపే కథల్ని చెప్పి వివరించాలి.
3. ఈ కథలోని నీతిని విద్యార్థులచేతనే చెప్పించాలి.

### విద్యార్థులు చేయవలసిన పనులు :

1. ఈ కథ ద్వారా కవి చెప్పదలిచిన దేమిటో మీ మిత్రులతో చర్చించండి.
2. మరికొన్ని నీతి కథల్ని సేకరించండి.


# 2. గజేంద్రమోక్షం

- బమ్మెర పోతన

శ్రీనాథుని సమకాలికులలో అగ్రగణ్యుడు పోతన. ఈయన పూర్తి పేరు బమ్మెర పోతన. పోతన తల్లి లక్కమాంబ, తండ్రి కేసనామాత్యుడు. పోతన 15వ శతాబ్దానికి చెందినవాడు. వీరి నివాసము ఓరుగల్లు సమీపంలో గల'బమ్మెర' అని, కడప మండలంలో గల'ఒంటిమిట్ట' అని వివిధ వాదాలు ఉన్నాయి.

సంస్కృతంలో వేదవ్యాస మహర్షి రచించిన శ్రీమన్మహాభాగవతాన్ని, శ్రీమదాంధ్ర మహాభాగవతంగా పోతన ఆంధ్రీకరించాడు. భాగవతంలోని భాగాలను స్కంధాలు అని అంటారు. భాగవతంలో 12 స్కంధాలు ఉన్నాయి. భాగవతం కల్పవృక్షంతో పోల్చబడింది. వీటిలో పోతన 8 స్కంధాలు రచించగా, మిగిలిన స్కంధాలు శిష్యులు పూరించారు.

పోతన ఇతర రచనలు వీరభద్రవిజయం, భోగినీదండకం, నారాయణ శతకం మొదలైనవి. ఈయన బిరుదు 'సహజపండితుడు'. ఈయన రచనా శైలి మృదుమధురంగా ఉంటుంది.



శ్రీకృష్ణుని చరిత్రమే భాగవతంలోని ప్రధాన వస్తువు. దీనిలో శ్రీకృష్ణుని లీలలతోపాటు ప్రహ్లాదుడు, ధ్రువుడు, అంబరీషుడు, రుక్మిణీకళ్యాణం, గజేంద్రమోక్షం మొదలైన కథలు ఉన్నాయి.ప్రస్తుత పాఠ్యభాగం గజేంద్రమోక్షం భాగవతంలోని అష్టమ స్కంధం నుండి గ్రహించబడింది. మొసలి నోట చిక్కిన గజరాజు ప్రయత్నం విఫలమై చివరికి దేవుణ్ణి ప్రార్థించి ఆపద నుండి ఎలా గట్టెక్కింది అనేది పాఠ్యభాగ సందర్భం. ఈ గజేంద్రమోక్ష ఘట్టం కేవలం భక్తి ప్రేరేపితం కాదు, పోతన అత్యుత్తమ కవితాభరితం. వైకుంఠపురంలో, నగరిలో, ఆమూలసౌధముదాపల, మందారవనంలో సెలయేటి ప్రక్కనున్న చలువ తిన్నె దగ్గరకు పోతన పాఠకులను తీసుకొని వెళ్ళాడు. గజేంద్ర స్తుతి రూపాన పోతన రచించిన ఈ క్రింది పద్యాలు మహోన్నత భక్తి నిలయాలు.

1. *క. కలఁడందురు దీనుల యెడఁ,
గలఁడందురు పరమయోగి గణముల పాలం,
గలఁడందు రన్ని దిశలను,
గలఁడు గలం డనెడువాఁడు గలఁడో లేఁడో!

2. సీ. కలుగఁడే నా పాలి కలిమి సందేహింపఁ
గలిమి లేములు లేక గలుగువాఁడు
నా కడ్డపడ రాఁడె నలిన సాధువులచేఁ
బడిన సాధుల కడ్డపడెడు వాఁడు
చూడఁడే నా పాటు చూపులఁ జూడక
చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతో నా మొఱాలింపఁడే మొఱఁగుల
మొఱ లెఱుంగుచుఁదన్ను మొఱఁగువాఁడు

తే. నఖిలరూపముల్ఁ దనరూప మైనవాఁడు
నాది మధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె చూడఁడె తలపఁడె వేగ రాఁడె.

3. క. విశ్వకరు విశ్వదూరుని,
విశ్వాత్ముని విశ్వవేద్యు విశ్వునవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమపురుషు నే భజియింతున్

4. వ. అని పలికి, తన మనంబున న గ్గజేంద్రుం డీశ్వర సన్నిధానంబుఁ
గల్పించుకొని యిట్లనియె.

5. *శా. లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలం బయ్యెఁ, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపం దగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

6. క. వినుదఁట జీవుల మాటలు,
జను దఁట చనరానిచోట్ల శరణార్థులకో
యను దఁట పిలిచిన సర్వముఁ,
గను దఁట సందేహ మయ్యెఁ గరుణావార్ధీ!

7. ఉ. ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్ష విపక్షదూర! కు
య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర! మనోహర! యో విమలప్రభావ! రా
వే, కరుణింపవే, తలఁపవే, శరణార్థిని నన్నుఁ గావవే.

8. వ. అని పలికి, మరియు నరక్షిత రక్షకుండైన యీశ్వరుం డాపన్నుండైన నన్నుంగాచుఁ గాక యని, నింగి నిక్కి చూచుచు, నిట్టూర్పులు నిగిడింపుచు, బయలాలకింపుచు, న గ్గజేంద్రుండు మొఱ సేయుచున్న సమయంబున.

9. ఆ. విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డపడక
విశ్వమయుడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డపడ దలంచె.

10. మ. అల వైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబు దా
పల మందార వనాంతరామృతసరఃప్రాంతేందు కాంతోపలో
త్పలపర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము "పాహి పాహి" యనఁ గుయ్యాలించి సంరంభియై

11. మ. సిరికిం జెప్పడు శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాద ప్రోత్థిత శ్రీ కుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజ ప్రాణావనోత్సాహియై

భావాలు :

1. ఆపన్నులు, యోగులు మొదలైన వారి యెడ నుండి సర్వదిక్కులందు నిండినవాడైన భగవంతుడున్నాడని పెద్దలు చెప్పుదురు. అట్టి భగవంతుని నేనెన్ని విధాలు ప్రార్థించినా రాకున్నాడు. అట్టి భగవంతుడు ఉన్నాడో, లేడో అని సంశయపడుతున్నాను.

2. జనన మరణం లేని దేవుడు నాతోడు ఉన్నాడో లేడో! దుష్టులవలన బాధపడే వారిని కాపాడే దేవుడు నన్ను ఈ మొసలి బారినుండి తప్పించుటకు ఎందుకు రాకుండా ఉన్నాడు. ఇంద్రియాలను జయించి జ్ఞాన దృష్టితో తనని చూచేవారిని దగ్గరకు జేర్చుకొనే దేవుడు నన్ను ఎందుకు చూడడు. భక్తులవలె నటించే వారికి దేవుడు ప్రత్యక్షం కాడు. కాని నా దీనాలాపం ఎందుకు వినలేదు. తాను ఒక ప్రపంచమై సృష్టి స్థితి లయ సర్వకాల సర్వావస్థలందు వెలుగుచుండేవాడు. భక్తులు తనని ధ్యానిస్తే వారి ఆపదలను తొలగించే దేవుడు నా మొఱ విని నాపై దయ ఉంచి నన్ను ఎందుకు రక్షించడు.

3. లోకాన్ని సృష్టించి లోకం బయట ఉండే ప్రపంచ స్వరూపుని, బ్రహ్మకంటే గొప్ప వానిని, ఈశ్వరుని, పురుషోత్తముణ్ణి నేను సేవిస్తాను.

4. అని గజేంద్రుడు తన మనస్సులో ఈశ్వరుని తలుస్తూ ఇలాగ అన్నాడు.

5. ఓ దేవుడా! నా బలం నశించి, ధైర్యం తగ్గింది. ప్రాణాలు పోయేటట్లు అన్పిస్తుంది. మైకం వస్తోంది. శరీరం అలసిపోయింది. నేను పోరాడలేను. నీవు తప్ప నాకెవ్వరు లేరు. నా తప్పులు మన్నించి నా వద్దకు వచ్చి నన్ను కాపాడు.

6. ఓ దయా సముద్రుడా! ఆపదలో ఉండేవారి మాటలు వింటావని, పోవటానికి వీలుకాని చోట్లకు పోతావని, శరణాగతులు నిన్ను పిలిస్తే ఇదిగో వస్తున్నా, అని చెప్తావట. కాని నేను ఇంత ప్రార్థించినా రాలేదు. ఆ మాటలు నిజమా, అబద్ధమా తెలియటంలేదు.

7. కమలాక్షుడా! భక్తుల కోర్కెలు తీర్చేవాడు, శత్రువులయెడ దయలేనివాడు, పండితులచేత మునులచేత ధ్యానింపబడేవాడు, మేటిగుణాలు గలవాడు. కల్పవృక్షం వలె కోర్కెలు తీర్చేవాడైన ఓ భగవంతుడా! శరణు జొచ్చాను. వేగంగా వచ్చి నా కష్టాలు తొలగించి కాపాడు.

8. గజరాజు చాలా సేపు ప్రార్థించి అనాథలను కాపాడే భగవంతుడు తన్ను రక్షిస్తాడని తన తొండాన్ని ఆకాశానికి ఎత్తి వేడి నిట్టూర్పులు విడుస్తూ పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తూ ఉన్న సమయంలో

9. గజరాజు ప్రార్థిస్తూ ఉంటే బ్రహ్మ మొదలైనవారు ప్రత్యక్షం కాలేదు. విశ్వరూపుడు, సర్వేశ్వరుడు, సర్వం వ్యాపించినవాడు, సర్వోత్కృష్టుడు అయిన మహావిష్ణువు రక్షించదల చాడు.

10. వైకుంఠంలో రాజనగరిలో, ఆ మూల మేడ వెలుపల, కల్పవృక్ష వనంలో, అమృత సరోవరం తీరాన, చంద్రకాంతమణులు చెక్కి, కలువ పూవులు పరచిన పాన్పుపై లక్ష్మీదేవితో ఉండే ఆపద్బాంధవుడు అయిన శ్రీమన్నారాయణుని చెవిలో గజరాజు ప్రార్థనలు వినిపించగా తత్తరపడి.

11. శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవికి చెప్పక, శంఖ, చక్రాలుధరించక, బంటులను పిలవక, గరుడుని మీద ఎక్కక, జారిన జుట్టుముడి చక్కసేయక, లక్ష్మీదేవి కొంగును విడవకుండా గజేంద్రుని రక్షించడానికి ఉత్సాహంతో బయలుదేరాడు.

## అభ్యాస వేదిక

### ఈ క్రింది పదాలకు అర్థాలు రాయండి.

ఉదా॥ కలిమి = సంపద

1. విలోలం =
2. తనువు =
3. దీనులు =
4. వరద =
5. గజము =
6. సౌధము =
7. కాంత =
8. రమ =
9. కర్ణము =

### ఈ క్రింది వాక్యంలో గుర్తించిన పదాలకు ఖాళీలలో వ్యతిరేక పదాలు రాయండి.

1. దేవుడు చెడ్డవారిని శిక్షిస్తాడు. మంచి వారిని __________ డు
2. నరకాసురుడు అధముడు. శ్రీకృష్ణుడు __________

### ఈ క్రింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.

ఉదా॥ భక్తజనం : తిరుమలలో బ్రహ్మోత్సవాల సమయాన భక్త జనులు తండోపతండాలుగా వస్తారు.

1. కరుణ : ________
2. అడ్డుపడు :
3. పరివారం :

### ఈ క్రింది పదాలను జతపరచండి.

1. గజేంద్రుడు ( ) అ. బలం
2. సిరి ( ) ఆ.ఏనుగులరాజు
3. కరుణావార్ధి ( ) ఇ. లక్ష్మీదేవి
4. లావు ( ) ఈ. దయాసముద్రం

### ఈ క్రింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.

ఉదా॥ దిశ = దిక్కు, ఆశ, కడ

1. వనం =
2. కమలం =
3. సౌధం =
4. తనువు =
5. ఈశ్వరుడు =
6. గజము =

### ఈ క్రింది ఖాళీలను పూరించండి.

1. కలడందురు పరమయోగి గణముల ______________________
2. రావే యీశ్వరా కావవే వరద సంరక్షింపుము ______________________
3. సిరికిం ______________________ శంఖ చక్రయుగముం జేదోయి ______________________

(భద్రాత్మకా, పాలన్, జెప్పడు సంధింపడు)

### ఈ క్రింది పదాలను విడదీసి రాయండి.

ఉదా॥ గజ+ ఇంద్రుడు : గజేంద్రుడు

1. శరణార్థులు :
2. ప్రాంతేందు :
3. వనాంతరం :
4. కర్ణికాంతరం :

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. గజేంద్రుడు దేవుడు ప్రత్యక్షం కాలేదని ఎలా సంశయ పడ్డాడు?
2. మొసలి పట్టుతో గజేంద్రుడు ఎలా బలహీనుడైనాడో తెల్పండి?
3. శ్రీమహావిష్ణువు ఎచ్చట ఎలా ఉన్నాడు?
4. ఆగజేంద్రుణ్ణి కాపాడడానికి భగవంతుడు ఎలా వచ్చాడు?

### ఉపాధ్యాయులకు సూచనలు

1. పోతన భాగవతంలోని ఇతర కథలను సంక్షిప్తంగా తెలియజేయాలి.
2. పోతన సమకాలిక కవుల్ని తెలపండి.

### విద్యార్థులకు సూచన

గ్రంథాలయానికి వెళ్ళి 'గజేంద్రమోక్షం' సంపూర్ణంగా తెలుసుకొనుటకు ప్రయత్నించండి.

# 3. ఊర్మిళా దేవి నిద్ర

జానపద స్త్రీలు పాడుకొనే పాటలలో ఊర్మిళా దేవి నిద్ర ఒకటి. దీనిని ఎవరు రాశారో, ఎప్పుడు రాశారో తెలియదు గాని ఈ పాట రామాయణ కథకు సంబంధించింది. 'స్త్రీల రామాయణపు పాటలు' అనే గ్రంథాన్ని సంకలనం చేసిన స్వర్గీయ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు దీనిని సేకరించి, పొందుపరిచారు. ప్రస్తుత పాఠ్యభాగం 'స్త్రీల రామాయణపు పాటలు' అనే గ్రంథం నుండి స్వీకరించడమైంది.

ఈ పాటలలోని కథలు రామాయణం లోనివి కావు. ప్రజల నోళ్ళలో ముఖ్యంగా స్త్రీల నోళ్ళల్లో నలిగిన ఈ పాటలు వారి అభిమానంతో, అమాయకత్వంతో చేసిన కొత్త కల్పనలతో రూపుదాల్చి మనసుకు ఆహ్లాదాన్ని కల్గించే విధంగా ఉంటాయి. వీటిలో వాడుకలో లేని పదాలు ఎన్నో ఉన్నాయి. లయ కోసం అక్షరాలను సాగదీయడం, కుదించడం కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా ఈ పాటలో స్త్రీల స్వభావం తెలుస్తుంది. ఈ పాట పాడుకొనేవారికి గాని, విన్న వారికి గాని మంచి ఫలితాలు లభిస్తాయని జానపదుల నమ్మకం.



'ఊర్మిళా దేవి నిద్ర' అనే ఈ జానపద కథ పాడుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ పాట నడకను గమనిస్తే 'కస్తూరి రంగ రంగా నా యన్న - కావేటి రంగ రంగా' అనే పాట వరుసకు అనుకూలంగా ఉంటుంది.

శ్రీరామ భూపాలుడూ పట్టాభిషిక్తుడై కొలువుండగా
భరత శత్రుఘ్ను లపుడూ సౌమిత్రి వరుస సేవలు సేయగా
మారుతాత్మజు లప్పుడూ రాఘవుల జేరి పాదము లొత్తగా
సుగ్రీవు డాకొలువులో కూర్మితో నమ్రుడై కొలువుండగా

తుంబురులు నారదులునూ యేతెంచి నిలిచి గానము సేయగా
రంభాదు లా సభలలో యెంతొ శుభ రమ్యముగ నాట్యమాడా
సనకాది మౌనీంద్రులూ కొలువులో శాస్త్రములు తర్కింపగా
సకల దేవతలు గొలువా ఉదయాన పుష్పవర్షము గురిసెనూ

సభ యంత కలయ జూచీ యేతెంచె సంతోషమున జానకీ
పతిముఖము జూచి నిలిచీ వినయముతొ పట్టి యంజలి గ్రక్కునా
"దేవ దేవేంద్ర వినుమా విన్నపము తెలిపెదను చిత్తగింపూ
ముందు మన మడవులకునూ - పోగాను ముద్దు మరదీ వెంటనూ

పయనమై రాగ జూచీ తన చెలియ పయన మాయెను ఊర్మిళా
వద్దు నీవుండు మనుచూ సౌమిత్రి మనల సేవింపవచ్చే
నాడు మొదలుగ శయ్యపై కనుమూసి నాతి పవళించి యుండే
ఇకనైన యానతిచ్చీ తమ్మునీ యిందుముఖి కడ కంపుడీ"

ప్రాణసఖి యీలాగునా కూర్మితో పలుకంగ విని రాముడూ
తలపోసి చూడ నెంతే తన మదికి తగు విచారము పుట్టెనూ
రమ్ము లక్ష్మణ గ్రక్కునా యుచితమా రమణి నెడబాసి యుండా
తడవాయె యికనైననూ ప్రియురాలి దగ్గరకు నీవు పొమ్ము

అన్న రాముని మాటకూ లక్ష్మణుడు చనుదెంచి గృహమునకునూ
ప్రాణనాయకి పాన్పునా గూర్చుండి భాషించే విరహమ్మునా
తన్ను తా మరచి యున్నా ఆ కొమ్మ తమకమున వణకదొడగే -

"అయ్య! మీరెవ్వరయ్య మీరింత యాగడమ్ముల కొస్తిరీ
ఎవ్వరూ లేనివేళా మీరిపుడు యేకాంతములకొస్తిరా
మా తండ్రి జనకరాజు వింటె మిము ఆజ్ఞసేయక మానరూ
మాయక్క బావ విన్నా మీకిపుడు ప్రాణముల హానివచ్చూ

మా యక్క మరది విన్నా మిమ్మిపుడు బ్రతుకనివ్వరు జగతిలో
హెచ్చయిన వంశానికీ అపకీర్తి వచ్చె నేనేమి చేతూ
కీర్తిగల యింట బుట్టీ అపకీర్తి వచ్చె నేనేమిచేతూ
ఒక డాలిగోరి గాదా ఇంద్రునికి వొడలెల్ల హీనమాయే

పరసతిని గోరి కాదా రావణుడు మూలముతొ హత మాయెనూ
ఇట్టి ద్రోహములు మీరూ యెరిగుండి యింత ద్రోహమున కొస్తురా
ఆడతోడను బుట్టరా మావంటి తల్లిలేదా మీకునూ"
అనుచు ఊర్మిళ పలుకగా లక్ష్మణుడు విని వగచి యిట్టులనెనూ

'శ్రీరాము తమ్ముండనే' - 'అత డనగ సృష్టిలో నొకరు గలరా
జనకు లల్లుడగానటే - భూమిలో జనకు లనగా నెవ్వరూ
సీత మరదిని గానటే - చేడెరో దయయుంచి మేలుకొనవే
నిన్ను బాసినది మొదలూ ప్రాణసఖి నిద్రాహారము లెరుగనే
నీవు లేకా యున్ననూ ఓ సఖీ! ప్రాణములు నిలుపలేనే'

అనుచు కన్నుల జలములూ కారంగ లక్ష్మణుడు తా బలికెనూ
కత్తి వరదీసి యపుడూ లక్ష్మణుడు తా వేసుకొందు ననెనూ
అనుచు వాదము సేయగా ఊర్మిలా దద్దిల్లిపడి లేచెనూ
ప్రాణేశు డగుట దెలసీ కోమలికి ప్రాణముల తేజరిల్లే.

_____ _____ _____ _____ _____ _____

_____ _____ _____ _____ _____ _____

ఊర్మిళా విరహమ్ములూ ఇది యెవరు పాడినా విన్నగానీ
శ్రీ విష్ణు కైవల్యమూ సౌమిత్రి విష్ణులోకము నిచ్చునూ.

## అభ్యాస వేదిక

### అర్థాలు:

| | | |
|---|---|---|
| భూపాలుడు | = | రాజు |
| సౌమిత్రి | = | సుమిత్రాదేవి కుమారుడు (లక్ష్మణుడు) |
| కూర్మి | = | ప్రేమ |
| నమ్రుడు | = | వంగినవాడు; వినయం కలవాడు |
| తర్కించు | = | చర్చించు |
| గ్రక్కున | = | వెంటనే |
| శయ్య | = | పాన్పు |

| | | |
|---|---|---|
| పవళించి | = | పండుకొని |
| తలపోసి | = | ఆలోచించి |
| కొమ్మ | = | స్త్రీ, చెట్టుకొమ్మ |
| ఆగడము | = | కానిపని, అకార్యం |
| దద్దిల్లి | = | దద్దరిల్లి |

భావాలు :

శ్రీరాముడు పట్టాభిషిక్తుడై ఉండగా భరతశత్రుఘ్నులు, సౌమిత్రి సేవలు చేస్తున్నారు. మారుతి మొదలగు వారు రాముని పాదాలు ఒత్తుతుండగా సుగ్రీవుడు ఆ కొలువులో ప్రేమతో ఆసీనుడై ఉన్నాడు. తుంబురుడు, నారదుడు గానం చేయగా, రంభ మొదలైనవారు రమ్యంగా నాట్యం చేస్తున్నారు. సనకాది మునీంద్రులు శాస్త్రాలు పరిశీలిస్తుండగా సకలదేవతలు కొలువు దీరిన ఆ ఉదయాన పూలవర్షం కురిసింది. జానకీదేవి సభనంతా జూచి సంతోషంతో భర్తకు నమస్కరిస్తూ దేవ దేవేంద్ర నాదొక విన్నపం మనం అడవులకు వెళుతుంటే ముద్దులమరిది మన వెంటనే పయనమయ్యాడు.

లక్ష్మణుని రాక జూచి తన చెలియ ఊర్మిళ వస్తుండగా వద్దు అని, సౌమిత్రి మనలను సేవింప వచ్చిన నాటి నుండి ఆమె పాన్పుపై నిద్రపోతోంది. ఇకనైనా మీ తమ్ముడు లక్ష్మణుని ఆమె వద్దకు పంపుము. అని జానకి రామునితో ప్రేమగా తెలుపగా, రాముడు జరిగినది ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకొని విచారించి లక్ష్మణుని పిలచి వెంటనే నీ భార్య దగ్గరకు వెళ్లమన్నాడు. అన్న మాట ప్రకారం లక్ష్మణుడు ఇంటికి వెళ్లి తన ప్రియురాలు పడుకున్న పాన్పు దగ్గరకు వెళ్లి ప్రేమతో పలకరించాడు. తనను మరిచిన ఆమె ఆ మాటలకు వణికి పోయింది. అయ్యా! మీరు ఎవరు? ఎవ్వరు లేని వేళ నా చెంతకు వచ్చారు. మా తండ్రి జనకరాజు వింటే మిమ్ములను ఆజ్ఞాపించక మానరు. మా అక్క బావ విన్న మీ ప్రాణాలకే ముప్పు వస్తుంది.

మా అక్కమరిది విన్న మిమ్ముబ్రతకనివ్వరు. ఈ సృష్టిలోనే ఎంతో కీర్తి కలిగిన వంశానికి అపకీర్తి వచ్చింది నేనేమి చేయాలి. పర స్త్రీలను వ్యామోహించి కదా ఇంద్రునికి ఒళ్ళు హీనమయింది. ఇతరుల భార్యలను కోరి కదా రావణుడు హతమైంది. ఇవి అన్ని తెలిసి కూడా మీరు ఈ ద్రోహానికి పూనుకున్నారా? మీకు తోడబుట్టినవారు, మా వంటి తల్లి లేదా అని పలికింది. దానికి లక్ష్మణుడు ఇలా అన్నాడు.

నేను శ్రీరాముడి తమ్ముడనే, జనకునికి అల్లుడనే, సీత మరిదినే మేలుకొనుము అంటాడు. నిన్ను ఎడబాసినది మొదలు నిద్రాహారాలు లేవు. నీవు లేక ప్రాణములు నిలుపగలనా? అనగా, గుర్తించని ఊర్మిళ కళ్ళ వెంట జలజల కన్నీరు కారగా, లక్ష్మణుడు ఇలా అంటాడు. ఒరలోనుంచి కత్తి తీసి తానేసుకొందు నంటూ వాదం చేశాడు. అంతటిలో ఊర్మిళ దద్దరిల్లి పడి లేచి తన ప్రాణేశుడని తెలిసి ఆ కోమలికి ప్రాణములు లేచి వచ్చినట్లయింది. ఈ ఊర్మిళా విరహమ్ములను ఎవరైనా పాడినా, విన్నా వారికి శ్రీ విష్ణువు కైవల్యాన్ని, సౌమిత్రి విష్ణులోకం ఇస్తాడు.

### ఈ క్రింది పదాలకు అర్థాలు రాయండి.

ఉదా॥ కూర్మి = ఆప్యాయం, అనురాగం, ప్రేమ

1. కొమ్మ =
2. రమ్యం =
3. రమణి =
4. ఆత్మజుడు =

### ఈ క్రింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. దేవతలు ×
2. సంతోషం ×

### ఈ క్రింది పదాలను జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. తుంబురుడు | ( ) | కూర్మితో నమ్రుడై |
| 2. సభయంతా | ( ) | ఊర్మిళాదేవి |
| 3. సుగ్రీవుడాకొలువులో | ( ) | కలయజూచీ |
| 4. లక్ష్మణుని భార్య | ( ) | నారదులునూ |

### ఈ క్రింది పదాలను సొంతవాక్యాలతో రాయండి.

ఉదా॥ అన్నదమ్ములు - రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అన్నదమ్ములు.

1. తుంబురుడు -
2. నిద్రాహారాలు -

### ఈ క్రింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

1. శ్రీరామ భూపాలుడూ ________________ కొలువుండగా.
2. రంభాదులా సభలలో యెంతొ శుభ ________________ నాట్యమాడా.
3. ________________ యింట బుట్టీ అపకీర్తి వచ్చె నేనేమి చేతూ.
4. శ్రీవిష్ణు ________________ సౌమిత్రి ________________ నిచ్చునూ.
5. ________________ వినుమా విన్నపము తెలిపెదను చిత్తగింపూ.

( కైవల్యమూ, విష్ణులోకము, దేవదేవేంద్ర, పట్టాభిషిక్తుడై, రమ్యముగా, కీర్తిగల)

### ఈ క్రింది ప్రకృతి పదాలకు - వికృతులను రాయండి.

ఉదా॥ బ్రహ్మ - బమ్మ, బొమ్మ

1. ఆజ్ఞ -
2. నిద్ర -

### ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

ఉదా: భూపాలుడు : రాజు, ప్రభువు, ఱేడు

1. కీర్తి :
2. వంశం :
3. గృహము :

### ఈ క్రింది వాటికి సంధికార్యాలు రాయండి.

ఉదా: మారుతాత్మజుడు = మారుత + ఆత్మజుడు

1. పట్టాభిషిక్తుడై

### ఈ క్రింది వాటిని (సంధి) కలిపి రాయండి.

ఉదా: ప్రాణ + ఈశుడు = ప్రాణేశుడు

1. మిమ్ము + ఇపుడు =

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. శ్రీరాముడి కొలువులో ఎవరెవరు ఉన్నారు?
2. కొలువులో శ్రీరాముడితో సీత ఏమని చెప్పింది?
3. లక్ష్మణుణ్ణి చూచి నిద్రిస్తున్న ఊర్మిళ ఏమని పలికింది?
4. ఊర్మిళ మాటలకు లక్ష్మణుడు ఏమని సమాధానం చెప్పాడు?

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. రామాయణ కథను వివరించాలి.
2. ఇతిహాసాలగురించి క్లుప్తంగా పరిచయం చేయాలి.

### విద్యార్థులు చేయవలసిన పనులు :

1. రామాయణ కథలు తెలుసుకోవడం
2. మీ ప్రాంతంలో ఉన్న జానపదగేయాల్ని సేకరించండి.



# 4. నాగులచవితి

- బసవరాజు వెంకట అప్పారావు

## కవి పరిచయం :

బసవరాజు వెంకట అప్పారావు క్రీ.శ.1894వ సంవత్సరం డిసెంబరు 13వ తేదిన కృష్ణాజిల్లా విజయవాడ దగ్గర పటమట గ్రామంలో జన్మించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ. చదివారు. వీరు 1916లో రాజ్యలక్ష్మమ్మను వివాహం చేసుకున్నారు. 1921లో ఆంధ్రపత్రిక, భారతి వంటి పత్రికలకు సహాయ సంపాదకులుగా పనిచేశారు. గాంధీ ఉద్యమంలో భాగంగా అనేక జాతీయ గీతాల్ని రాశారు. 1925లో 'బ్యాచిలర్ ఆఫ్ లా' (బి.ఎల్) పట్టాను పొందారు. ఆ తర్వాత 1927లో విజయవాడలో ప్రాక్టీసు పెట్టారు. వీరు 1933లో స్వర్గస్థులయ్యారు.

బసవరాజు అప్పారావుకు తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం ఉంది. కావ్యభాషను నిత్య వ్యావహారిక భాషకి సన్నిహితం చేసిన గొప్పకవి. గేయ కవితా రీతిని బహుముఖాలుగా నడిపిన కీర్తి వీరికే దక్కింది. బసవరాజు కవిత్వం సరళంగా, మధురంగా, స్వచ్ఛంగా, స్పష్టంగా ఉంటుంది. ప్రతి భావమూ స్పష్టతతో కూడి హృదయాన్ని హత్తుకొనేలా ఉంటుంది. ఈయన పాటల్లో తొలి చరణాలే పాఠకులను ఆకర్షించే విధంగా ఉంటాయి. వీరి రచనల్లో సెలయేటిగానం, బసవరాజు అప్పారావు గీతాలు అనే రెండు కవితా సంపుటాలు ప్రచురించబడ్డాయి.

'నాగులచవితి' అనే ప్రస్తుత పాఠ్యభాగం 'బసవరాజు అప్పారావు గీతాలు' నుండి స్వీకరించబడింది.'నాగులచవితి' అనే గేయం బసవరాజు అప్పారావు భక్తి కవితల్లో ప్రాచుర్యం పొందింది. దీనిలో పసిపాపలు బ్రహ్మస్వరూపులనీ వారిపై బుసలు కొట్టవద్దనీ, పగలనక రేయనక శ్రమించే శ్రమజీవులను కనిపెట్టి కరుణించమని కవి నాగులచవితి నాడు చేసే పూజలను గురించి నాగేంద్రునికి తెలియజేస్తూ తెలిపే సందర్భంలోనిది.

నీ పుట్టదరికి నా పాప లొచ్చేరు,
పాపపుణ్యమ్ములవాసనే లేని
బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి,
కోపించి బుస్సలు కొట్టబోకోయి!

నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

చీకటిలోన నీ శిరము తొక్కేము,
కసిదీర మమ్మల్ని కాటేయబోకు,
కోనపుట్టలోని కోడెనాగన్న
పగలు సాధించి మా ప్రాణాలు దీకు!

నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!



అర్ధరాత్రివేళ అపరాత్రివేళ
పాప మే మెఱుగని పసులు తిరిగేను,
ధరణికి జీవనాధారమై నట్టి!
వాటిని రోషాన కాటేయబోకు!

నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

అటుకొండ యిటుకొండ ఆ రెంటినడుమ
నాగులకొండలో నాట్యమాడేటి
దివ్యసుందరనాగ, దేహి యన్నాము,
కనిపెట్టి మమ్మెపుడు కాపాడవోయి!

నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

పగలనక రేయనక పనిపాటులందు
మునిగి తేలేటి నా మోహాల బరిణె
కంచెలూ కంపలూ గడిచేటి వేళ
కంపచాటుననుండి కొంపదీకోయి!

నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

## అభ్యాసవేదిక

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పసికూనలు | = | చిన్న బిడ్డలు |
| బ్రహ్మస్వరూపులు | = | దైవస్వరూపులు |
| కోడెనాగన్న | = | యౌవనంలో ఉన్న పాము |
| అపరాత్రి వేళ | = | అర్ధరాత్రి వేళ |
| జీవనాధారం | = | బ్రతకటానికి ఆధారం |
| దేహియన్నాము | = | వేడుకున్నాం |

**భావాలు :**

ఓ నాగేంద్రా! నీ పుట్టదగ్గరికి ఎటువంటి పాపపుణ్యాలు తెలియని మా పసిబిడ్డలు వస్తారు. వీరు దేవుళ్ళ రూపాలైన పసివాళ్ళు. అటువంటి వారిపై నీవు కోపంతో పడగెత్తి బుసలు కొట్టవద్దు. నాగులచవితికి నీకు కడుపు నిండా పాలు పోసి, నిన్ను భక్తితో పూజిస్తాం తండ్రీ!

ఓ నాగేంద్రా! చీకట్లో మేము తెలిసో, తెలియకో నీ తలను తొక్కుతాం. కసితో నీవు మమ్మల్ని కాటువెయ్యవద్దు. పుట్టలో ఉండే ఓ యువ నాగరాజా! మాపై పగబట్టి మా ప్రాణాల్ని తియ్యవద్దు. నాగులచవితికి నీకు కడుపు నిండా పాలు పోసి, నిన్ను భక్తితో పూజిస్తాం తండ్రీ!

ఓ నాగేంద్రా! పాపాలు తెలియని మేము అర్ధరాత్రిలో, తెల్లవారు జామున పొలాల్లో పనులు చేస్తూ తిరుగుతూ ఉంటాం. ఈ భూమిపై మాకు అదే జీవనాధారం. కాబట్టి నీవు రోషంతో మమ్మల్ని కాటువెయ్యవద్దు. నాగులచవితికి నీకు కడుపు నిండా పాలు పోసి, నిన్ను భక్తితో పూజిస్తాం తండ్రీ!

ఓ నాగరాజా! అటువైపు, ఇటువైపు కొండలమధ్య గల నాగులకొండల్లో నీవు నాట్యం చేస్తూ, చాలా అందంగా ఉంటావు. అటువంటి నిన్ను మేము పూజిస్తున్నాం. నీవే ఎల్లప్పుడూ మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడాలి. నాగులచవితికి నీకు కడుపు నిండా పాలు పోసి, నిన్ను భక్తితో పూజిస్తాం తండ్రీ!

ఓ నాగేంద్రా! పగలు, రాత్రి అనే భేదం లేకుండా నా ప్రియురాలు పొలాల పనుల్లో మునిగిపోతుంది. కంచెల్ని, ముళ్ళపొదల్ని దాటేటప్పుడు చాటుగా ఉండి కాటువేసి చంపవద్దు. నాగులచవితికి నీకు కడుపు నిండా పాలు పోసి, నిన్ను భక్తితో పూజిస్తాం తండ్రీ!

**ఈ క్రింది పదాలకు అర్థాలు గుర్తించండి.**

ఉదా॥ కొంప = చెఱువు / కొండ / ఇల్లు

1. ధరణి = భూమి / ఆకాశం / సముద్రం
2. శిరము = తోక / కడుపు / తల

## ఈ క్రింది వాక్యాల్లో గుర్తించిన పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

ఉదా॥ గదిలో వెలుగుతున్న దీపం ఆరిపోతే చీకటి వస్తుంది.

1. నక్షత్రాలు పగలు కనపడవు. ________________ సమయంలో కన్పిస్తాయి.
2. బెండు నీటిలో తేలుట, రాయి నీటిలో ________________ సహజ ధర్మం.

## ఈ క్రింది పదాలను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | నీ పుట్ట దగ్గరికి | ( ) | అ. కోడెనాగన్న |
| 2. | కోనపుట్టలోని | ( ) | ఆ. నా పాపలొచ్చేరు |
| 3. | అర్ధరాత్రివేళ | ( ) | ఇ. కాపాడవోయి |
| 4. | కనిపెట్టి మమ్మొపుడు | ( ) | ఈ. కొంపదీ కోయి |
| 5. | కంపచాటున నుండి | ( ) | ఉ. అపరాత్రి వేళ |

## ఈ క్రింది పదాలను సొంత వాక్యాలలో రాయండి.

ఉదా॥ జీవనాధారం = గ్రామీణులకు వ్యవసాయం జీవనాధారం.

1. పగబట్టి =
2. పాపపుణ్యాలు =

## ఈ క్రింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

1. బ్రహ్మస్వరూపలౌ ________________ లోయి.
2. చీకటిలోన నీ ________________ తొక్కేము.
3. ధరణికి ________________ వాటిని.
4. పగలనక రేయనక ________________ లందు.
5. కంచెలూ కంపలూ ________________ వేళ.

(జీవనాధారమైనట్టి, పనిపాటు, గడిచేటి, శిరము, పసికూన)

## ఈ క్రింది పదాలకు ప్రకృతి - వికృతులను రాయండి.

ఉదా॥ పుణ్యం - పున్నెం

1. పశువులు -
2. రాత్రి -

## ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

ఉదా॥ ధరణి = భూమి, వసుధ, వసుంధర,

1. శిరము =
2. కొంప =

### ఈ క్రింది పదాలకు సంధి కార్యాలు రాయండి.

ఉదా॥ కాటేయబోకు = కాటు + ఏయబోకు

1. నాగేంద్ర =

### ఈ క్రింది పదాలను సంధి కలిపి రాయండి.

1. పడగ + ఎత్తి =
2. జీవన + ఆధారం =

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పసిపిల్లల్ని కవి ఏ విధంగా వర్ణించాడు?
2. పుట్ట దగ్గరకొచ్చే పసిపిల్లలను కాటువేయవద్దని కవి ఎలా మొరపెట్టుకున్నాడు?
3. పొరపాటున తలను తొక్కితే కరుణించమని కవి ఏ విధంగా వివరించారు?
4. పొలం పనులు చేసేటపుడు కాపాడమని నాగేంద్రుని కవి ఏమని ప్రార్థించాడు?
5. నాట్యం చేసేటపుడు నాగరాజు ఎలా ఉన్నాడో తెల్పండి?
6. నాగులచవితి పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి?

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. మన సంస్కృతిలో నాగులచవితి విశిష్టతను గూర్చి పిల్లలకు తెలియజేయాలి.
2. పాముల స్వభావాన్ని తెలియజేయాలి.
3. పండుగలకు సంబంధించి రసప్రశ్నావళి(క్విజ్)కార్యక్రమాన్ని నిర్వహించాలి.

### విద్యార్థులు చేయవలసిన పనులు :

1. నాగులచవితి పండుగ గురించి మీ పెద్దలను అడగాలి.
2. పాములపట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలి.
3. మీ ఇళ్లలో నాగులచవితి పండుగ ఏ విధంగా జరుపుకుంటారో, దానికి సంబంధించిన వ్యాసం రాసుకు రండి.



# 5. కృషీవలుడు

- దువ్వూరి రామిరెడ్డి

**కవి పరిచయం :**

శ్రీ దువ్వూరి రామిరెడ్డి నెల్లూరు జిల్లా గూడూరులో క్రీ.శ. 1895 వ సం॥లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, సుబ్బారెడ్డి. ఈయన స్వయంకృషితో అనేక విద్యలు నేర్చుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహిత్య లోకంలో తనదైన ప్రత్యేకత కలవారు.

'రసిక జనానందము, బాణ విలాసం, జలదాంగన, యమస్వప్నం, కడపటి వీడ్కోలు, పలితకేశం, కవి - రవి' మొదలగునవి వీరి రచనలు. వీరి రచనలు కవికోకిలగ్రంథావళి పేరుతో ఏడు సంపుటాలుగా ప్రచురించబడ్డాయి. రామిరెడ్డి రచనల్నే 'Voice of the Reed' అనే ఇంగ్లీషు గ్రంథంగా ప్రచురించారు. ఉమర్ ఖయ్యామ్ రచించిన రుబాయితులను 'పానశాల' అనే పేరుతో ఆంధ్రీకరించారు. వీరికి కళా విమర్శక, కవికోకిల అనే బిరుదులు కలవు. వీరి రచనాశైలి పాఠకులకు సులభంగా అర్థమయ్యేటట్లు ఉండడం వీరి ప్రత్యేకతగా చెప్పవచ్చు.

ఈ పాఠ్యభాగం కృషీవలుడు అనే 'ఖండకావ్యం' నుండి గ్రహింపబడినది.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో రైతు జీవితాన్ని పసులకాపర్ల ఆటపాటల్ని వర్ణించే రచనలు అక్కడక్కడా ఉన్నాయి. కాని కృషీవలుడే కథానాయకుడైన కావ్యమేదీ లేదు. ఈ లోటును పూరించటానికా అన్నట్లు దువ్వూరి రామిరెడ్డి కర్షకవిలాసం, కృషీవలుడు అనే కావ్యాల్ని రచించారు. కృషీవలుడైన రామిరెడ్డి వ్యవసాయదారుడు స్వయంగా వ్యవసాయ పనుల్లో పాల్గొని కర్షకుల కష్టసుఖాలను తెలుసుకొన్నాడు. ఆ కర్షకుని జీవితంలో గల సారాంశాన్ని వివరించడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.



1. తే. సైరికా! నీవు భారతక్ష్మాతలాత్మ
గౌరవ పవిత్రమూర్తివి! శూరమణివి!
ధారుణీపతి పాలనదండ మెపుడు
నీ హలంబు కన్నను బ్రార్థనీయ మగునె?

2. తే. దైవకావశ్యకమ్ముల దాటిఁపోవ
వెగుర ఱెక్కలురాని నీయిచ్ఛలెపుడుఁ;
బైరుపచ్చలె యవధిగా బ్రాఁకుచుండ
నీ విచారము, నూహయు, నిపుణతయును

3. *తే. ప్రొద్దువొడిచిన దాదిగాఁబ్రొద్దు గ్రుంకు
వఱకుఁ గష్టింతువే గాని యిరుగు, పొరుగు
వారి సంపదకై యీసుఁ గూరఁబోవ
వెంత నిర్మలమోయి నీ హృదయకళిక!

4. తే. పల్లె యెల్లయె సర్వప్రపంచసీమ!
ప్రియ యొకర్తయె రమణీయ విగ్రహంబు!
బంగరుం బంటపొలములే భాగ్యనిధులు!
అనుదిన పరిశ్రమయె మత మగును నీకు.

5. *తే. ఉండి తిన్నను లేక పస్తున్నఁ గాని
యాసచేయవు పరుల కష్టార్జితంబు!
నాఁకలెత్తగ నీపంచ కరుగు నతిథి
తినక, త్రావక, పోయిన దినమె లేదు.

6. *తే. కృషి సకల పరిశ్రమలకు గీలుచీల
సత్పరిశ్రమ వాణిజ్యసాధనంబు
అఖిలవాణిజ్యములు సిరి కాటపట్లు
సిరియె భోగోపలబ్ధికి జీవగఱ్ఱ

7. తే. కావున గృషీవలా, నీవె కారణమవు
సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు
ఫల మనుభవించువారలు పరులు; నీకుఁ
గట్ట గుడువను గఱవె యెక్కాలమందు!

8. తే. కల్యకాంతికి మున్నంధకారరాత్రి
వర్షపాతంబునకు మున్ను వారిదముల
ఢమఢమాడంబరంబులు నమరు; నిదియుఁ;
బ్రకృతిభావంబునకు నూత్నపథముగాదు.

## అభ్యాస వేదిక

### అర్థాలు :

| | | |
|---|---|---|
| సైరికా | = | కర్షకా |
| హలంబు | = | నాగలి |
| శూరమణి | = | వీరుల్లో శ్రేష్ఠుడు |
| కల్యకాంతి | = | వేకువ |
| వారిదములు | = | మేఘములు |
| అంధకార రాత్రి | = | చీకటి రాత్రి |
| భారతక్ష్మాతలాత్మ | = | భారత దేశపుఆత్మ |

### భావాలు:

1. ఓ కర్షకుడా! నువ్వు భారత భూభాగంలో గౌరవింపదగ్గ పవిత్ర స్వరూపుడవు. పరాక్రమవంతుడవు! రాజదండం నీ నాగలి కంటె ప్రార్థనీయం కాదు.
2. రెక్కలురాని నీ కోర్కెలు నిత్యావసరాలను మించి సాగవు. నీ ఆలోచన, ఊహ, నైపుణ్యం పైరుపచ్చ పరిధిలోనే సాగుతుంది.
3. పగలంతా కష్టపడతావు గాని నువ్వు ఇతరుల్ని జూచి ఈర్ష్యపడవు. ఎంత నిర్మలమైనది నీ మనస్సు.
4. పల్లె నీకు సర్వస్వం. పంట పొలాలే భాగ్యనిధులు. నీ భార్యయే నీకు రమణీయమైన విగ్రహం. నిరంతర శ్రమయే నీ మతం.
5. తిన్నా తినకున్నా ఇతరుల సొమ్ముకోసం ఆశ పడవు. ఆకలితో వచ్చిన అతిథులను సంతృప్తి పరచక పంపవు.
6. సకల పరిశ్రమలకు వ్యవసాయం ఆధారం. మంచి పరిశ్రమలు వాణిజ్య సాధనాలు. సకల వాణిజ్యం డబ్బుకు నిలయమైనది. భోగాలనుభవించటానికి సంపద ఆధారం.
7. సామాజిక సౌభాగ్య, సౌఖ్యాలకు రైతే కారణం. ఇతరులు నీ శ్రమ ఫలాన్ని అనుభవిస్తున్నారు. నీకు మాత్రం కట్టడానికి, తింటానికి లేదు.

8. వెలుగుకు ముందు చీకటి రాత్రి, వర్షానికి ముందు మేఘాలు ఆడంబరాన్ని ప్రదర్శిస్తాయి. ప్రకృతిలో ఇది సహజం. ఇది కొత్త విషయం కాదు.

### ఈ క్రింది పదాలను విడదీసి సంధి పేర్లు రాయండి.

ఉదా॥ ప్రొద్దువొడిచిన = ప్రొద్దు + పొడిచిన = గసడదవాదేశ సంధి

1. భోగోపలబ్ధి =
2. కష్టార్జితం =
3. సత్కవీశ =

### ఈ క్రింది పదాలకు ప్రకృతి వికృతులను రాయండి.

ఉదా ॥ రాజ - రాచ

1. శ్రీ -
2. ఖడ్గం -
3. హృదయం -

### ఈ క్రింది వాటికి వ్యతిరేక పదాలు తెల్పండి.

ఉదా ॥ స్వాతంత్ర్యం × పరతంత్రం

1. పండు ×
2. నేల ×

### ఈ క్రింది పదాలకు సొంత వాక్యాలు రాయండి.

ఉదా ॥ ప్రాణాధారం : సమస్త ప్రజలకు నీరే ప్రాణాధారం.

1. పైరుపచ్చలు :
2. జీవగఱ్ఱ :
3. పక్షపాతి :

### ఈ క్రింది పదాలను జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. కర్షకుడు | (  ) | అ. వెలుతురు |
| 2. పల్లెలు | (  ) | ఆ. వర్షం |
| 3. వాణిజ్యం | (  ) | ఇ. నాగలి |

4. మేఘాలు ( ) ఈ. పంటలు

5. పగలు ( ) ఉ. పరిశ్రమ

## ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

ఉదా॥ కర్షకుడు : రైతు, హాలికుడు, వ్యవసాయదారుడు

1. కాంక్ష :
2. శౌర్యం :

## ఈ క్రింది ఖాళీలను పూరించండి.

1. ధారుణీపతి పాలన దండమెపుడు____________________కన్నను బ్రార్థనీయమగునె.

2. పల్లె యెల్లయె____________________సీమ

3. అఖిలవాణిజ్యములు ______________ కాటపట్లు

## ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. కర్షకుని గొప్పతనాన్ని రాయండి?
2. కర్షకుని మనస్సు ఎలాంటిది?
3. కర్షకుని పల్లె, వ్యవసాయం ఎలాంటిది?
4. కర్షకునికి వెలుగు, చీకటి ఎలాఉంటాయి?

## ఉపాధ్యాయులకు సూచనలు :

1. రైతులు ఎలాంటి పంటలు పండిస్తారు, వారి జీవన విధానం తెలపాలి.
2. వ్యవసాయానికి ఉపయోగించే పనిముట్లు విద్యార్థులకు వివరించాలి.
3. ఏ యే కాలంలో ఏ యే పంటలు పండిస్తారో కూడా తెలపాలి.

## విద్యార్థులకు సూచనలు :

1. మీ గ్రామంలో పండించే పంటలు తెలుసుకోవాలి.
2. మీ గ్రామంలోని కర్షకుల జీవితాన్ని వ్యాసంగా రాయాలి.
3. ప్రకృతిని కవిత ద్వారా చెప్పడానికి ప్రయత్నించాలి.

# 6. జన్మభూమి

- రాయప్రోలు సుబ్బారావు

**కవి పరిచయం :**

భరతపుత్రుడ నంచు భక్తితో పలకమని గొంతెత్తి గానమొనర్చిన మహాకవి రాయప్రోలు సుబ్బారావు. వీరు గుంటూరు జిల్లా బాపట్ల తాలుకా గార్లపాడులో 1892 మార్చి 13వ తేదిన జన్మించారు. వీరు విద్యను బాపట్ల ఉన్నత పాఠశాలలోను, గుంటూరు క్రైస్తవ కళాశాలలోను, హైదరాబాద్ నిజాం కళాశాలలోను గడించారు. శాంతినికేతనంలో రవీంద్రనాథ్ సన్నిధిలో కవిత్వ రహస్యాలు తెలుసుకున్నారు. బెంగాలీ, హిందీ భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. 1921 సం॥ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఆపైన 1935లో రీడరుగా, ఆ తర్వాత ప్రొఫెసరుగా ఉండి 1950లో పదవీ విరమణ చేశారు. 1956 నుండి 1959 వరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రారంభం నుంచి 1968 సం॥ వరకు కార్యనిర్వాహక సభ్యులుగా పనిచేశారు. డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డి గారితోపాటు 'నవ్య సాహిత్య పరిషత్తు'కు సంయుక్త అధ్యక్షులుగా పనిచేశారు. భావకవులలో వీరు పేర్కొనదగ్గవారు. భావకవితా పితామహుడుగా కీర్తించబడ్డారు.

రాయప్రోలు సుబ్బారావు భావాలలో, పోడిమిలో, పోకడలో తియ్యని మెత్తని పదాలను సున్నితంగా శ్రావ్యంగా నాజూకుగా రూపొందించడంలో గొప్పనేర్పరి. వీరి రచనలు జడకుచ్చులు, తెనుగుతోట, తృణకంకణం, మాధురీ దర్శనం, కష్టకమల, లలిత, స్నేహలత, స్వప్నకుమారం, వనమాల మొదలైనవి.ప్రస్తుత 'జన్మభూమి' అనే గేయం 'వైతాళికులు' అనే సంకలన గ్రంథం నుండి గ్రహించబడింది. జాతీయ కవితా పురంధ్రికి ఈ గేయం శిరోభూషణం లాంటిది. అంతేగాక వీరి భారతీయ కవితల్లో దేశమాత సర్వసౌభాగ్య సంపన్నమైన మహాధాత్రిగా, సకలగుణాచారణియగు సాధ్వీమతల్లిగా దర్శనమిస్తోంది. అలాగే మాతృభూమి గొప్పతనం, సంస్కృతి, కీర్తిప్రతిష్ఠలను గూర్చి వివరించడమే ఈ పాఠ్యభాగం.



ఏ దేశమేగినా, ఎందు కాలిడిన,
ఏ పీఠ మెక్కినా, ఎవ్వ రే మనిన,

పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలుపరా నీ జాతి నిండు గౌరవము.

ఏ పూర్వపుణ్యమో, ఏ యోగ బలమొ,
జనియించినాడ వీ స్వర్గ ఖండమున;

ఏ మంచి పూవులన్ ప్రేమించి నావొ,
నిను మోసె ఈ తల్లి కనకగర్భమున.

లేదురా ఇటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరు లిం కెందు.

సూర్యుని వెలుతురుల్ సోకునందాక,
ఓడలజెండాలు ఆడునందాక,
నరుడు ప్రాణాలతో నడుచునందాక
అందాక గలఈ యనంత భూతలిని
మన భూమివంటి చల్లని తల్లిలేదు;

పాడరా నీ తెన్గు బాలగీతములు,
పాడరా నీ వీర భావ భారతము,

తమ తపస్సులు ఋషుల్ ధారవోయంగ,
శౌర్య హారము రాజ చంద్రు లర్పింప,
భావ సూత్రము కవి ప్రభువు లల్లంగ,

రాగ దుగ్ధము భక్త రత్నముల్ పిదుక,
దిక్కుల కెగదన్ను తేజమ్ము వెలుగ,
రాళ్ళ తేనియ లూరు రాగాలు సాగ,
జగములనూగించు మగతనం బెగయ,
సౌందర్య మెగబోయు సాహిత్య మలర,

వెలిగిన దీ దివ్య విశ్వంబు పుత్ర!
దీపించె నీ పుణ్య దేశంబు పుత్ర!

పొలములరత్నాలు మొలిచెరా యిచట,
వార్ధిలో ముత్యాలు పండెరా యిచట,
పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు,
కానలకస్తూరి కాచెరా మనకు,
అవమాన మేలరా! అనుమాన మేల
భారతీయుడ నంచు భక్తితో పాడ!

పొగడరా నీ తల్లి భూమి భారతిని!
నిలుపరా నీ జాతి నిండు గౌరవంబు!

## అభ్యాస వేదిక

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ఏగుట | = | వెళ్ళుట |
| పీఠము | = | సింహాసనం |
| ధీరుడు | = | ధైర్యశాలి |
| కనకము | = | బంగారం |
| అనంతము | = | అంతులేని |
| భూతలి | = | భూమి |
| దుగ్ధము | = | పాలు |
| ధారపోయు | = | సమర్పించు |
| చండవీర్యము | = | మిక్కిలిశౌర్యం |

**భావాలు :**

ఓ భారతీయుడా! నీవు ఏ దేశానికి వెళ్ళినా, ఎటువంటి ఉన్నత పదవిలో ఉన్నా, నీకు ఎవరు ఎదురైనా నీ కన్న తల్లి భారతదేశాన్ని పొగడాలి. భారతజాతి సంస్కృతి గొప్పతనాన్ని చాటుతూ ఇటువంటి పుణ్యభూమి ఎక్కడా లేదంటూ నీ జాతి నిండు గౌరవాన్ని తెలపాలి.

నీ పూర్వ జన్మ పుణ్యం వలనో, ఏ యోగం వలనో ఈ భరతభూమిలో జన్మించావు. మన భూమివంటి సుందర భూమి ప్రపంచంలో లేదు. ఇది స్వర్గంతో సమానమైంది. ఈ భరతభూమిలో జన్మించిన మన వంటి పౌరులు ఎక్కడా లేరు.

సూర్యుడి వెలుగు ఈ భూమిపై పడేవరకు, ఓడలపై జెండాలు ఎగిరేంత వరకు, మానవజాతి ఉన్నంతవరకు, ఈ అనంత ప్రపంచంలో మన భారతదేశం వంటి పుణ్య భూమి మరొక్కటి లేదు.

పాడండి నీ తెలుగు బాలగీతాలను, పాడండి నీ వీర భారతాన్ని. ఋషుల తపస్సు, వీరుల పరాక్రమం, సంగీత విద్వాంసుల రాగమాధుర్యం, కవుల కవితా సౌందర్యం నలుదిక్కుల వ్యాపించి పేరుప్రతిష్ఠలకు మనభూమి నెలవైంది. రాళ్ళను కరిగించే సంగీతం, సొగసు వెదజల్లే సాహిత్యం, శిల్ప సౌందర్యం ఈ భారతదేశంలో వ్యాపించి కీర్తి నార్జించాయి. ఈ భూమిలో రత్నాలు, ముత్యాలు ఇంకా దివ్య ఔషధాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఇంకా నీ మాతృభూమిపై నీకు అనుమానమెందుకు? భరతపుత్రుడనని చెప్పుకోవడానికి నీకు అవమానమెందుకు? నేను భారతీయుడనని గర్వంతో ఎలుగెత్తి చాటు. నీ తల్లి భూమాత గొప్పతనాన్ని, నీ జాతి నిండు గౌరవాన్ని గర్వంతో ఎలుగెత్తి పాడు.

## ఈ క్రింది పదాలకు అర్థాలు రాయండి

ఉదా॥ కనకం = బంగారం

1. జగం =
2. తేజం =
3. సౌందర్యం =
4. జనియించు =

## ఈ క్రింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. అంతం ×
2. స్వర్గం ×

## ఈ క్రింది పదాలను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | ఏ పూర్వ పుణ్యమో | (  ) | అ. సాహిత్యమలర |
| 2. | ఓడలజెండాలు | (  ) | ఆ. రాజ చంద్రు లర్పింప |
| 3. | ఏ పీఠమెక్కినా | (  ) | ఇ. ఏ యోగ బలమొ |
| 4. | శౌర్య హారము | (  ) | ఈ. ఆడునందాక |
| 5. | సౌందర్యమెగబోయు | (  ) | ఉ. ఎవ్వరేమనిన |

## ఈ క్రింది పదాలను సొంతవాక్యాలలో రాయండి.

ఉదా॥ ధీరుడు = అల్లూరి సీతారామరాజు ఆంగ్లేయుల్ని ఎదిరించిన గొప్పధీరుడు.

1. గౌరవం =
2. సౌందర్యం =

## ఈ క్రింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

1. ఏ దేశమేగినా ________________.
2. ________________ నీ తల్లి భూమి భారతిని.
3. నిలుపరా నీ జాతి నిండు ________________.

4. మన భూమి వంటి _________________ లేదు.
5. భారతీయుడ నంచు _________________ పాడ.
(గౌరవము, పొగడరా, ఎందుకాలిడిన, భక్తితో, చల్లని తల్లి)

### ఈ క్రింది పదాలకు ప్రకృతి - వికృతులను రాయండి.

ఉదా॥ గౌరవం - గారవం

1. పుణ్యం -
2. భక్తి -

### ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

ఉదా॥ జెండా = పతాకం, ధ్వజం, కేతనం

1. కనకం =
2. భూమి =

### ఈ క్రింది వాటికి సంధి కార్యాలు రాయండి.

ఉదా॥ ధారవోయంగ = ధార + పోయంగ

1. ఏ పీఠమెక్కినా =

### ఈ క్రింది వాటిని (సంధి) కలిపి రాయండి.

1. అవమానము + ఏలరా =
2. కాలు + ఇడిన =

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. జన్మభూమి గొప్పదనాన్ని గూర్చి వ్రాయండి?
2. మన భూమివంటి కమ్మని భూమిలేదు, వివరించండి?
3. త్యాగాలు ధారపోసిందెవరు?
4. రాయప్రోలు సుబ్బారావు గురించి రాయండి?

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. దేశభక్తి అంటే ఏమిటో విద్యార్థులకు తెలియచేయాలి.
2. దేశభక్తి రచనలను కొన్నింటిని విద్యార్థులకు పరిచయం చేయాలి.

### విద్యార్థులు చేయవలసిన పనులు :

1. దేశభక్తిని గూర్చి తెలుసుకోండి.
2. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్ళి దేశభక్తి గీతాల్ని సేకరించి పఠించండి..

# 7. కాంక్ష

- వేదులసత్యనారాయణ శాస్త్రి

**కవి పరిచయం :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో భావకవితాయుగంలో ప్రసిద్ధి పొందిన కవులలో వేదులసత్యనారాయణ శాస్త్రి ఒకరు. 'దీపావళి' వారి ప్రసిద్ధ కవితా సంకలనం. 'గౌతమీకోకిల'గా వేదులవారు ప్రసిద్ధి పొందారు. వేదులవారి కవిత ఎంత నవ్యమో అంత సంప్రదాయ సిద్ధం కూడా. వేదులసత్యనారాయణశాస్త్రి 'సాహితీ సమితి' సభ్యులుగా సాహిత్య సేవ చేశారు. ఎంత కష్టమైన భావాన్నైనా పద్యంలో సుఖంగా, సరళీకరించగలదిట్ట శాస్త్రి.

ప్రస్తుత పాఠ్యభాగంలో పువ్వు - ధనవంతులవిగ్రహాల మెడలలోనో, రాజులపాదాలపైనో అలంకారంగా ఉండిపోవటం తనకు ఇష్టం లేదని, మాతృదేశ దాస్యవిముక్తి కోసం ప్రాణాలు అర్పించిన వారి సమాధులపైన రాలిపోవాలని తన కోరికను తెలియజేస్తున్నది.

1.ఉ. ఈ సుమజన్మ మెట్లొ ఘటియిల్లెను నాకొకనాటి పాటిదై
వాసనలీను సోయగము వాయని తీయని పోడుముల్ క్షణం
బో, సగమో, విచార పడఁ బోనయినన్ విడివడ్డ నాయెదన్
మోసులువారు నూతన మనోరథమామని వేడి పొంగులన్






2.ఉ. పేదలరక్తమాంసములఁ బెంపువహించి దయాసుధారసా
స్వాద దరిద్రులైన ధనవంతులపెద్దరికమ్ముకై మతో
న్మాదము పెంచు దేవునికి మారుగ నిల్చిన రాతి బొమ్మలం
దూదరవోవు పాడు బ్రదుకొక్క నిమేషము సైప నాయెదన్



3.ఉ. తేనెలకోసమై కొదమతేటులదాటులొనర్చు నృత్యగీ
తానునయమ్ముగాని, మలయానిలు కౌఁగిట బుల్కరించు సౌ
ఖ్యానుభవమ్ముగాని, తరుణారుణ రాగ కదుష్ణచుంబన
శ్రీనవకమ్ముగాని పరితృప్తి యొసంగవు నాకొకింతయున్






4.ఉ. కానుకనై ధరా ధిపులకాళ్ల కడం బొరలాడి వాడిపో
లేను, ధరాపరాగ పటలీమలినమ్మగు ద్వార తోరణా
స్థానమునందురింబడఁగఁ జాలను, దోసిటి పేరి ఘోరకా
రానరకమ్ము నందుసురు రాల్పగ లేను నిమేష రక్తికై



నీచపు దాస్య వృత్తి మన నేరనిశూరత మాతృదేశ సే
వాచరణమ్ము నందసువులర్పణ జేసినవారి పార్థివ
శ్రీ చెలువారు చోటఁ దదసృగ్రుచులన్ వికసించి, వాసనల్
వీచుచు, రాలిపోవగవలెం దదుదాత్త సమాధి మృత్తికన్





భావాలు:

1. ఒక నాటి పుణ్యం కొద్దీ నాకీ పువ్వు జన్మ లభించింది. వాసనలు ఈనే అందం, విడువని తీయని అనుభవాలు క్షణం కావచ్చు, అరక్షణం కావచ్చు. నేను విచారించను. అయినా వసంత ఋతువు వేడి పొంగులలో నా హృదయంలో కొత్త కోరికలు మొలకలెత్తు తున్నాయి.

2. పేదల రక్తమాంసాలతో బలిసి దయామృతం రుచి తెలియని ధనవంతులపెద్దరికంకోసం దేవుడిపేరుమీదగా మతోన్మాదాలను పెంచుతూ నిలిచిన రాతి బొమ్మలమీద వాడిపోయే బ్రతుకుని ఒక్క నిమిషం కూడా నేను భరించలేను.

3. తేనెలకోసం గండు తుమ్మెదలగుంపులు నృత్యాలతో చేసే ఊరడింపులుగాని, మలయమారుతాలకౌగిలిలో పులకరించే సౌఖ్యానుభవంగాని, అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు అనురాగంతో వెచ్చవెచ్చగా కురిపించే ముద్దులలోని మెత్తదనంగాని నన్ను కొంచెంకూడా సంతృప్తి పరచలేవు.

4. రాజులపాదాలదగ్గర కానుకగా పొరలాడి వాడిపోలేను. నేలపై నుంచి లేచే దుమ్ముతో మలినమైన ద్వార తోరణాలలో వేలాడుతూ ఉండలేను. ఒక్క నిమిషం లభించే ఆనందం కోసం దోసిటి కారాగారంలో అసువులు అర్పించలేను.

5. నీచమైన దాస్య జీవితాన్ని భరించక శౌర్యంతో మాతృదేశ సేవ చేయటంలో ప్రాణాలు అర్పించిన వీరులశరీరాలు ఉన్నచోట, వారి రక్తపు కాంతులలో వికసించి, వాసనలు వీస్తూ, వారి సమాధిపైన రాలిపోవాలని నా కోరిక.

## అభ్యాసవేదిక

అర్థాలు :

| | | |
|---|---|---|
| ఘటిల్లు | = | కలుగు |
| సోయగం | = | అందం |
| పోడుములు | = | సౌందర్యాలు |

| | | |
|---|---|---|
| మోసులువారు | = | మొలకెత్తు |
| ఆమని | = | వసంత ఋతువు |
| కొదమతేటులు | = | గండు తుమ్మెదలు |
| దాటులు | = | గుంపులు |
| కదుష్ణ | = | నులివెచ్చని |
| చుంబనం | = | ముద్దు |
| నవకం | = | మెత్తదనం |
| అసువులు | = | ప్రాణాలు |
| తత్+అసృక్+రుచులు | = | వారి రక్తపు కాంతులు |
| పరాగం | = | దుమ్ము |
| పటలి | = | సమూహం |
| మృత్తిక | = | మట్టి |
| అనునయం | = | ఊరడింపు |

### ఈ క్రింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.

1. సోయగం
2. పెద్దరికం
3. మత్తోన్మాదం

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. మనుష్యులు పువ్వులను ఎన్ని రకాలుగా ఉపయోగిస్తారు?
2. పువ్వు తనను ఏవి సంతృప్తి పరచవని అంటున్నది?
3. పువ్వు ఎక్కడ, ఎట్లా రాలిపోవాలని కోరుకుంటున్నది.
4. 'కాంక్ష' కవిత ద్వారా కవి ఏమి ఉద్దేశిస్తున్నాడు.

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. దేశభక్తి అంటే ఏమిటో విద్యార్థులకు వివరించండి.
2. గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ మొదలైన వారి దేశభక్తి రచనలను గురించి వివరించండి.
3. జాతీయోద్యమ గీతాలు రాసిన గరిమెళ్ల సత్యనారాయణ వంటి వారిని పరిచయం చేయండి.

### విద్యార్థులకు సూచనలు :

1. దేశభక్తి గేయాలను, కవితలను చదవాలి, పాడాలి.
2. స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను గురించి తెలుసుకోవాలి.

# 1. మిత్రలాభం

- పరవస్తు చిన్నయసూరి

## కవిపరిచయం

పరవస్తు చిన్నయసూరి 1806వ సం॥ డిసెంబర్ 20వ తేదిన శ్రీనివాసాంబ, రామానుజాచార్యులు అనే దంపతులకు తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా, శ్రీపెరంబుదూరులో జన్మించాడు. ఈయనకు తల్లిదండ్రులు పెట్టినపేరు 'చిన్నయ'. 'సూరి' అనేది ప్రభుత్వం ఈయనకు ఇచ్చిన బిరుదు.

చిన్నయ సూరి నీతిచంద్రికనే గాక, అక్షరగుచ్ఛము, విభక్తిబోధిని, శబ్దలక్షణ సంగ్రహము, సూత్రాంధ్ర వ్యాకరణం, బాలవ్యాకరణం అనే వ్యాకరణ గ్రంథాలు కూడా రచించాడు. ఆంధ్ర శబ్దశాసనం, నీతిసంగ్రహం అనే పద్యకావ్యాలు వ్రాశాడు. 'హిందూ ధర్మశాస్త్రము' అనే దానిని అనువదించాడు.

చిన్నయసూరి సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో పారంగతుడు. వ్యాకరణ, తర్క, మీమాంస, అలంకారాలలో కూడా కూలంకషమైన పాండిత్యం సంపాదించాడు. తెలుగు వచన రచనకు స్పష్టమైన శైలిని దిద్దినవాడు చిన్నయసూరి.

చిన్నయసూరి 1846లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలోను, పచ్చయప్పకళాశాలలోనూ తెలుగు పండితుడిగా పనిచేశారు. 1853లో రాజధాని కళాశాల తెలుగు శాఖలో ప్రథమ ఆచార్య పదవిని అలంకరించారు. ఆ సమయంలోనే ఈ నీతిచంద్రికను రచించి విశ్వవిద్యాలయమునకు అధ్యక్షులైన 'అర్బర్‌నాట్' దొరగారికి అంకితమిచ్చారు. ప్రస్తుత పాఠ్యభాగం నీతిచంద్రికలోని మిత్రలాభం నుంచి గ్రహించబడినది. నీతిచంద్రిక అంటే నీతుల వెన్నెల అని అర్థం.

ఆపదలు సంభవించినప్పుడు మిత్రుడు ఏ విధంగా సహాయపడుతాడు అనేదే ఈ పాఠ్యభాగ సారాంశం.
వేటగాడు - పావురాల కథ.

"గోదావరీ తీరమందు గొప్ప బూరుగు వృక్షముగలదు. అందు నానా దిక్కులనుండి పక్షులు వచ్చి రాత్రివసించుచుండెను. ఒకనాడు వేకువన లఘుపతనక మను వాయసము మేలుకొని రెండవయముని వలె సంచరించుచున్న కిరాతుని జూచి వఱువాత లేచి వీని మొగము చూచితిని. నేడేమి కీడు రాగలదో తెలియదు. వీడు వచ్చిన చోట నిలువదగదు. జాగు చేయక యీచోటు విడిచి పోవలె" నని యత్నము చేయుచుండగా వాడావృక్షమునకు సమీపమందు నూకలు చల్లి వలపన్ని పోయి చేరువ పొదలో దాగి పొంచి చూచుచుండెను. అనంతరము చిత్రగ్రీవుడను కపోతరాజు నింగిని సంచరించుచు నేలమీది నూకలు చూచి తనతోడి కపోతములతో నిట్లనియె. ఈ నిర్జన వనమందు నూకలు రానిమిత్తమేమి? మన మీ నూకలకాశపడరాదు. తొల్లి యొక తెరువరి కంకణమున కాశపడి పులి చేత దగులు కొని మృతిబొందెను. మీకా కథ చెప్పద వినుడు అని చెప్పగా విని యొక కపోతవృద్ధము నవ్వి యిట్లనియె, " ఆ॥ యివి యేటిమాటలు? ఒక యిక్కట్టు వచ్చినప్పుడు వృద్ధుని మాట వినవలసినది. వినుడు స్థానాస్థానములు వివేకింపక సర్వత్ర యిట్టి విచారము పెట్టుకోరాదు. కొరమాలిన శంకలు

తెచ్చుకొని భోజనము మానుకోవచ్చునా? మానుకొని యేలాగున బ్రతకవచ్చును? ఈర్ష్యాళువు. జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్యశంకితుడు. పరభాగ్యోపజీవియు ననువా రాఱుగురు దు:ఖభాగులని, నీతికోవిదులు చెప్పుదురు. అనగా విని కపోతములన్ని నేలవ్రాలెను. అనంతరము పావురములన్ని వలలోదగులుకొని కపోత వృద్ధమును జూచి " నీవు వృద్ధుడవు తెలిసినవాడవని భ్రాంతివడి నీమాటలను విని యీ విపత్తు తెచ్చుకొంటిమి ఎవ్వడు బుద్ధిమంతుడో వాడు వృద్ధుడుగాని యేండ్లుమీరిన వాడా వృద్ధుడు?"

అని కపోతములు నిందింపగా విని చిత్రగ్రీవుడిట్లనియె. "ఇది యీతని దోషముగాదు. ఆపదలు రాగలప్పుడు మంచియు జెడుగగుచున్నది. మనకాలము మంచిది కాదు. ఊరకయేలయీతని నిందించెదరు? ఈతడు తనకు దోచినది చెప్పినాడు. అప్పుడు మన బుద్ధియేమయ్యె? ఆపద వచ్చినప్పుడు తప్పించుకొనను సాధనము విచారింపవలెగాని యీ మాటలవల్ల ఫలమేమి? విపత్కాలమందు విస్మయము కాపురుష లక్షణము. కాబట్టి యిప్పుడు ధైర్యము తెచ్చుకొని ప్రతీకారము చింతింపుడు. ఇప్పటికి నాకొకటి తోచుచున్నది. మీరందరు పరాకు లేక వినుండు. ఒక్కసారిగా మనమందఱము వలనెత్తుకుని యెగిరిపోవుదము. మన మల్పులము మనకీకార్యము సాధ్యమవునా యని విచారింప బనిలేదు. సంఘీభవించి యెంతటి కార్యమయిన సాధింప వచ్చును. గడ్డిపరకలుసయితము వెంటిగా నేర్పడి మదపు టేనుగును బంధించుచున్నవి మీరు విచారింపుడు దీని కంటె మంచి సాధనము మీ బుద్ధికి దగిలెనా యది చేయుదము" అనిన విని, " మీరు చెప్పిన దేసరి, యింతకంటె మంచి సాధనములే" దని చెప్పి పావురములన్ని చిత్రముగా గగన మార్గమున కెగిరెను. అప్పుడా వ్యాధుడు వెఱగుపడి యీ పక్షులు గుంపుగూడి వలయెత్తుకుని పోవుచున్నవి. నేలవ్రాలగానే పోయి పట్టుకొని యెదగాక యని చింతించి మొగము మీదికెత్తుకొని రెప్పవేయక చూచుచు నవి పోవుదిక్కుకయి క్రిందనే పోవుచుండెను. ఈ వింత చూడవలెనని లఘుపతనకము పావురములను వెంబడించి పోవుచుండెను. అనంతర మా పక్షులు చూపుమేర దూరము మీఱి పోగానే వ్యాధుడు నిరాశ చేసికొని మఱలిపోయెను. ఆది చూచి 'యిప్పుడు మనము చేయవలసినది యేమి 'యని పక్షులడిగెను. చిత్రగ్రీవుడిట్లనియె "లోకమందు మాతాపితలు మిత్రుడును వీరు మువ్వురే హితులు. తక్కినవారందఱు ప్రయోజనము బట్టి హితు లగుచున్నారు. కాబట్టి యిప్పుడు నాకు మిత్రుడొకడున్నాడు. అతండు హిరణ్యకుడను మూషికరాజు. గండకీతీరమందు విచిత్రవన మాతని వాసస్థానము. అతడు పండ్లబలిమి చేత వలత్రాళ్లు తెగగొఱికి మనయాపద బాపగలడు. అక్కడికి మనము పోవుదము" అని చెప్పగానే పావురము లన్నియు జిత్రగ్రీవుడు చెప్పిన గుఱుతు పట్టుకొనిపోయి హిరణ్యకుని కలుగు దాపున వ్రాలెను. అప్పుడు హిరణ్యకుడు కపోతములు వ్రాలిన సద్దువిని భయపడి కలుగులో మెదలకుండెను. అనంతరము చిత్రగ్రీవుడు కలుగు దాపుచేరి యెలుగెత్తి యిట్లనియె. "ఓ చెలికాడా, యేలమాతో మాటలాడవు?" అనగానే హిరణ్యకుడామాట సవ్వడిపట్టి శీఘ్రముగా లాగు వెలుపలికి వచ్చి యిట్లనియె:

"ఆహా! యేమి నా భాగ్యము, నాప్రియమిత్రుడు చిత్రగ్రీవుడు నాకునేత్రోత్సవము చేయుచున్నాడు." అని పలుకుచు వలలో దగులుకొన్న పావురములను జూచి వెఱగుపడి క్షణమూరకుండి "చెలికాడా! యిది యేమని" యడిగెను. చిత్రగ్రీవుడిట్లనియె. "చెలికాడా, యిది మా పూర్వజన్మ కర్మమునకు ఫలము. చేసినకర్మ మనుభవింపక తీఱునా?" అనగానే హిరణ్యకుడు చిత్రగ్రీవుని బంధము ఛేదించుట కయిసమీపింపగా జిత్రగ్రీవుడిట్లనియె. "చెలికాడా! చేయవలసినది యీలాగున గాదు. ముందుగా నాయాశ్రితుల బంధము వదిలింపుము. తరువాత నాకు గానిమ్ము." అనిన హిరణ్యకుడు విని యిట్లనియె. "నాదంతములు మిక్కిలి కోమలములు అన్నిటి

బంధములు కఱచి త్రెంపజాలను. పండ్లు బలిమి కలిగి నందాక నీ బంధము ఛేదించెదను. తరువాత శక్తిగలిగిన పక్షమునకు మిగిలినవారి కార్యము చూచుకొందము. అనిన విని చిత్రగ్రీవుడిట్లనియె. ఆలాగుననే కానిమ్ము శక్తికిమీఱి యేమి చేయవచ్చును? ముందు యథాశక్తి వీరి నిర్బంధము మానుపుము. ఆవల నాపని యప్పటికయినయటు విచారించుకొందము. అనిన హిరణ్యకుడిట్లనియె "తన్నుమాని పరులరక్షంపవలె ననుట నీతికాదు. 'తన్నుమాలిన ధర్మము మొదలు చెడ్డబేరము గదా?' యను లోకోక్తి విన్నాడవుగావా! తాను బ్రతికి గదా సమస్త పురుషార్థములు సంపాదించుకోవలె? తాను బోయిన తర్వాత దేనితోనయిన బనియేమి? అది విని చిత్రగ్రీవుడిట్లనియె. 'చెలికాడా. నీవు చెప్పినది నీతి కాదనను, అయినను నా వారి దు:ఖము చూచి సహింపజాలను. కాబట్టి ఇంతనొక్కి చెప్పితిని. ప్రాజ్ఞుడు తన జీవితమునయిన మానుకొని మంచివారికి వచ్చిన కీడు తొలగింపవలెనని నీతికోవిదులు చెప్పుదురు. అది యటుండనిమ్ము నా వంటివారు వీరు. వీరి వంటివాడను నేను. ఇప్పటి కొదవని నాప్రభుత్వము వలన వీరికి రాగల ఫలమేమి? చెలికాడా! హేయమై వినశ్వరమైన యీ కళేబర మందాసమాని నాకు యశము సంపాదింపుము. నావలన జీతమా బత్తెమా యేదియు లేదు. ఐనను వీరు సర్వ కాలము నన్ను విడువక కొలుచుచున్నారు. నేను వీరి ఋణమెప్పుడు తీర్చుకోగలనో యెఱుగను. నాబ్రతుకు ముఖ్యముగా జూడకు. వీరి ప్రాణములు రక్షంచితే జాలును. అనిత్యమై మలినమైన కాయముచేత నిత్యమై నిర్మలమైన యశము లభించెనా దానికంటె లాభముగలదా? శరీరమునకు గుణములకు మిక్కిలి యంతరము. శరీరము క్షణభంగురము గుణములు కల్పాంత స్థాయులు. ఇట్టి శరీరము నపేక్షించి కీర్తి పోగొట్టుకొనవచ్చునా? అనిన విని హిరణ్యకుడు సంతోషపడి పులకితుడయి యిట్లనియె. చెలికాడా మేలు మేలు, నీయాశ్రిత వాత్సల్యము కొనియాడనే నేపాటివాడను? ఈ గుణముచే త్రిలోకాధిపత్యమునకు దగి యున్నాడవు. అని పలికి యన్నింటి బంధములు తెగ గొఱికి వాని నన్నిటిని నాదరముగా సంపూజించి, చిత్రగ్రీవా! చెలికాడా! యెంతవారికి గాని పూర్వకర్మ మనుభవింపక తీరదు. వల దగులుకోలునకు నొచ్చుకోకు. సమస్తము తెలిసినవాడవు. నీకు నా బోటులు చెప్పెడు పాటివారు గారు. అని యూరడించి బలగంబుతో జిత్రగ్రీవుని కాతిథ్యముచేసి కౌగిలించుకొని వీడు కొలిపెను.

ఈ విధముగ పావురములు తమ బంధములను వదిలించుకొన్నవి. పావురముల సంఘీభావము వలననే యాపద పోగొట్టుకొనుటకు వీలైనది.

## అభ్యాసవేదిక

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| విపత్కాలం | = | ఆపద సమయం |
| విస్మయం | = | ఆశ్చర్యం |
| కాపురుషుడు | = | చెడ్డవాడు |
| ప్రతీకారం | = | బదులుసేయుట |
| సంఘీభావం | = | ఐకమత్యం |
| వెంటి | = | మెలిపెట్టిన గడ్డితాడు |
| వ్యాధుడు | = | వేటగాడు |
| వెఱగుపడి | = | ఆశ్చర్యపడి |
| మాతాపితలు | = | తల్లిదండ్రులు |

| | | |
|---|---|---|
| సద్దు | = | చప్పుడు |
| ఎలుగు | = | శబ్దం |
| ప్రాజ్ఞుడు | = | బాగుగా తెలిసినవాడు |
| అనిత్యం | = | శాశ్వతం కానిది |
| భంగురం | = | నశించేది |

## ఈ క్రింది పదాలకు సంధికార్యాలను రాయండి.

ఉదా॥ సన్మార్గుడు = సత్ + మార్గుడు (జశ్త్వసంధి)

1. తల్లిదండ్రులు =
2. పురుషార్థములు =
3. తెగగొట్టికి =

## ఈ క్రింది పదాలను జతపరచండి.

1. చిత్రగ్రీవుడు ( ) అ. విచిత్రవనము
2. హిరణ్యకుడు ( ) ఆ. వల
3. బోయవాడు ( ) ఇ. మూషికరాజు
4. గండకీతీరం ( ) ఈ. కపోతములరాజు

## ఈ క్రింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి

ఉదా॥ చెడ్డవాడు × మంచివాడు

1. అసూయ ×
2. మిత్రుడు ×
3. సుగుణం ×

## ఈ క్రింది పదాలకు ప్రకృతి - వికృతులను రాయండి.

ఉదా॥ సంతోషం - సంతసం

1. పక్షి -
2. కీర్తి -
3. శబ్దం -
4. జీతం -

## ఈ క్రింద పదాలను సొంతవాక్యలలో రాయండి.

ఉదా ॥ కన్నులపండుగ : మా చెల్లాయి పుట్టినరోజు మా ఇంటిల్లిపాది కన్నులపండుగగా జరుపుకున్నాం.

1. కీర్తిప్రతిష్ఠలు :
2. భయం :
3. తెగగొట్టుకుట :

### ఈ క్రింది పదాలకు పర్యాయపదాలను రాయండి.

ఉదా॥ ఐకమత్యం - ఐక్యత, ఏకత

1. సమయం -
2. కళేబరం -
3. విపత్తు -

### ఈ క్రింది ఖాళీలను పూరించండి.

1. గోదావరి తీరమున నొక ________________
2. పనికిమాలిన________________తెచ్చుకొని ఆహారం మానుకోవచ్చునా?
3. వేటగాడు ________________మరలిపోయెను.
4. చిత్రగ్రీవుని స్నేహితుని పేరు ________________
5. నాదంతములు మిక్కిలి ________________

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. వేటగాడు అడవిలో ఏమి చేశాడు?
2. వృద్ధకపోతం తోటి కపోతాలతో ఏమని పల్కింది.
3. ఆపదలో వున్న పావురాలకు చిత్రగ్రీవుడు చెప్పిన ఉపాయం ఏమిటి?
4. 'తన్నుమాలిన ధర్మం - మొదలు చెడ్డ బేరం' అన్నదానికి చిత్రగ్రీవుడు ఏమని సమాధానమిచ్చాడు.
5. హిరణ్యకుడు ఏవిధంగా వలను ఛేదించాడు?
6. మిత్రలాభం వలన నీవు గ్రహించిన నీతి ఏమి?

### ఉపాధ్యాయులకు సూచనలు:

1. చిన్నయసూరి రచించిన కథలను విద్యార్థులకు తెల్పండి.
2. మిత్రలాభం, మిత్రభేదం విద్యార్థులకు తెలియజేయండి.

### విద్యార్థులు చేయవలసినవి :

1. మీకు తెలిసిన కొన్ని చిన్న చిన్న నీతి కథలు రాయండి.
2. మీ పెద్దలను అడిగి కొన్ని కథలు తెలుసుకోండి.
3. నీవు నీ స్నేహితులకు చేసిన ఉపకారాలేవి?

# 2. తంజావూరు

తమిళనాడు రాష్ట్రం పవిత్ర పుణ్యక్షేత్రాలకు సుందర ప్రదేశాలకు నిలయం. ఈ రాష్ట్రంలో ఉన్న దర్శనీయ చారిత్రిక ప్రదేశాలలో తంజావూరు ఒకటి. స్నిగ్ధమైన గులాబీలకు, మనోరంజితమైన శిల్పాలకు ఆలవాలం ఈ తంజావూరు. తంజావూరు అంటే. 'అందమైన ఊరు' అని అర్థం. రాధికా సాంత్వనము రచించిన ముద్దుపళని తల్లిపేరు తంజనాయకి. ఇలా సాహిత్య, చారిత్రిక ఆధారాలను బట్టి ఈ ఊరు క్రీ.శ.2వ శ॥ నుండే ప్రసిద్ధి చెందినట్లుగా తెలుస్తోంది.

తమిళనాడు రాష్ట్రంలోని కావేరీ నదీ తీరాన వెలసిన సుసంపన్నమైన చారిత్రిక ప్రదేశం తంజావూరు. ఈ ఊరికి తూర్పున తిరువారూర్, పడమర పుదుక్కోటై, ఉత్తరాన పెరంబలూరు, దక్షిణాన ముదురై జిల్లాలు ఎల్లలుగా ఉన్నాయి.

తంజావూరు ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇక్కడ భూమి సారవంతంగా ఉండడం వల్ల వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వరి, చెఱకు, కొబ్బరి, పెసర, మినుము వంటి పంటలను ఎక్కువగా పండిస్తారు. దీనిని బట్టి రాష్ట్రాభివృద్ధికి ఈ ప్రాంత వ్యవసాయం ఎంతగానో తోడ్పడుతోంది. కనుకనే తంజావూరును "తమిళనాడు రాష్ట్ర ధాన్యాగారం" అని పిలుస్తారు. ఇక్కడే తమిళ విశ్వవిద్యాలయం ఉంది.



శ్రీకృష్ణదేవరాయలతర్వాత విజయనగర సామ్రాజ్యాన్ని అచ్యుతదేవరాయలు పాలిస్తున్న రోజులలో తంజావూరులో నాయకరాజ్యపాలన మొదలైంది. ఈ అచ్యుతదేవరాయలు ఆదరాభిమానాలతో చెవ్వప్పనాయకుడు దక్షిణాంధ్రలోని తంజాపుర రాజ్యానికి రాజయ్యాడు. ఆ తర్వాత ఇతని కుమారుడు అచ్యుతప్పనాయకుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈ అచ్యుతప్ప నాయకుడు క్రీ.శ.1600 వరకు రాజ్యపాలన చేసి తన కుమారుడయిన రఘునాథనాయకునికి రాజ్యాన్ని అప్పగించాడు. తంజావూరును పాలించిన నాయకరాజులలో నాయకమణి రఘునాథనాయకుడు. శ్రీకృష్ణదేవరాయల'భువనవిజయం' వలే 'విజయభవనం' అనే కళానిలయాన్ని ఏర్పాటుచేసి, కవి పండితులను పోషించి అనేక కవితా ప్రక్రియలకు ఊతమిచ్చిన సాహితీ స్రష్ట.

ఈ నాయకరాజులకాలంలో యక్షగాన ప్రక్రియ వికాసం చెందింది. ఈ కాలంలో కవులతోపాటు కవయిత్రులు కూడా రచనలు చేయడం విశేషమని చెప్పవచ్చు. కేవలం సాహిత్యానికే కాక అనేక దేవాలయాల అభివృద్ధికి కూడా వీరు తోడ్పడ్డారు. ఇంకా అనేక దేవాలయాల నిర్మాణాలకు విరాళాలిచ్చారు.



వీరప్పనాయకుడు చిదంబరం దేవాలయానికి చుట్టూ ఒక పెద్ద గోడను నిర్మించాడు. అలాగే విశ్వనాథనాయకుడు శ్రీరంగం, తిరుచ్చి దేవాలయాలను అభివృద్ధి చేశాడు.

ఈ నాయక రాజులకాలంలో తంజావూరు శిల్పకళలకు, వాస్తుకళలకు ప్రసిద్ధిచెందింది. వీరు విజయనగర రాజులకు సామంతులుగా ఉండడం వల్ల వారు అనుసరించిన పద్ధతులనే అనుసరించి సంస్కృతి, సాహిత్యాలకు ఎనలేని కృషి చేశారు. వీరు దేవాలయాల ప్రాకారాలపై, గోడలపై, గోపురాలపై, మండపాలలో నిర్మించిన శిల్పాలు, చిత్రలేఖనాలు ఎంతో కళాత్మకంగా కన్పిస్తాయి. అలాగే తంజావూరు బొమ్మలతయారీకి ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ప్రజలు జరుపుకొనే పండుగలలో శివరాత్రి, ఏకాదశి ముఖ్యమైనవి.

1. తమిళనాడు ప్రభుత్వం తరపున జరిగిన తంజావూరు బృహదీశ్వరాలయం 1000 సంవత్సరాలముగింపు ఉత్సవాలదృశ్యమాలిక (22.9.2010 - 26.9.2010).









ఉత్సవాల్లో భాగంగా విడుదలచేసిన తపాలా బిళ్ళ, నాణాలు



మంత్రాలు పఠిస్తున్న కణిమేడు గ్రామస్థులు



ఉత్సవాల్లో భాగంగా జరిగిన 'గుమ్మి' నాట్యం



ఉత్సవాలవేదిక మీదున్న రాజరాజచోళుని విగ్రహం



నాట్యం చేస్తున్న డాక్టర్ పద్మాసుబ్రమణ్యం బృందం

తంజావూరులో ప్రఖ్యాతిగాంచిన దేవాలయాలలో "బృహదీశ్వరాలయం" ఒకటి. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద దేవాలయం. దీనిని మొదటి రాజరాజ చోళుడు క్రీ.శ. 985-1012 మధ్య కాలంలో నిర్మించాడు. మొదట రాజరాజచోళుడు తన 19వ ఏట ఈ దేవాలయ నిర్మాణానికి పూనుకున్నాడు. దీని నిర్మాణం చేయడానికి ఆరు సంవత్సరాలకాలం పట్టింది. మొదట దీనికి రాజరాజేశ్వరం అనే పేరు పెట్టారు. ఇక్కడి శివలింగం చాలా పెద్దది. ఈ ఆలయాన్ని తమిళంలో "పెరువుడైయార్ కోయిల్" అని పిలుస్తున్నారు. ఈ ఆలయం నిర్మితమై 2010 నాటికి వెయ్యి సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం సహస్రాబ్ది వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించింది.

ఈ దేవాలయ గోపుర నిర్మాణం చాలా విశాలంగా ఉంటుంది. ప్రధాన గోపురంపై ఉన్న విమానం చాలా ఎత్తుగా ఉంటుంది. దీనిని 123 టన్నులబరువు గల కటిక రాయితో మూసినట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ దేవాలయంలో ఉన్న 'నందీశ్వరుడు' అనే విగ్రహం ఆసియాలోనే చాలా పెద్దది. ఇది కూడా ఒకే రాయితో నిర్మించబడడం విశేషం. గర్భగుడిలో ఉన్న శివలింగం ఆసియాలోనే పెద్దది. వీరి వంశంవాడైన రాజేంద్ర చోళుడు ఇదే విధంగా మరొక దేవాలయాన్ని 'గంగైకొండ చోళపురం' లో నిర్మించాడు.

తంజావూరు నుండి సుమారు 45 కి.మీ. దూరంలో 'కుంభకోణం' ఉంది. ఇక్కడ 'కుంభేశ్వరర్ గుడి' ప్రసిద్ధి చెందింది. 12 సంవత్సరాలకొకసారి 'కుంభమేళా' ఇక్కడ నిర్వహించబడుతుంది. తంజావూరు చుట్టూ చూడదగ్గ ముఖ్యప్రదేశాలు నవగ్రహ దేవాలయాలు, పాపనాశంలోని శివునిగుడి, తిరువారూరు త్యాగరాజు జన్మస్థలం, పున్నైనల్లూరులో పున్నైమారియమ్మన్ మొదలైన దేవాలయాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో భారతదేశంలో ప్రసిద్ధిచెందిన చారిత్రిక ప్రదేశాలలో తంజావూరు ఒకటిగా చెప్పవచ్చు.

## అభ్యాస వేదిక

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మనోరంజితమైన | = | మనస్సును ఆనందింపజేసే |
| విరాళం | = | ఉచితంగా దానం చేయడం |
| కళాత్మకం | = | అందంగా తీర్చిదిద్దిన |
| యక్షగానం | = | పాటరూపంలోను, నృత్యరూపంలోను తెలిపే ఒక విధమైన జానపద కళారూపం. |

**ఈ క్రింది పదాలకు సరియైన అర్థాలు రాయండి.**

1. సామంతులు = ____________
2. వాస్తుకళ = ____________
3. ప్రాకారం = ____________

(ప్రహరీగోడ, చక్రవర్తి అధీనంలో పాలించే చిన్న రాజులు, ఇంటి నిర్మాణానికి చెందిన శాస్త్రం)

### ఈ క్రింది వాక్యంలో గుర్తించిన పదాలకు, వ్యతిరేకపదాలు రాయండి.

ఉదా॥ గ్రహాలలో గురుడు పెద్ద గ్రహం. ప్లూటో చిన్న గ్రహం.

1. మనం పెద్దలఎడ గౌరవం చూపాలి. వారికి _________________ కల్గించకూడదు.

### ఈ క్రింది వానిని జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. వీరప్పనాయకుడు | ( ) | అ. బృహదీశ్వరాలయం |
| 2. విశ్వనాథ నాయకుడు | ( ) | ఆ. గంగైకొండ చోళపురం |
| 3. మొదటి రాజరాజ చోళుడు | ( ) | ఇ. కుంభేశ్వరర్ గుడి |
| 4. రాజేంద్ర చోళుడు | ( ) | ఈ. తిరుచ్చి దేవాలయం |
| 5. కుంభకోణం | ( ) | ఉ. చిదంబరం దేవాలయం |

### ఈ క్రింది పదాలను సొంతవాక్యాలలో రాయండి.

ఉదా॥ యక్షగానం = నాయకరాజుల కాలంలో యక్షగానం బాగా అభివృద్ధి చెందింది.

1. వెన్నెముక =
2. సామంతులు =
3. పూనుకొనుట =

### ఈ క్రింది ఖాళీలను పూరించండి.

1. తంజావూరు ప్రజలప్రధాన వృత్తి _________________.
2. తంజావూరును _________________ అని పిలుస్తారు.
3. _________________ సంవత్సరాలకొక్కసారి కుంభమేళా నిర్వహించబడుతుంది.
4. రఘునాథనాయకుని సభాభవనం పేరు _________________.
5. ప్రపంచంలోనే అతి పెద్ద దేవాలయం _________________.

### ఈ క్రింది వాటికి ప్రకృతి - వికృతులు రాయండి.

ఉదా ॥ భాష - బాస

1. దేవాలయం -
2. రాజ -
3. పర్వము -

### ఈ క్రింది వానికి పర్యాయపదాలు రాయండి.

ఉదా॥ ఆధారం : ముఖ్యం, సాక్ష్యం

1. ఆలయం :
2. గ్రామం :

**ఈ క్రింది వాటిని కలిపి రాయండి.**

1. రాష్ట్ర + అభివృద్ధి =
2. ధాన్య + ఆగారం =

**ఈ క్రింది పదాలను విడదీసి, సంధి కార్యాలు రాయండి.**

1. దేవాలయం =
2. రాజేశ్వరం =
3. రాజేంద్ర =

**ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. తంజావూరు ఎల్లలు ఏవి?
2. తంజావూరులో ప్రధానంగా పండించే పంటలు ఏవి?
3. తంజావూరును పరిపాలించిన కొందరు నాయక రాజుల పేర్లు రాయండి?
4. బృహదీశ్వరాలయాన్ని గూర్చి వివరించండి?
5. తంజావూరు చుట్టూ చూడదగ్గ ముఖ్య ప్రదేశాలు కొన్నింటిని తెల్పండి?

**ఉపాధ్యాయులకు సూచనలు:**

మన దేశంలోని కొన్ని చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను గురించి విద్యార్థులకు తెలియచెప్పండి.

ఉదా ॥ సెంజికోట, మహాబలిపురం, ఇండియా గేట్, తాజ్‌మహల్.

**విద్యార్థులు చేయవలసిన పని :**

నీవు సందర్శించిన ఏదైనా ఒక చారిత్రిక ప్రదేశాన్ని గురించి మిత్రునికి లేఖ రాయి.



# 3. రుక్మిణీ దేవి అరుండేల్

భారతదేశం కళలకు కాణాచి. ఎందరో మహానుభావులు తమ ప్రతిభా పాటవాలతో మన దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. అలాంటి వారిలో రుక్మిణీదేవి అరుండేల్ ఒకరు. భారతదేశంలో ఒక్కొక్క రాష్ట్రం ఒక్కొక్క నాట్యానికి ప్రసిద్ధి చెందింది. అలాగే తమిళనాట ప్రసిద్ధమైంది భరతనాట్యం. అందరూ ఇష్టపడేది ఈ భరత నాట్యం. ఈ నాట్యంలో నిష్ణాతులైన ఎందరో కళాకారులకు ఆదర్శంగా నిలిచి కళాచరిత్రలో విశిష్టస్థానాన్ని సంపాదించారు రుక్మిణీదేవి అరుండేల్.

ఆమె అసలుపేరు 'రుక్మిణీ దేవి'. ఈమె తమిళనాడు రాష్ట్రంలోని మదురై పట్టణం లో ఒక సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. శేషమ్మ, నీలకంఠశాస్త్రి ఈమె తల్లిదండ్రులు. తల్లి ప్రసిద్ధ కర్నాటక సంగీత కళాకారిణి. తండ్రి నీలకంఠశాస్త్రి ప్రజా పనులశాఖలో ఇంజనీరుగా ఉద్యోగం చేశారు. కుమార్తె రుక్మిణీదేవి కూడా తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేది. 1920వ సంవత్సరంలో తన 16వ యేట డాక్టర్ జార్జి అరుండేల్ అనే విదేశీయునితో రుక్మిణీదేవి వివాహం జరిగింది. ఆనాటి నుండి ఈమె, రుక్మిణీదేవి అరుండేల్‌గా మారింది. పేరులోనే కాక, ఆలోచనలలో కూడా తన భర్తతో కలసి, కళలకు, దేశానికి, ఆమె ఎనలేని సేవలు చేసింది.



పూర్వ కాలంలో నాట్యం అంటే హేళనతో చిన్నచూపు చూసేది సమాజం. అంతే కాక ఆ కాలంలో నాట్యం దేవదాసీలు మాత్రమే చేసేవారు. నాట్యాన్ని సాదీర్ లేక దాసీలనాట్యం అనేవారు. నాట్యకళ పట్ల ఉన్న భావనను చూసి రుక్మిణీదేవి అరుండేల్ ఎంతో బాధపడ్డారు. కళలపట్ల ఉన్న ఈ అల్ప భావనను అందరిలోను తొలగించి నాట్యకళను అందలం ఎక్కించాలనే సదుద్దేశంతో భరతనాట్యాన్ని ఎంచుకుని మైలాపూర్‌లోని గౌరీ అమ్మాళ్ మరియు కృష్ణ అయ్యర్ వద్ద నాట్యసాధన చేసింది.

ఆమె దివ్యజ్ఞాన సమాజం వజ్రోత్సవ సభలో నర్తకిగా అరంగేట్రం చేసి తన ప్రతిభను చాటుకొంది. భరత నాట్యం చేసే వారిని చూసి అసహ్యించుకునే సమాజం రుక్మిణీదేవి నాట్యం చూసి ఆనందించి అభినందించారు. ఆమె నాట్యం చూసిన ప్రేక్షకులు, ఆమె భరతనాట్యాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. క్రమక్రమంగా లోకం ఇష్టపడని నాట్యం, ఇష్టపడే నాట్యంగా మారిపోయింది.

సంగీతం, నాట్యం రెండూ కళ్ళుగా భావించి నాట్యంతో పాటు సంగీత సాధన చేసి భరతనాట్యానికి మరింత మెరుగులు దిద్దింది రుక్మిణీ దేవి. అంతేగాక ఆమె వయొలిన్ వాయించడంలో దిట్ట. సంగీత నాట్యాలలో ఆరితేరిన రుక్మిణీదేవి నాటకాలలోను తన ప్రతిభను చూపించి వాల్మీకి రామాయణం, జయదేవ గీత గోవిందం. సీతాస్వయంవరం, కుమార సంభవం మొదలైన నాటకాలు వేశారు. నాటకాలలోను నాట్యంలోను ఆమె కనబరచిన ఆంగిక, అభినయ, వాచక, ఆహార్యాలు ప్రశంసనీయం. కళలకు ప్రాణం పోసిన మహిళా మూర్తి రుక్మిణి అని వేనోళ్ళ పొగడ్తలు అందుకున్నారు.

రుక్మిణిదేవి అరుండేల్ అహర్నిశలు అకుంఠిత దీక్షతో నాట్య, సంగీత, నాటక కళలను అభివృద్ధి చేసి భవిష్యత్తు తరాలవారికి అందించాలని 1936వ సంవత్సరం మద్రాసు అడయారులో తన భర్త సహాయంతో "కళాక్షేత్రం"ను స్థాపించారు. గురుకుల పద్ధతిలో భరత నాట్యం, సంగీతం నేర్పించేవారు. నాటి కళాక్షేత్రం నేడు తిరువాన్మియూరులో 100 ఎకరాల విస్తీర్ణంతో కళల విశ్వవిద్యాలయంగా మారిపోయింది.

రుక్మిణీదేవి 1939వ సంవత్సరం కళాక్షేత్ర భవన సముదాయంలో అనీబెసెంటు దివ్యజ్ఞాన ఉన్నత పాఠశాలను, అరుండేల్ సీనియర్ సెకండరి పాఠశాలను కూడా స్థాపించారు. చిన్న పిల్లలకై ప్రత్యేకంగా మాంటిసోరి పాఠశాలను, వృత్తి విద్య మరియు అధ్యయన కేంద్రం, వి.వి.స్వామినాథ్ అయ్యర్ గ్రంథాలయాన్ని స్థాపించి తమ వంతు కృషిగా విద్యాపరమైన సేవలను అందించి, తమ సేవాతత్పరతను చాటుకున్నారు.

1952వ సంవత్సరంలో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై తమ వంతు సేవ దేశానికి అందించింది. జంతు సంరక్షణ శాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖలో పనిచేశారు. అంతేగాకుండా మాజీ ప్రధాని మొరార్జి దేశాయ్ గారు 1977వ సంవత్సరం రుక్మిణీదేవి అరుండేల్ పేరును రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించడం విశేషం.

ఈ విధంగా కళారంగం మరియు దేశసేవ లో నిమగ్నమై అనేక రకాలైన సేవలందించిన రుక్మిణీదేవి అనేక బహుమతులు పొందారు. 1956వ సంవత్సరం భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' బహుమతినిచ్చి సన్మానించింది. 1957వ సంవత్సరం సంగీత నాటక అకాడమీ బహుమతిని అందుకున్నారు. ఈమెను విశ్వభారతి విశ్వవిద్యాలయం వారు 'దేశికొత్తమ' అనే బిరుదుతో గౌరవించారు. జంతు సంరక్షణ శాఖలో చేరి జంతువులను సంరక్షించుటకు ప్రత్యేక చర్యలు చేపట్టిన స్త్రీ మూర్తికి 'ప్రాణమిత్ర' అవార్డు బహుకరించారు. అంతేగాకుండా 1984 సంవత్సరంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం 'కాళిదాస సమ్మాన్' బిరుదుతో సత్కరించింది. తరువాత అమెరికా వైనీ రాష్ట్రవిశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

ఇలా కళారంగంలోనే కాకుండా దేశ సేవలో కూడా నిమగ్నమై విశిష్ట సేవలందించిన రుక్మిణీదేవి అరుండేల్ కళాసముదాయానికి, సంఘ సేవకులకు ఆదర్శంగా నిలచి 1986వ సంవత్సరం తుదిశ్వాస విడిచారు.

## అభ్యాసవేదిక

### ఈ క్రింది పదాలకు అర్థాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | కాణాచి | = | నిలయం |
| | ప్రతిభ | = | తెలివి |
| 1. | బదిలీ | = | |
| 2. | నర్తకి | = | |
| 3. | ప్రతిపాదించడం | = | |
| 4. | అరంగేట్రం | = | |
| 5. | అహర్నిశలు | = | |

### ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| ఉదా ॥ | కాణాచి | : | నిలయం, ఆలవాలం, ప్రసిద్ధి |
| 1. | ప్రతిభ | : | |
| 2. | సామగ్రి | : | |
| 3. | కుమార్తె | : | |

### ఈ క్రింది వాటికి వ్యతిరేక పదాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| 1. | సహ్యం | × | |
| 2. | విదేశం | × | |
| 3. | ముందు | × | |

### ఈ క్రింది పదాలను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | అనీబెసెంట్ | (   ) | అ. భరతనాట్యం |
| 2. | రుక్మిణీదేవి | (   ) | ఆ. సంగీతం |
| 3. | తమిళనాడు | (   ) | ఇ. దివ్యజ్ఞాన సమాజం |
| 4. | కళాక్షేత్రం | (   ) | ఈ. అరుండేల్ |

### ఈ క్రింది పదాలను సరైన ఖాళీలలో పూరించండి.

1. రుక్మిణీదేవి తండ్రి ________________.
2. ________________ వజ్రోత్సవ సభలో రుక్మిణీదేవి అరంగేట్రం చేసింది.
3. మద్రాసు అడయారులో ________________ స్థాపించారు.
4. రుక్మిణీదేవి ________________ వ సంవత్సరంలో రాజ్యసభకు ఎన్నికయ్యింది.

( 1952, కళాక్షేత్రం, నీలకంఠశాస్త్రి, దివ్యజ్ఞాన సమాజం)

### ఈ పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించండి.

ఉదా॥ ఆదర్శం : స్వామి వివేకానంద యువతరానికి ఆదర్శంగా నిలిచారు.

1. అరంగేట్రం :
2. పొగడ్త :
3. చేదోడు వాదోడు :

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. రుక్మిణీదేవి ఎక్కడ ఎప్పుడు జన్మించింది?
2. కళారంగానికి రుక్మిణీదేవి చేసిన సేవలేవి?
3. రుక్మిణీదేవి విద్యాపరమైన సేవలను వివరించండి?
4. రుక్మిణీదేవి కి లభించిన అవార్డులు ఏవి?

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. రుక్మిణీదేవి లాంటి మరికొందరి మహావ్యక్తులను గూర్చి వివరించాలి. కళాక్షేత్ర సందర్శనం చేయాలి.
2. విద్యార్థులకు కళలపట్ల, అభిరుచి, అభిమానం కలిగేటట్లు చేయాలి.
3. ప్రసిద్ధ కూచిపూడి నాట్యకళాకారుల గురించి తెలపాలి.

### విద్యార్థులు చేయవలసిన పనులు :

సేవాలక్షణాలను అలవరచుకోండి.



# 4. భారతీయ భాషలు

భాషించేది "భాష". అంటే అర్థవంతమైన శబ్దాలను వాక్ రూపంలో వెలువరించేది భాష. మానవులు ఒకరి అభిప్రాయాలను మరొకరు పరస్పరం తెలుసుకోవడానికి ఉపయోగించే దానిని 'భాష' అని అంటారు. భాష జంతుకోటి నుండి మానవులను వేరుచేస్తున్నది. మానవుడు తన ఆలోచనలను, భావాలను ఇతరులకు తెలియజేయడమే 'భాష' ముఖ్య ఉద్దేశం.

భారతదేశం అనేక మతాలకు, జాతులకు, భాషలకు పుట్టినిల్లు. మనదేశంలో సుమారు 1652కు పైగా భాషలున్నాయి. ఇవి ముఖ్యంగా రెండు రకాలు.

1. లిఖిత రూప భాషలు.
2. వాగ్రూప భాషలు.




లిపిని కల్గి గ్రంథ రచనకు ఉపయోగపడే భాషల్ని 'లిఖిత రూప భాషలు' లేక 'అక్షర భాషలు' అని అంటారు. లిపి లేకుండా గ్రంథ రచనకు వీలుకాని భాషల్ని 'వాగ్రూప భాషలు' లేక 'నిరక్షర భాషలు' అని అంటారు. మనదేశంలో నిరక్షర భాషలే ఎక్కువగా ఉన్నాయి. భారతదేశంలోని భాషలను నాలుగు ప్రధాన కుటుంబాలు గా భాషాశాస్త్రజ్ఞులు గుర్తించారు. అవి.

1. ఇండో - ఆర్యన్ భాషాకుటుంబం
2. ద్రావిడ భాషాకుటుంబం
3. సైనో - టిబెటన్ భాషాకుటుంబం
4. ఆస్ట్రో - ఏషియాటిక్ భాషాకుటుంబం.

ఇండో-ఆర్యన్ భాషలన్నింటికీ సంస్కృతం మూలభాష. సంస్కృత భాషకు, యూరప్ ఖండంలోని గ్రీక్, లాటిన్, మరికొన్ని ప్రాచీన భాషలకు మధ్య సోదర సంబంధం ఉంది. ఈ భాషలు నిర్మాణంలోను, స్వరూపంలోను దగ్గర సంబంధం కల్గి ఉండడం వల్ల వీటిని "ఇండో- యూరోపియన్ భాషాకుటుంబం" అని పేర్కొన్నారు. ఇందులోని ఒక శాఖ "ఇండో-ఆర్యన్ భాషాకుటుంబం". సంస్కృతం, అవంతి, శౌరసేని, పైశాచి, బెంగాలి, మరాఠి, అస్సామి, ఒరియా, పంజాబి, గుజరాతి, కాశ్మీరి, కొంకణి మొదలైనవి ఇండో-ఆర్యన్ భాషాకుటుంబానికి చెందిన భాషలు.

మనదేశానికి సంస్కృతం ఆర్యులు రాకతో వచ్చిన భాష. సుమారు మూడు నాలుగు వేలసంవత్సరాలకు పూర్వం ఆర్యులు మనదేశానికి వలస వచ్చినట్లు కొందరి చరిత్రకారుల అభిప్రాయం. మనదేశానికి ఆర్యులు రాక ముందు మధ్య ఆసియా ప్రాంతంలోనూ, లేదా మధ్యధరా ప్రాంతంలోనో నివసించిన వారు. వీరిలో ఒక గుంపు పశ్చిమదిశగా వలస వెళ్ళినట్లు, మరొక గుంపు తూర్పుదిశగా పర్షియా దేశం మీదుగా భారతదేశం తరలివచ్చినట్లు చరిత్రకారులు నిర్ణయించారు. ఆర్యులు రెండు శాఖలుగా చీలి అటువైపు యూరప్ ప్రాంతాలకు, ఇటు తూర్పుదేశాలకు వలసపోవడం వల్ల గ్రీక్, లాటిన్, కెల్టిక్, జర్మానిక్ మొదలైన ప్రాచీనభాషలు, పర్షియన్, సంస్కృతం వంటి ప్రాచ్యభాషలు ఆయా వలస దేశ ప్రాంతాలలో పరిణమించాయని భాషాచరిత్రకారులసిద్ధాంతం. ఈ భాషలమధ్య గల సంబంధం సోదర సంబంధం వంటిది. ప్రాచీన కాలంలోనే ఆర్యులు అటు యూరప్ వరకు, ఇటు ఇండియా వరకు వ్యాపించిన కారణంగా తొలి ఆర్యుల్ని "ఇండో-యూరోపియన్స్" అనీ, వీరు వ్యవహరించిన భాషకు " మూలఇండో-యురోపియన్" అని భాషాశాస్త్రజ్ఞులు తెలిపారు. సంస్కృతంలో తొలి రచనలుగా కనపడేవి వేదాలు.

మనదేశంలో ఇండో-ఆర్యన్ భాషాకుటుంబం తర్వాత ప్రధానమైంది 'ద్రావిడ భాషాకుటుంబం'. ద్రావిడ భాషలకు జన్మభూమి మనదేశం అని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. ద్రావిడ భాషాకుటుంబంలో 25 భాషలున్నాయి. వాటిలో ప్రాచీన సాహిత్యం గలభాషలు తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం మొదలైనవి. ద్రావిడ భాషలమధ్య సోదర సంబంధం ఉంది. కాబట్టి ఈ ద్రావిడ భాషలకు మూలం "మూలద్రావిడ భాష" అని భాషా శాస్త్రజ్ఞులభావన.

ఆసియా ఖండంలో వ్యాపించిన మరొక పెద్ద భాషా కుటుంబం 'సైనో-టిబెటన్ భాషాకుటుంబం'. చైనా, టిబెటిన్, బర్మా, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో వ్యవహరించే భాషలు ఈ వర్గానికి చెందుతాయి. మన దేశంలో వ్యవహరించే కొన్నిభాషలు ఈ వర్గానికి చెందుతాయి. మనదేశంలో ఈ కుటుంబానికి చెందిన భాషలు సుమారు వంద దాకా ఉన్నాయి. వాటిలో బోడ్, మణిపురి, లుషాయి, గారో, మూతిబ, నాగజాతి భాషలు ముఖ్యమైనవి. ఈ కుటుంబానికి చెందిన భాషలు చాలావరకు "నిరక్షరభాషలు". ప్రస్తుతం కొన్నింటికి లిపిని కల్పించి పాఠశాలలలో బోధిస్తున్నారు.

ఆగ్నేయ ఆసియాదేశంలో ఇండియా, బర్మా, ఇండో-చైనా, మలేషియా దీవుల్లో వ్యవహారంలో ఉన్న మరొక భాషాకుటుంబం 'ఆస్ట్రో - ఏషియాటిక్ కుటుంబం' మనదేశంలో బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా,పశ్చిమబెంగాల్, అస్సాం, అండమాన్ దీవుల్లో ఈ కుటుంబానికి సంబంధించిన భాషలు సుమారు ఇరవై దాకా ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి సంతాలి, ముండారి, మొదలైనవి.

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతులద్వారా దేశపాలనకు అవసరమైన రాజ్యాంగాన్ని తయారుచేశారు. మన భారత రాజ్యాంగంలో 18 భాషలు జాతీయభాషలుగా గుర్తించబడ్డాయి. అవి తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, పంజాబి, మరాఠి, బెంగాలి, హిందీ, గుజరాతి, అస్సామి, సింధి, కొంకణి, మణిపురి, నేపాలి మొదలైనవి. భారతదేశపు అధికార భాషగా 'హిందీ'ని గుర్తించారు. ఇలా భారతదేశంలో లిఖిత రూపంలో ఉన్న భాషలు చాలా తక్కువ మౌఖిక రూపంలో జనవ్యవహారంలో ఉన్న భాషలు ఎక్కువ.

## అభ్యాసవేదిక

### ఈ క్రింది పదాలకు సరియైన అర్థాలు గుర్తించండి.

1. వాక్ సంకేతాలు = ________________
2. లిఖిత రూపం = ________________
3. ప్రాచ్యభాషలు = ________________

(తూర్పుభాషలు, మాటలచిహ్నాలు, రాతరూపం)

### ఈ క్రింది వాక్యాల్లో గుర్తించిన పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

ఉదా॥ మనదేశంలో <u>అక్షరభాషల</u> కన్నా <u>నిరక్షర భాషలు</u> ఎక్కువగా ఉన్నాయి.

1. బైనాక్యులర్‌తో దూరంగా ఉన్న వస్తువులను ________________ గా చూడవచ్చు.
2. ముందు నుయ్యి ________________ గొయ్యి.
3. ఎద్దులతో పొలం దున్నడం ప్రాచీనం. ట్రాక్టర్‌తో పొలం దున్నడం ________________

### ఈ క్రింది వానిని జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | వేదాలు | ( ) | అ. హిందీ |
| 2. | తొలి ఆర్యులు | ( ) | ఆ. 25 భాషలు |
| 3. | ద్రావిడ భాషాకుటుంబం | ( ) | ఇ. ఇండో-యురోపియన్స్ |
| 4. | మన అధికార భాష | ( ) | ఈ. సంస్కృతం |

### ఈ క్రింది పదాలను సొంత వాక్యాలలో రాయండి.

ఉదా॥ పుట్టినిల్లు = స్త్రీకి పుట్టినిల్లు అంటే ఎంతో ప్రేమ.

1. వలసపోవడం = ________________

### ఈ క్రింది ఖాళీలను పూరించండి.

1. ________________ జంతుకోటి నుండి మానవులను వేరుచేస్తున్నది.
2. లిపి లేకుండా, గ్రంథ రచనకు వీలుకాని భాషల్ని ________________ అంటారు.
3. ఇండో-ఆర్యన్ భాషలన్నింటికి ________________ మూలభాష.
4. మనదేశానికి సంస్కృతం ________________ రాకతో వచ్చిన భాష.
5. చైనా, టిబెటన్, బర్మా, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో వ్యవహరించే భాషలు ________________ కుటుంబానికి చెందుతాయి.

### ఈ క్రింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.

ఉదా॥ ప్రాచీనం - పురాతనం, పాత

1. సోదరుడు -
2. శాఖ -

### ఈ క్రింది వాటిని సంధి కలిపి రాయండి.

1. పుట్టిన + ఇల్లు =

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. "భాష" అంటే ఏమిటి?
2. భాష ముఖ్య ఉద్దేశం ఏమి?
3. లిఖిత రూప భాషలు అంటేఏవి?
4. భారతదేశంలోని భాషాకుటుంబాలు ఎన్ని? ఏవి?
5. మన రాజ్యాంగం గుర్తించిన జాతీయ భాషలు ఎన్ని? కొన్ని తెల్పుము.

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. సోదర భాషలపట్ల విద్యార్థులకు అభిమానాన్ని పెంపొందింపజేయాలి.
2. ఇతర భాషలను నేర్చుకోవాలనే అభిలాష విద్యార్థులకు కలుగచేయాలి.

### విద్యార్థులు చేయవలసినపని :

1. తమిళం, కన్నడం, మలయాళం వంటి ఇతర భాషలలో ఉన్న అక్షరాలను ఉపాధ్యాయులసహాయంతో చదవడం, రాయడం నేర్చుకోండి.
2. మన రాజ్యాంగం గుర్తించిన భాషల పేర్ల చార్టును తయారుచేయండి.

# 5. మన క్రీడలు - ఆవశ్యకత

"ఆరోగ్యమే - మహాభాగ్యం" అన్నారు పెద్దలు. మన శరీరం, మనస్సు రెండూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతగానో తోడ్పడతాయి. క్రీడలు అంటే "ఆటలు". ఇవి రెండు రకాలు.

1. వ్యక్తిగత క్రీడలు. వీనిలో పరుగుపందెం, బరువులు ఎత్తుట, లాంగ్‌జంప్, చదరంగం, పోల్‌జంప్ మొదలైనవి.
2. సామూహిక క్రీడలు. వీనిలో కబాడీ, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్ వంటివి .

నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లు మంచి పౌరులను తీర్చిదిద్దడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. బాల్యదశలో పిల్లలందరికీ క్రీడలంటే ఎంతో ఇష్టం. వీటి ఆవశ్యకతను గుర్తించిన మనదేశం - పాఠశాల కాలపట్టికలో ప్రత్యేక సమయాన్ని కేటాయించి విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందిస్తోంది. చెడుగుడు, చెమ్మాచెక్కా, అష్టాచెమ్మా, దాగుడుమూతలు, కోతికొమ్మచ్చి వంటి ఆటలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఆడుతుంటారు. భారతప్రభుత్వంవారు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలలో క్రీడోత్సవాలను నిర్వహించి బహుమతులు ఇచ్చి క్రీడల అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

క్రీడలప్రాధాన్యాన్ని గుర్తించిన మనదేశం మొట్టమొదటగా 1924లో "ఇండియన్ ఒలింపిక్ క్రీడలు" పంజాబ్ లాహోర్‌లో ప్రారంభించింది. ఈ క్రీడలనే 1940 బొంబాయిలో "జాతీయ క్రీడలు'గా పేరు మార్చి నిర్వహించారు. ఈ జాతీయ క్రీడల్ని ప్రతి 2 సంవత్సరాలకొక్కసారి మన భారతప్రభుత్వం వివిధ రాష్ట్రాలముఖ్య నగరాల్లో నిర్వహిస్తూ వస్తోంది.ఈ విధంగా దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య జరిగే క్రీడలను "జాతీయ క్రీడలు" అని అంటారు. అవి బ్యాడ్మింటన్, బాక్సింగ్, టెన్నిస్, బరువులు ఎత్తుట, టేబుల్ టెన్నిస్, హాకీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, షూటింగ్, వాలీబాల్, పరుగుపందెం, స్విమ్మింగ్, సైక్లింగ్ మొదలైనవి. వీటిలో గెలిచిన వాళ్ళకు పతకాలను, ప్రశంసా పత్రాలను ఇస్తారు.



ఒక్కొక్క రాష్ట్రానికి ఒక్కొక్క ముఖ్యక్రీడ ఉన్నట్లే, ఒక్కొక్క దేశానికి ఒకముఖ్యక్రీడ ఉంటుంది. మన జాతీయక్రీడ హాకీ. ఒక దేశానికి మరొక దేశానికి మధ్య జరిగే క్రీడలను అంతర్జాతీయ క్రీడలు అంటారు. ఒకప్పుడు మనదేశం ఒలింపిక్స్‌లో హాకీ ఆటలో వరుసగా బంగారు పతకాలను సాధించింది.

ధ్యాన్‌చంద్, ధనరాజ్ పిళ్ళై వంటివారు హాకీ క్రీడాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు.

ఇతర దేశాలక్రీడలను గమనిస్తే యు.ఎస్.ఎ - బేస్‌బాల్; బ్రెజిల్, ఫుట్‌బాల్, ఇంగ్లండ్ - క్రికెట్; మలేషియా - బ్యాడ్మింటన్; చైనా - టేబుల్ టెన్నిస్; కెనడా - ఐస్ హాకీ వంటివి ఆయా దేశాల క్రీడలుగా చెప్పవచ్చు.

ఇవే కాకుండా అంతర్జాతీయ, ఆసియా, ఒలింపిక్స్ క్రీడల్లో మనదేశపు ఆటగాళ్ళు పాల్గొనేటట్లు మన ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం క్రికెట్ అంతర్జాతీయ క్రీడల్లో ప్రసిద్ధి చెందింది. మన దేశం కూడా క్రికెట్‌లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది. క్రికెట్ లో గవాస్కర్, కపిల్‌దేవ్, సచిన్ టెండూల్కర్ వంటి ఎందరో క్రీడాకారులు ప్రసిద్ధులు.



ప్రపంచ క్రీడల్లో ముఖ్యమైనవిగా భావించే ఒలింపిక్స్ క్రీడలు ప్రతి 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించబడుతున్నాయి. 2008 ఆగష్టు బీజింగ్‌లో జరిగిన 29వ ఒలింపిక్స్ క్రీడల్లో మనదేశం పాల్గొని పతకాలను సాధించింది.వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు మనదేశంలో ఎంతోమంది ఉన్నారు. పరుగుపందెంలో కేరళకు చెందిన పి.టి.ఉష అంతర్జాతీయ స్థాయిలో నాలుగు బంగారు పతకాలను గెలుచుకొని దేశగౌరవాన్ని నిలబెట్టింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరణం మల్లీశ్వరి ఒలింపిక్స్‌లో బరువులు ఎత్తడం లో కాంస్యపతకాన్ని సాధించింది. చదరంగంలో విశ్వనాథ్ ఆనంద్, కోనేరు హంపి, టెన్నిస్‌లో లియాండర్ పేస్, మహేష్ భూపతి, బ్యాడ్మింటన్‌లో పుల్లెలగోపీచంద్, సైనానెహ్వాల్, షూటింగ్‌లో అభినవ్ బింద్రా, గగన్‌నారంగ్ వంటివారు దేశకీర్తిని ప్రపంచ స్థాయిలో ఎగురవేస్తున్నారు. క్రీడల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వివిధ క్రీడాకారులకు అర్జున్ అవార్డు, రాజీవ్ ఖేల్ రత్న అవార్డు, క్రీడల్లో శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డులను రాష్ట్రపతి చేతులమీదుగా ఇచ్చి మనదేశం క్రీడాకారులను సత్కరిస్తోంది.

క్రీడలవలన అనేక లాభాలు ఉన్నాయి. శరీరంలోని కండరాలు చక్కగా సాగి పరిపుష్టి పొందుతాయి. శరీరంలోని మలినపదార్థాలు చెమట రూపంలో బయటకిపోతాయి. సోమరితనం, విసుగు లేకుండాపోతుంది. రక్త ప్రసరణం చక్కగా జరిగి శరీరం తేలిక అవుతుంది. చక్కని జీర్ణశక్తి, దేహానికి తేజస్సు, మనస్సుకు ఉత్సాహం కలుగుతాయి. క్రీడాకారులలో ఐకమత్యం పెరుగుతుంది. క్రీడలవలన క్రమశిక్షణ, పరస్పర సహకారం మొదలైన సద్గుణాలు అలవడుతాయి. క్రీడలవలన కార్యశూరత్వం, పట్టుదల, సోదరభావం వంటి సుగుణాలు పెంపొందుతాయి.

క్రీడలపట్ల ఆసక్తిని కలిగించాలనే ఉద్దేశం 2010 సంవత్సరం కామన్‌వెల్త్ గేమ్స్‌ను ఢిల్లీలో ఘనంగా నిర్వహించింది. యువత క్రీడలకు సరైన ప్రాముఖ్యాన్ని ఇచ్చి, లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషిచేయాలి. అప్పుడే ఏ దేశమైనా ప్రగతిపథంలో అభివృద్ధి చెందుతుంది.

## అభ్యాసవేదిక

### ఈ క్రింది పదాలకు అర్థాలు గుర్తించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా॥ | తేజస్సు | = | <u>కాంతి</u> | / చీకటి | / బరువు |
| 1. | సహకారం | = | కీడు | / సహాయం | / లాభం |
| 2. | సద్గుణాలు | = | సోమరితనం | / చెడ్డగుణాలు | / మంచిగుణాలు |
| 3. | ఐకమత్యం | = | కలిసి ఉండడం | / విడిపోవటం | / పోట్లాడడం |

### ఈ క్రింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.

ఉదా॥ ఇష్టం × అనిష్టం

1. గెలుపు ×
2. గౌరవం ×
3. బరువైన ×
4. లాభం ×
5. ఉత్సాహం ×
6. ఐకమత్యం ×
7. ఆసక్తి ×

### ఈ క్రింది వానిని జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | యు.ఎస్.ఎ | ( ) | అ. హాకీ |
| 2. | కరణం మల్లీశ్వరి | ( ) | ఆ. ఫుట్‌బాల్ |
| 3. | సచిన్ టెండూల్కర్ | ( ) | ఇ. బేస్‌బాల్ |
| 4. | బ్రెజిల్ | ( ) | ఈ. బరువులు ఎత్తుట |
| 5. | ధనరాజ్ పిళ్ళై | ( ) | ఉ. క్రికెట్ |

## ఈ క్రింది పదాలను సొంతవాక్యాలలో రాయండి.

ఉదా॥ పరుగుపందెం : బాలలదినోత్సం నాడు జరిగిన పరుగుపందెం పోటీలో నాకు ప్రథమ బహుమతి లభించింది.

1. పాటుపడ్డారు :
2. ఎగురవేయడం :

## ఈ క్రింది ఖాళీలను పూరించండి.

1. మన జాతీయ క్రీడ _______________.
2. "ఇండియన్ ఒలింపిక్ క్రీడల"ను 1940 బొంబాయిలో _______________ గా పేరుమార్చి నిర్వహించారు.
3. ఒలింపిక్స్ క్రీడలు _______________ సంవత్సరాలకొకసారి నిర్వహించబడుతున్నాయి.
4. కోనేరు హంపి _______________ క్రీడలో దేశకీర్తిని ఎగురవేస్తున్నది.

## ఈ క్రింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

ఉదా॥ ప్రపంచం : లోకం, విశ్వం, జగతి

1. బంగారం :
2. దేహం :

## ఈ క్రింది సంధికార్యాలు విడదీసి రాయండి.

1. క్రీడాసక్తి
2. క్రీడోత్సవం

## ఈ క్రింది పదానికి సంధి కలిపి రాయండి.

ఉదా॥ సత్ + గుణాలు = సద్గుణాలు

1. అతి + ఉన్నత =

## ఈ పట్టికను ఆధారంగా క్రింది ప్రశ్నలకు జవాబులివ్వండి.

| క్రమ సంఖ్య | జాతీయ క్రీడలు సంఖ్య | జాతీయ క్రీడ జరిగిన సంవత్సరం | జాతీయ క్రీడ జరిగిన స్థలం |
|---|---|---|---|
| 1. | 29వ | 1998 | బెంగుళూరు |
| 2. | 30వ | 1999 | ఇంఫాల్ |
| 3. | 31వ | 2001 | పంజాబ్ |
| 4. | 32వ | 2002 | హైదరాబాద్ |
| 5. | 33వ | 2007 | గౌహతి |
| 6. | 34వ | 2009 | జార్ఖండ్ |

1. 29వ జాతీయ క్రీడలు ఎక్కడ జరిగాయి?

జ :

2. హైదరాబాద్‌లో ఏ సంవత్సరం జాతీయక్రీడలు నిర్వహించారు?

జ :

3. 31వ జాతీయ క్రీడలు ఎక్కడ జరిగాయి?

జ :

4. 33వ జాతీయ క్రీడలు ఎప్పుడు? ఎక్కడ జరిగాయి?

జ :

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. క్రీడలు అంటే ఏమిటి? ఎన్ని రకాలు? అవిఏవి?
2. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఆడుకొనే ఆటలు కొన్నింటిని తెల్పండి?
3. జాతీయ క్రీడలు అంటే ఏమిటి? ఉదాహరణలియ్యాలి.
4. అంతర్జాతీయ క్రీడలు అంటే ఏవి?
5. క్రీడలవలన కలిగే లాభాలేవి?

### తెలుసుకోండి :

| క్రమ సంఖ్య | దేశం పేరు | జాతీయ క్రీడ |
|---|---|---|
| 1. | ఫ్రాన్స్ | ఫుట్‌బాల్ |
| 2. | జపాన్ | జూడో |
| 3. | ఆస్ట్రేలియా | క్రికెట్ |
| 4. | ఇండోనేషియా | బ్యాడ్మింటన్ |
| 5. | భూటాన్ | విలువిద్య |
| 6. | పాకిస్థాన్ | హాకీ |

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. ఆసియా క్రీడలు, కామన్‌వెల్త్ క్రీడల గురించి విద్యార్థులకు తెల్పండి.
2. విద్యార్థులలో క్రీడాసక్తి పెంపొందించే విధంగా ప్రసిద్ధ క్రీడాకారులను గురించి చెప్పండి.
3. పాఠశాలక్రీడాపోటీల్లో విద్యార్థులు పాల్గొనేటట్లు ప్రోత్సహించండి.

### విద్యార్థులు చేయవలసిన పనులు :

1. వివిధ క్రీడలకు సంబంధించిన క్రీడాకారుల చిత్రపటాలను సేకరించి, ఒక ఆల్బమ్‌ను తయారుచేయండి.
2. దేశాలు - వాటి జాతీయ క్రీడలను తెలుసుకోండి.

# 6. ప్లాస్టిక్ వాడకం

ప్రకృతిలో మనిషిగా పుట్టడం ఒక అద్భుతం. మనిషిగా పుట్టి ప్రకృతిని అత్యద్భుతంగా ఉపయోగించడం మరో అద్భుతం. ఈ ప్రకృతి అనేక జీవరాశులు జీవించడం కోసం ఎన్నో రకాలైన ముడి సరకులను ప్రసాదించింది. ఆ ముడి సరకులను తనకు ఉపయోగపడేలా చేసుకొనే శక్తి మనిషికి మాత్రమే ఉంది. అలాంటి ముడి పదార్థాలలో ఆధునికులు ఉపయోగించే వాటిలో ముఖ్యమైనది 'ప్లాస్టిక్'.

నేటి హైటెక్ యుగంలో మనిషి విశ్రాంతి లేకుండా మారిపోయాడు. ఉదయం లేచినప్పటినుండి రాత్రి పడుకునే వరకు ప్లాస్టిక్ వాడుతున్నాడు. పూర్వం ప్రజలు సంతలకు, పట్టణాలకు చేతి సంచులతో వెళ్ళే ఆనవాయితి ఉండేది. నేడు ఆపరిస్థితి మారిపోయింది. కిరాణా కొట్టు దగ్గర నుండి, టీ సెంటర్‌లు, టిఫెన్ హోటళ్ళు, భోజన శాలలు, జ్యూస్ సెంటర్‌లు, షాపింగ్ మాల్స్, ఇలా సర్వత్రా ప్లాస్టిక్కు వస్తువులు దర్శనమిస్తాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే 20వ శతాబ్దం ప్లాస్టిక్ యుగంగా మారింది. మానవుడు వీటికి బానిస అయ్యాడు అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి మనిషీ నిత్యావసరాలలో ప్లాస్టిక్ అంతర్భాగం అయ్యింది. శుభకార్యాలకు గ్లాసులు, ప్లేట్లు, గిన్నెలు, వాటర్ బాటిళ్ళు, తట్టలు, చేటలు, కుర్చీలు, ప్లాస్టిక్ కవర్లు ఇలా ప్రతీదీ ప్లాస్టిక్‌తో తయారైన వస్తువుల్నే ఉపయోగిస్తున్నారు.



వీటి వాడకం వల్ల పని తేలిక అవుతుందని ప్రజలు భావిస్తున్నారు. కాని వీటి వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నాలుగు శతాబ్దాల వెనకకు వెళ్ళితే జనజీవనం అంతా ప్లాస్టిక్ లేకుండానే సాగింది. నేడు ప్లాస్టిక్ వినియోగం లేనిదే రోజుగడవదు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ పుట్టుపూర్వోత్తరాలు వాటి వలన కలిగే లాభనష్టాలు తెలుసుకుంటే ఆశ్చర్యానికి లోనుకావలసి ఉంటుంది.

ప్లాస్టిక్ అంటే పాలిమర్లు, మోనోమర్లు అనే పునరుక్తమయ్యే యూనిట్లను కలిగి ఉన్న పెద్ద అణువులు. ఈ ప్లాస్టిక్ పెట్రోలియం నుండి తయారు చేస్తారు. వీటి తయారీలో ఎన్నో హాని కరమైన సేంద్రియ మరియు రసాయనపు రంగులు ఉపయోగిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 100 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోంది. దీనికోసం రోజు 7 మిలియన్ బ్యారెల్స్ పెట్రోలియం ఖర్చవుతోంది.



ప్లాస్టిక్ వస్తువులను వాడి పారవేస్తే అవి తిరిగి నేలలో కలిసి పోవడానికి కొన్ని వేల సంవత్సరాలకాలం పడుతుంది. ఈ ప్లాస్టిక్‌ను పూడ్చి వేస్తే భూమిపై ప్రభావం చూపుతుంది. పడేస్తే డ్రైనేజీకి అడ్డుపడే అవకాశం ఉంది. వర్షం వస్తే చెరువులు, నదులలో చేరి జలకాలుష్యానికి దారి తీస్తుంది. కాలిస్తే విష వాయువులు వెలువడి వాయు కాలుష్యాన్ని సృష్టిస్తాయి. వీటి వాడకం వల్ల జల, వాయు, భూమి, అడవులు తదితర సహజ వనరులపై ప్రభావాన్ని చూపి పర్యావరణాన్ని దెబ్బ తీస్తుంది. ఇది మానవుని మనుగడకే ప్రమాదం.

ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు అనేకం. మనం నిత్యం వాడే కొన్ని ప్లాస్టిక్ వస్తువుల వలన కలిగే అనర్థాలను పరిశీలిద్దాం. ఈ ఆధునిక జీవనంలో సౌలభ్యం పేరుతో ప్లాస్టిక్‌ను వాడడం ఒక ప్యాషన్‌గా మారింది. ఇవి జనాదరణ పొందడానికి కారణాలు రవాణా సౌలభ్యం, తేలికతనం, చౌక ధరకు దొరకడం, రంగురంగుల్లో ఆకర్షణీయంగా ఉండడం, ఎక్కడయిన అందుబాటులో ఉండడం, చేతిలో ఏమి లేకుండా వెళ్లి సులభంగా తెచ్చుకునే వీలు ఉండడం. అయితే వీటి వలన జరిగే అనర్థాలు భవిష్యత్తు తరాలవారి జీవనానికి ఆటంకంగా మారే అవకాశం ఉంది.

ఉపయోగించే వారు వింత వింత అనారోగ్యాలకు లోనౌతారు.

నేడు ప్రతి ఒక్కరు ఉపయోగించే కొన్నింటిని పరిశీలిద్దాం. అవి.

1. ప్లాస్టిక్ సంచులు
2. ప్లాస్టిక్ బాటిల్స్
3. ప్లాస్టిక్ పెన్నులు
4. ప్లాస్టిక్ డబ్బులు మొదలైనవి.

## 1. ప్లాస్టిక్ సంచులు :

నేడు ఈ ప్లాస్టిక్ సంచులను ఉపయోగించనివారు లేరనడంలో ఆశ్చర్యం లేదు. మందుల దుకాణానికి వెళ్లినా, అంగడికి వెళ్లినా, పూజకోసం వస్తువులు కొన్నా, అవసరానికి పాలు కొన్నా, మనవెంట ఒక ప్లాస్టిక్ సంచి వచ్చి తీరుతుంది. వీటి తయారీలో ప్రోప్‌లైన్, పెనాల్, ఎథిలిన్, పాలిస్ట్రీన్, బెంజిన్ మొదలైన రసాయనాలు వాడుతారు. వీటి తయారికీ ఖర్చు తక్కువ కావడంతో కంపెనీలు అధికంగా వీటిని ఉత్పత్తి చేస్తున్నాయి. వీటి వినియోగం రోజు రోజుకు పెరిగిపోయి పర్యావరణానికి పెను ముప్పుగా మారింది. ఇంకా చెప్పాలంటే ప్రభుత్వాలు సైతం వీటిని నియంత్రించే స్థితిలో లేవు. ఎట్టకేలకు పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 సం॥ లో 20 మైక్రాన్‌లకన్నా ఎక్కువగా ఉన్న పాలిథిన్ క్యారీ బ్యాగ్‌లు, పాలిథిన్ టి, వాటర్ గ్లాసులవాడకాన్ని నిషేధించినట్లు చట్టం చేసింది. అయినా వీటిని నియంత్రించడం ఎంతో కష్టంగా ఉంది. అంతే కాక ప్లాస్టిక్ సంచులకు తళతళలివ్వడానికి ఉపయోగించే రంగుల్లో పిగ్‌మెంట్లు, పారిశ్రామిక ఏజోడైలు ఇందులో ఉంటాయి. వాటి వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ఈ సంచులలో ఆహార పదార్థాలు కట్టినప్పుడు అవి కలుషితమౌతాయి.

## 2. ప్లాస్టిక్ బాటిల్స్ :

నేడు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ సీసాలు దర్శనమిస్తున్నాయి. ఇందులోని నీళ్ళు త్రాగడం ఆరోగ్యానికి హానికరం అని జర్మనీకి చెందిన శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ బాటిల్స్‌లోని నీరు సేవించడం వలన పురుషులలో సంతానోత్పత్తి శక్తిని దెబ్బతీయటంతో పాటు క్యాన్సరు ప్రమాదం కూడా పొంచిఉందని తెలిపారు. వీటివలన స్త్రీలకు సంబంధించి రొమ్ము క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలు కూడా ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం తాము కనుగొన్నది అతి స్వల్పమని, ఇంకా ప్లాస్టిక్ సీసాలు ఇతర కంటెయినర్లలో నిల్వచేసే పదార్థాల వలన కూడా పెద్ద మొత్తంలోనే ముప్పు పొంచి ఉండొచ్చు అనేది వీరి అభిప్రాయం. కాబట్టి ఇకపై ప్రతిఒక్కరు ప్లాస్టిక్ సీసాలను వదలి గాజు సీసాలను ఉపయోగిస్తే పర్యావరణ పరిరక్షణకు కొంతైనా దోహదం చేసిన వారు అవుతారు.

## 3. ప్లాస్టిక్ పెన్నులు :

ఒకప్పుడు ప్రతివారు అత్యంత ప్రేమగా చూచుకొనేది 'కలం' (పెన్). ఈ కలం నేడు ప్లాస్టిక్‌తో తయారవుతోంది. 'యూజ్ అండ్ త్రో' (వాడి పారేసే) పెన్నులు చౌకగా అందుబాటులో ఉన్నాయి.

1890లో దర్శనమిచ్చిన ఫౌంటెన్ పెన్ (సిరా పెన్నులు) క్రమక్రమంగా కాలగమనం లో కలిసిపోయాయి. వీటి వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ లేదు. రీఫిల్ మార్చాల్సిన అవసరం లేదు. పాళీ అరిగిపోయినా లేదా విరిగిపోయినా కొత్తపాళీ వేసుకోవడం, పెన్నులో సిరా అయిపోతే సిరాతో నింపుకోవడం జరిగేది. నేడు రీఫిల్ కొనాలంటే రూ.4 వెచ్చించాలి, కానీ... రూ.1 టికే కొత్త పెన్ను లభిస్తోంది. రీఫిల్‌కు, పెన్నుకు తేడా ఒక్క రూపాయే కదా, పై పెచ్చు కొత్త పెన్ను వాడినట్లు ఉంటుందని విద్యార్థులు కొత్తవాటి వైపు మొగ్గుచూపుతున్నారు. దీనితో పాత పెన్నులు చెత్త బుట్టలకు అంకితమౌతున్నాయి.

మన దేశంలో 80 శాతం మంది వినియోగదారులు రూ.10 లోపు ధర కలిగిన పెన్నులను ఉపయోగిస్తున్నారని లింక్‌పెన్ ప్లాస్టిక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ జలాన్ అన్నారు. ప్రతి 100 పెన్నుల్లో 70 పెన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలుగా మారుతున్నాయి. వీటి వలన కలిగే అనర్థాలు ఎన్నో ఉన్నాయి.

## 4. ప్లాస్టిక్ డబ్బులతయారీ :

చిరిగిన నోట్ల చీకాకులు, నకిలీ నోట్ల బెడద లేకుండా ప్లాస్టిక్ నోట్లను అమలులోకి తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నిస్తోంది. హాంగ్‌కాంగ్, న్యూజిల్యాండ్, శ్రీలంక దేశాలతో పాటు పలుదేశాలలో చలామణీ అవుతున్న పాలిమర్ కరెన్సీని ఆస్ట్రేలియా మొదటగా ప్రవేశపెట్టింది. కాగితం ధర ఎక్కువగా ఉండడం నకిలీడబ్బులు బాధలను తప్పించుకోడానికి పాలిమర్‌తో కరెన్సీ నోట్ల రూపకల్పన చేయాలని ఆర్.బి.ఐ నిర్ణయించింది.

ఆధునిక కాలంలో నూతన వస్తువులను ఉపయోగించుకోవచ్చు కాని, వాటి వలన మనిషి మనుగడకే ముప్పు వస్తుందంటే నిరోధించడం తప్పని సరి.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో నష్టాలు :

1. వర్షపు జలాలు భూగర్భానికి చేరకుండా అడ్డుకుంటాయి.

2. ప్లాస్టిక్ బ్యాగ్‌లు, కప్పులు, గ్లాసుల్లో వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌కు ఆహ్వానం పలికినట్లే అవుతుంది.

3. ప్లాస్టిక్‌ను తగలబెట్టడం వలన డైయాక్సిన్ వాయువు గాలిలోకి వెళ్ళి క్యాన్సర్ వ్యాధికి దారి తీయటమే కాక ఓజోన్ పొరను కూడా దెబ్బతీస్తుంది.

4. పశుగ్రాసం లేక పశువులు ప్లాస్టిక్ కూడా తింటున్నాయి. అందువల్ల పశువులు అనారోగ్యంతో చనిపోతున్నాయి.

5. చెరువుల్లో, నదుల్లో ఈ వ్యర్థాలు చేరడం వల్ల వీటిని తినే చేపలు మృత్యువాత పడుతున్నాయి.

### నివారణ మార్గాలు :

1. ప్లాస్టిక్ సంచులను బయోడిగ్రేడబుల్‌గా 20 మైక్రానుల కంటే మందం తక్కువ కాకుండా 12 అంగుళాలు పొడవు, 8 అంగుళాలవెడల్పుతో మాత్రమే తయారు చేయాలి.

2. వీలైనంత వరకు వీటి వాడకాన్ని తగ్గించుకోవాలి. ప్రతి ఒక్కరు దీనిని తమ బాధ్యతగా గుర్తించాలి.

3. కవర్లు, కప్పులు, వాటర్ బాటిల్స్‌ను బహిరంగ ప్రదేశాలలో పడేయటానికి చరమగీతం పాడాలి.

4. పాలిథిన్ కవర్ల వలన కలిగే అనర్థాలను గుర్తించి ప్రజలను చైతన్య వంతం చేయాలి. వీటి తయారీని కట్టడి చేసే దిశగా కాలుష్య నియంత్రణ మండలి, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి.

## అభ్యాసవేదిక

### ఈ క్రింది పదాలకు అర్థాలు రాయండి.

ఉదా॥ నిరంతరం = ఎల్లప్పుడు

1. సామగ్రి =
2. ప్రాధాన్యం =
3. విముక్తి =
4. దోహదం =
5. మెండు =
6. నూతనం =
7. అన్వేషణ =

### ఈ క్రింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.

ఉదా॥ నిత్యం : ఎల్లప్పుడు, సదా, నిరంతరం.

1. అన్వేషణ : ________________ , ________________
2. జీవించడం : ________________ , ________________

### ఈ క్రింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

ఉదా॥ మొదట × చివర

1. ఎక్కువ ×
2. వెళ్ళుట ×
3. ఏకం ×

### ఈ క్రింది పదాలనుపయోగించి సొంత వాక్యాలు రాయండి.

ఉదా॥ నూతనం : తాజ్‌మహల్ నిత్య నూతనంగా శోభిల్లుతోంది.

1. పుట్టుపూర్వోత్తరాలు :
2. దోహదం :

### ఈ క్రింది పదానికి సంధికార్యం రాయండి.

ఉదా॥ పూర్వోత్తరాలు : పూర్వ + ఉత్తరాలు

1. సంతానోత్పత్తి :

### క్రింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

1. ప్లాస్టిక్ ________________ నుండి తయారుచేస్తారు.
2. ఫౌంటెన్ పెన్ను ________________ సంవత్సరంలో దర్శనమిచ్చింది.
3. ప్లాస్టిక్‌ను తగలబెట్టడం వల్ల ________________ వాయువు గాలిలోకి వెళ్ళి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది.

   ( పెట్రోలియం, డయాక్సిన్ 1890 )

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. ప్లాస్టిక్ తయారీని వివరించండి?
2. ప్లాస్టిక్ బాటిల్స్ వలన కలిగే దుష్ఫలితాలు రాయండి.
3. ప్లాస్టిక్ సంచులవాడకాన్ని తెల్పండి.
4. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు, నివారణ మార్గాలు వివరించండి?

### ఉపాధ్యాయులకు సూచన :

ప్లాస్టిక్ పరిశ్రమలకు విద్యార్థులను తీసుకెళ్ళి మరింత సమాచారాన్ని విద్యార్థులకు అందించాలి.

### విద్యార్థులు చేయవలసినది :

ప్లాస్టిక్ ఉపయోగించాల్సిన పద్ధతులను తెలుసుకోవాలి.

# 7. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



భారత జాతీయ సాంఘికోద్యమ చరిత్రలో ఒక విశిష్ట స్థానం కలిగిన వారు డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేడ్కర్. మానవత్వపు విలువలు పెంచే ఎన్నో రచనలు చేశారు. భారత రాజ్యాంగం రూపులుదిద్ది రాజ్యాంగ నిర్మాతగా, భారతీయులకు కరదీపికగా, దీనులకు నిరుపేదలకు మార్గం చూపిన మహావ్యక్తిగా బి.అర్.అంబేడ్కర్ ఎదిగారు. అస్పృశ్యత నిర్మూలనకు మహోద్యమాన్ని ప్రారంభించి దేశవ్యాప్తంగా అణగారిన వర్గాలలో సాంఘిక, రాజకీయ, విద్యా చైతన్యాన్ని కలిగించి ఆదర్శవంతంగా నిలిచారు.

డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14వ తేదిన మధ్యప్రదేశ్‌లోని మౌ (మిలిటరీ కంటోన్‌మెంట్, సెంట్రల్ ప్రావిజన్స్) ప్రాంతంలో జన్మించాడు. ఈయన సొంత గ్రామం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా ఖేడ్ తాలుకా, అంబవాడె. అంబేడ్కర్ అసలు పేరు భీం రావ్. ఈయన తల్లిదండ్రులు భీమాబాయి, రాంజీ సక్పాల్. అంబేడ్కర్ తండ్రి సైన్యంలో చిన్న ఉద్యోగిగా ఉండేవాడు. అతని జీతం తిండి, బట్టలకే సరిపోయేది కాదు. అయినా రాంజీ సక్పాల్ పట్టుదలతో భీమ్‌రావ్‌ను ఒక పండితుని సహాయంతో బడిలో చేర్పించాడు.

భీంరావ్ చిన్నతనం నుండి తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అతని మేధాశక్తికి ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపోతూ ఉండేవారు. అంబేడ్కర్‌లోని చురుకుదనాన్ని గమనించిన ఇద్దరు ఉపాధ్యాయులు అతనికి కావలసిన పుస్తకాలు, బట్టలు ఉచితంగా ఇచ్చి ప్రోత్సహించారు. సమాజంలో వీరి కులానికి సరైన స్థానం లేకపోవడంతో ఇటు స్కూల్లో తోటి విద్యార్థులతోను, అటు సమాజంలోను చిన్న వయసులోనే ఎన్నో అవమానాలు చవిచూశాడు. కేలుస్కర్ అంబేడ్కర్ అనే పండితుని సహకారంతో బొంబాయి ఎలిఫిన్స్టన్ ఉన్నత పాఠశాలలో చేరాడు. ఆ పండితుని సలహాలు బీంరావ్‌లో ఆత్మబలం పెంపొందింప చేయడంతో పాటు ముందడుగు వేయటానికి కారణమయ్యాయి. ఆనాటి నుండి తన పేరు భీంరావ్ రాంజీకి అంబేడ్కర్ జోడించి, భీంరావ్ అంబేడ్కర్‌గా ప్రసిద్ధికెక్కాడు. ఒకసారి అంబేడ్కర్‌కు తరగతిలో అత్యధిక మార్కులు వచ్చినందుకు బహుమతి అందించడానికి ఆ పాఠశాలకు ఒకరాజకీయ నాయకుడు వచ్చాడు. ఈ నాయకునిది అంబేడ్కర్ కులం కంటే కొంచెం పెద్ద కులం. అంబేడ్కర్ కులం తెలుసుకున్నాక నేను ఇతనిని ముట్టుకొని నా దేహాన్ని మైలపర్చుకోను, క్షమించండి అని వెళ్లిపోయాడు. ఈ సంఘటన అంబేడ్కర్‌ను ఎంతగానో గాయపరిచింది. లోలోన కుమిలిపోయాడు.

ఒకసారి అంబేడ్కర్ కుటుంబం అంతా కలిసి వారి బంధువుల గ్రామానికి వెళ్లివలసి వచ్చింది. అంబేడ్కర్‌తో సహా తన అన్నయ్య, ఇంకా కొందరు వారిలో ఉన్నారు. రైలుబండి దిగి కొంత దూరం చేరుకున్నాక ఒక ఎడ్లబండిని మాట్లాడుకుని ప్రయాణం చేస్తున్నారు. వీరి మాటలసందర్భంగా వీరిది మహర్ కులమని తెలిసి బండి వ్యక్తి

బండిని ఆపి నిర్దాక్షణ్యంగా దిగి వెళ్లిపొమ్మని అవమానించాడు. ఎన్ని రకాలుగా బ్రతిమిలాడినా బండివాడు ససేమిరా అన్నాడు. చిన్నపిల్లలు అంత దూరం వెళ్ళడం కష్టమని మరిమరి బ్రతిమలాడగా చివరకు ఆ బండిని అంబేద్కర్ అన్న తోలేటట్లు ఆ బండివాడు వెనుక నడిచి వచ్చేటట్లు ఒప్పందం కుదుర్చుకొన్నారు. తెల్లవారింది సూర్యుడు తన ప్రతాపాన్ని చూప మొదలుపెట్టాడు. పిల్లలకు దాహంగా ఉందని దగ్గరలోని వీధిలో ఉన్న కుళాయి దగ్గరకు వెళ్ళి మంచినీళ్ళు తాగుతుండగా వీరందరూ అంటరానివారని ఆ బండివాడు అరిచాడు. ఆ వీధి వారు నీళ్ళు తాగుతున్న వారిని విపరీతంగా కొట్టారు. ఈ సంఘటన అంబేద్కర్‌ను కలత పెట్టి, ఆలోచించేలా చేసింది.

" ఏ మహానుభావుడైనా జన్మించి ప్రజల్లో ఉన్న అస్పృశ్యత పిశాచిని సమూలంగా నాశనం చేస్తే బాగుండును" అని ఆవేదన చెందాడు. ఆ పని అతనే చేస్తాడని కలలో కూడా అనుకోలేదు.

సమాజంలో వర్ణవ్యవస్థ వేళ్ళూనుకుని ఉంది. ఇది కొందరు స్వార్థపరులసృష్టే. దీనిలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావం ఏర్పడింది. అణచివేయబడిన వర్గాలకు ఎన్నో నియమాలు పెట్టారు. అవి, దేవాలయ ప్రవేశం లేదు, అందరు భుజించే హెూటల్లో ప్రవేశం లేదు, అందరు నడిచే రోడ్ల మీద నడవడానికి వీలులేదు. ఇలా అనేక సాంఘిక దురాచారాలు ఈ వ్యవస్థలో కొనసాగుతున్నాయి. ఈ ఆచారాలను ఖండించాలి, వీటి పరిష్కారానికై ఉద్యమం చేపట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇటువంటి ఉద్యమాలు చేయాలంటే అందుకు తగిన చదువు ఎంతో ముఖ్యమని గమనించాడు. కనుక ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయం తీసుకున్నాడు. డిగ్రీలో అత్యధికమైన మార్పులు రావడంచేత అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చదివే అవకాశం వచ్చింది. అక్కడే ఎం.ఏ. డిగ్రీని పొందారు.

1920లో లండన్ వెళ్లి అక్కడ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి డాక్టరేట్‌ను పొంది, ఆ తర్వాత 1928లో బారిష్టరు పరీక్షలలో ఉత్తీర్ణుడై భారతదేశానికి తిరిగివచ్చాడు. ఏ దేశంలో చూచినా మంచివారున్నారు. చెడ్డవారున్నారు. అలాగే ధనికులున్నారు, పేదవారున్నారు, అంతేగాకుండా మేధావులు ఉన్నారు, నిరక్షరాస్యులు ఉన్నారు. అయితే భారతదేశంలో అస్పృశ్యత పేరుతో అణిచివేయబడుతున్న నిర్భాగ్యులు ఉన్నారు. అణచివేతకు గురవుతున్న వర్గాలకు విద్య సంఘంలో గౌరవం అవసరమని గ్రహించి వారికి ఆ అవసరాన్ని ఉద్బోధించి, వారిలో చైతన్యం కలిగించి 1924 జూలై 20న బహిష్కృత హితకారిణి సంఘాన్ని స్థాపించాడు. అది 1860, సొసైటీలచట్టం XXI క్రింద జూలై 20వ తేదిన గుర్తింపు పొందింది. అంబేద్కర్ కృషి ఫలితంగా మైనారిటీస్ కమిటి సూచించిన సిఫార్సుల ఆధారంగా అంబేద్కర్‌కు బ్రిటిష్ ప్రధాని "రాయ్‌సే మ్యాక్ డొనాల్డ్ 'కమ్యునల్' అవార్డు" ప్రకటించారు.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. అప్పటి ప్రధాని శ్రీ నెహ్రూ భారతరాజ్యాంగ పరిషత్తును నియమించి, రాజ్యాంగ రచనా సంఘానికి అంబేద్కర్‌ను అధ్యక్షునిగా నియమించారు. అదే ఆయన జీవితంలో మహెూజ్జ్వలమైన ఘటన. అదే చరిత్రలో శాశ్వత స్థానాన్ని కల్పించి మహత్తరమైన మలుపు తిప్పింది. రాజ్యాంగ రచనలో ఎక్కువ భారాన్ని స్వీకరించి, ఎన్నో ఇతర రాజ్యాంగాలు చదివి భారత రాజ్యాంగాన్ని నిర్మించాడు. అందులో అస్పృశ్యతను శిక్షార్హమైన నేరంగా నిర్ణయిస్తూ ఒక చట్టాన్ని చేర్చారు. ఇలా చేసిన అనేక చట్టాలు అణగారిన

వర్గాలను ఇప్పటికి కూడా కాపాడుతున్నాయంటే వాటి వెనుక అంబేడ్కర్ కృషి ఎలాంటిదో తెలుసుకోవచ్చు. సమాజంలో ఇప్పటికైనా సమానత్వం కొంతైనా ఏర్పడింది అంటే అందులో అంబేడ్కర్ కృషి ఎంతో ఉంది. కేవలం అణగారిన వర్గాల ప్రాధాన్యమే కాక సమాజంలో ప్రతి వ్యక్తికి న్యాయం జరిగే విధంగా చట్టాల్ని నిర్మించి ప్రపంచ రాజ్యాంగాలలో 'భారత రాజ్యాంగం' విశిష్టమైనదిగా తీర్చిదిద్దిన ఘనత అంబేడ్కర్‌కు దక్కుతుంది.ఇలా సర్వసమానత్వం కోసం కృషిచేసి ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహావ్యక్తిగా అంబేడ్కర్‌ను చెప్పవచ్చు. అంతటి మహోన్నతమైన మేధావి అంబేడ్కర్ 1956 డిసంబర్ 6వ తేదిన తుదిశ్వాస విడిచారు. భారత జాతి యావత్తూ ఆయనకు ఋణపడి ఉంది.

## అభ్యాసవేదిక

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కులతత్త్వం | = | తమకులమే గొప్పదనే దృష్టి |
| విముక్తి | = | విడుదల |
| రాజ్యాంగం | = | దేశ పరిపాలనకు ఆధారమైన గ్రంథం |
| మానవత్వం | = | మనిషికి ఉండవలసిన లక్షణం |

**ఈ క్రింది పదాలనుపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

1. ఋణం
2. విముక్తి
3. మైల

**ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. అంబేడ్కర్ జీవిత విశేషాలు రాయండి.
2. అంబేడ్కర్ విద్యాభ్యాసం తెల్పండి.
3. అంబేడ్కర్ ఎదుర్కొన్న అవమానాలు ఏవి?
4. అంబేడ్కర్ ఉద్యమ లక్ష్యాలు వివరించండి.
5. భారతదేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు ఏవి?

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1. అంబేడ్కర్ జీవితచరిత్రను పరిచయం చేయాలి.
2. భారతీయ సంఘాభివృద్ధికి చేసిన సేవలు తెలియజేయాలి.

**విద్యార్థులు చేయవలసిన పనులు :**

1. అంబేడ్కర్ సాధించిన ఉత్తమ కార్యాలు తెలుసుకోవాలి.
2. అంబేడ్కర్ జీవితానికి సంబంధించిన అంశాలను సేకరించాలి.

# ఉపవాచకం

## 1. త్యాగం (కర్ణుడు)

భారత కథలు కొన్నయినా తెలియని భారతీయులు సామాన్యంగా ఉండరు. భారతంలో ఎందరో మహనీయులచరిత్రలు ఉన్నాయి. ఇలాంటి పాత్రలు ఎన్ని ఉన్నా 'కర్ణుడు లేని భారతం లేదు' అనే పేరు వచ్చింది. అంతటి ఘనకీర్తి కర్ణునికే దక్కింది. దీనికి కారణాలు అనేకం. ఇతర పాత్రలకు లేని ఖ్యాతి కర్ణునికి ఉంది. లోకంలో గొప్ప దాన గుణం కలవారిని ప్రస్తావించే సందర్భంలో కర్ణుని తప్పక ప్రస్తావిస్తారు. కనుకనే లోకంలో దానకర్ణుడుగా దాతృత్వంలో అగ్రగణ్యుడుగా నిలిచాడు.



కర్ణుని దాతృత్వాన్ని తెలిపే విషయాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. కర్ణుడు సమాజానికి ఆదర్శప్రాయుడు. అడిగిన వారికి ఇవ్వడమే కాని 'లేదు' అనేది కర్ణునికి తెలియదు. తన స్వగృహంలో దాన గంటను ఏర్పాటుచేశాడు. దానం కోసం వచ్చినవారు ఆ గంటను మ్రోగిస్తారు. ఆ సమయంలో కర్ణుడు ఎంత ముఖ్యమైన పనిలో ఉన్నా అర్థించిన వారి దగ్గరకు వచ్చి సగౌరవంగా వారికి ఏమి కావాలో తానే స్వయంగా తెలుసుకుని వారు కోరిన దానిని ప్రీతితో దానం చేస్తాడు. ఇలా దానం చేయడంలో కర్ణునికి కర్ణుడే సాటి.

కర్ణుడు దుర్యోధనునికి సామంతరాజు. సామంతుడుగా ఉన్న కర్ణుడే దాన గంటను ఏర్పాటు చేసి దానం చేయగా తానెందుకు దానం చేయకూడదు, అని రారాజయిన దుర్యోధనుడు తలంచాడు. తన ఇంటిలో దాన గంటను ఏర్పాటుచేసి దానం చేస్తున్నాడు. ఇలా కర్ణదుర్యోధనులు అడిగిన వారికి కాదనకుండా దానం చేసి లోకఖ్యాతి గడించారు. ఈ విషయం తెలుసుకున్న ఇంద్రుడు, దుర్యోధనునికి తాను చక్రవర్తి అనే గర్వం ఉంది. ఆ గర్వభంగం చేయాలని అనుకున్నాడు. సుయోధనుని కంటె కర్ణుడే గొప్పవాడని నిరూపించాలని అనుకున్నాడు. దేవరాజు బ్రాహ్మణ వేషంలో కర్ణుని దగ్గరకు వచ్చాడు. నేనొక యజ్ఞం చేస్తున్నాను. దానికి కావలసిన పొయ్యి, కలప దానం చేయమని అడగగా కర్ణుడు అంగీకరిస్తాడు. అయితే ఆ కలప ఇప్పుడు అవసరంలేదు. యజ్ఞాన్ని ప్రారంభించగానే వచ్చి తీసుకొని వెళ్ళగలను అని చెప్పాడు. అదే విధంగా దుర్యోధనుని దగ్గరకు కూడా వెళ్లి సహాయం అడిగి, ఒప్పందం చేసుకొని వెళ్లిపోయాడు.

ఇక ఇంద్రుని కపట నాటకం ఆరంభమైంది. అతడు మేఘాలకు రాజు. పుష్కలావర్తకాలు అనే గొప్ప మేఘాలను పిలిచి విరామం లేకుండా జడివాన కురిచేట్లు ఆజ్ఞాపించాడు. దీంతో ప్రపంచం అంతా జలమయమైంది. ఎండ ముఖమే కనిపించలేదు. రోజువారి వంట చేయడానికి కూడా ఎండిన కట్టెలు కరువైనాయి. ప్రజలు పచ్చి పదార్థాల నేతిన వలసివచ్చింది. ఆ జడివానలో ఇంద్రుడు పూర్వం వేసిన బ్రాహ్మణ వేషంలో వచ్చి దుర్యోధనుని చూశాడు. రారాజుతో తనకు ఇస్తానన్న కలపను ఇవ్వమని అడిగాడు. సుయోధనునికి ఏమిచేయాలో దిక్కుతోచలేదు. చేతకాని వానికి కోపం ఎక్కువ అన్నట్లు, ఇంత ముసురులో ఎండు కలప లభించదు. కావున తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనుటకు ఇది తగిన సమయం కాదని చెప్పి బ్రాహ్మణుని కసరుకొని పంపివేస్తాడు. ఇంద్రుడు తన ఎత్తుగడ పారినందుకు లోలోన సంతోషించి కర్ణుని దగ్గరకు వెళ్లి యజ్ఞానికి కావలసిన వాటిని అడిగాడు. దుర్యోధనుడు ఇచ్చిన వాగ్దానం తప్పి నన్ను మోసం చేశాడు. మీరు అలాగే చేస్తే నా యజ్ఞానికి విఘ్నం కలుగుతుంది, అని కపట విచారాన్ని నటిస్తూ ప్రాధేయపడతాడు. చక్రవర్తికే సాధ్యం కానిపని సామంతరాజునకు ఎలా సాధ్యమవుతుంది! కాని కర్ణుడు దానవ్రతుడు, సత్యనిష్ఠుడు. బ్రాహ్మణుని కోరికను తీర్చనిచో దాన వ్రతానికి భంగం కలుగుతుందని, ఆడిన మాట తప్పినట్లవుతుందని కర్ణుడు బాగా ఆలోచించాడు. అతని కోట ఎంతో పెద్దది. దానికి ఎన్నో తలుపులు ఉన్నాయి. ఆ కలపను బ్రాహ్మణునికి ఇవ్వాలని అనుకున్నాడు. అలా చేయాలంటే కోటను పడగొట్టవలసి ఉంటుంది.

మేటి విలుకాడైన కర్ణుడు స్వగృహం పడకుండా తన బాణాలనే దూలాలుగా చేసి భవనం కూలిపోకుండా నిలబెట్టి ఆ కలపనంత బండ్లపై ఎక్కించి బ్రాహ్మణుని వెంటపంపిస్తాడు. కర్ణుని నైపుణ్యానికి శక్తిసంపన్నుడయిన దేవేంద్రుడు కూడా ఆశ్చర్యచకితుడయ్యాడు. దుర్యోధనుడు ఈ విషయాన్ని తెలుసుకొని అట్టి సత్యనిష్ఠ లేనందులకు సిగ్గుపడతాడు. మిత్రుడైన కర్ణుని నిపుణతకు సంతోషిస్తాడు. దాన గంట కట్టుకొనడమే అర్హతకాదని భావించి తన గంటను తీసివేస్తాడు.

ఈ జగత్తులో కొన్ని నియమాలను పెట్టుకుని వాని ప్రకారం నడుచుకొనేవారు కొందరుంటారు. కొందరు తమ నియమాలవలన తమకే హాని కలుగుతుందంటే ఆ నియమభంగం చేయడానికి కూడా వెనకాడరు. కాని కర్ణుడు మాత్రం అటువంటి వాడు కాదని నిరూపించి మహాభారత కథకు వన్నె తెచ్చిన అపూర్వమైన వ్యక్తిగా వన్నెకెక్కాడు.

కర్ణుడు సూర్యుని వర ప్రభావం వలన కుంతీదేవికి సహజ కవచ కుండలాలతో జన్మించాడు. వాటి ప్రభావం వలన కర్ణుని ఎవరూ జయించలేరు. ఈ సంగతి తెలుసుకున్న దేవేంద్రుడు తన వర ప్రభావంచే కుంతికి జన్మించిన అర్జునుడు కూడా విలువిద్యలో ప్రావీణ్యుడు. కర్ణుడు, అర్జునుడు విలువిద్యలో సమానమైన నైపుణ్యం కలవారు కనుక కర్ణార్జునులకు పరస్పర వైరం కొనసాగుతుంది. కర్ణుని కవచకుండలాలను అపహరించాలని ఇంద్రుడు ప్రయత్నం చేశాడు. ఇంద్రుని దురుద్దేశాన్ని ఊహించిన సూర్యుడు కర్ణుని ఆపద నుండి రక్షించాలని బ్రాహ్మణ రూపంలో వచ్చే దేవేంద్రుని కుట్రను కర్ణునికి తెలియజేస్తాడు. కర్ణుడు సూర్యసాక్షాత్కారం పొంది పూజించి ఓ ప్రభూ! భూదేవులు వచ్చి ప్రాణాలను అడిగినా దానం చేయుటయే నా వ్రతం. అటువంటిది ఇంద్రుడే స్వయంగా వచ్చి యాచించినపుడు అల్పమైన కవచకుండలాలను దానం చేయకుండుట అధర్మం. అర్జునునికి నా వలన ప్రాణభీతి కలదని తెలిసి పుత్రభిక్ష పెట్టమని ఇంద్రుడు చేయి చాపగా నేను వ్రతాన్ని త్యజించి నిరాకరింపజాలను. కావున నీ హితోపదేశాన్ని పెడచెవిన పెడుతున్నందుకు నన్ను క్షమించు అని ప్రార్థించాడు. సూర్యుడు, కర్ణుని దాతృగుణాన్ని మెచ్చుకొని ఇంద్రుని దగ్గరున్న 'శక్తి' అనే ఆయుధాన్ని అయినా కోరుకొమ్మని చెప్పి అంతర్ధానమయ్యాడు.

కొన్నాళ్ళు గడిచింది. ఒకరోజు కర్ణుడు బ్రాహ్మణులకు దానాలు చేస్తున్నాడు. ఆ సమయంలో ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి యాచిస్తాడు. ఏమి కావాలని కర్ణుడు ప్రార్థించగా అదే అదును కోసం చూసే సహస్రాక్షుడు కర్ణుని కవచకుండలాలను ఆశిస్తాడు. సూర్యుని మాటలు జ్ఞాపకానికి వచ్చి ఇతను ఇంద్రుడే అని నిర్ణయించుకుంటాడు.

"బ్రాహ్మణ రూపంలో వచ్చి నన్ను మోసగించుట నీకు ధర్మం కాదు", అని సవినయంగా పలికాడు. అంత ఇంద్రుడు "ఓ కర్ణా! నీవు దాన, సత్య వ్రతాలను పాటించే నియమాలు కలవాడవు. అర్థించి వచ్చిన కోరికను భంగంచేయుట నీకు ధర్మం కాదు" అంటాడు. కర్ణుడు మరో మాట మాటాడక తన కవచకుండలాలు స్వయంగా కోసి దానం చేసి దానకర్ణునిగా నిలిచాడు. ఇలా తమకున్న సంపదలను ఇతరులకు ఇవ్వడం కంటె స్వార్థాన్ని, స్వలాభాన్ని త్యజించుటయే త్యాగం.

కౌరవులకు పాండవులకు యుద్ధం నిశ్చయమైంది. కర్ణుడు దుర్యోధనుని ప్రాణమిత్రుడు. కర్ణుని ఎలాగయినా పాండవ పక్షానికి మళ్ళించాలని కృష్ణుడు భావించాడు. రహస్యంగా కర్ణుని గృహానికి వెళ్ళి ఓ కర్ణా! నీవు కుంతి పెద్దకుమారుడవు. కనుక నీవు పాండవ పక్షంలో చేరినటయ్యితే ధర్మరాజు రాజ్యానికి పట్టాభిషేకం చేస్తాడు. అందగత్తె అయిన ద్రౌపది నిన్ను ఆరవ భర్తగా స్వీకరిస్తుంది, అని తెలియజేస్తాడు. సామంతుడుగా ఉన్న కర్ణునికి హఠాత్తుగా చక్రవర్తి పదవి సిద్ధమైంది. స్వయంవరం సమయంలో కర్ణుని వరింప తిరస్కరించిన ద్రౌపది ఇక్కడ తనను వరిస్తుంది. ఇటువంటి అవకాశాన్ని ఇతరులెవరైనా వదలుకుంటారా! కాంతపైన, కనకంపైన ఆశలేని వారెవ్వరు. ఒక్క కర్ణుడు తప్ప. ప్రాణ మిత్రుడయిన దుర్యోధనుని మోసగించడానికి కర్ణుని మనస్సు అంగీకరించలేదు. కుంతికి కుమారుడై పుట్టినా తనను పెంచి పెద్ద చేసిన సూత దంపతులకు దూరమై వారికి దు:ఖాన్ని కలిగించడానికి మనస్సు ఒప్పుకోలేదు. కనుక కర్ణుడు ధర్మాన్ని పాటించి చేజిక్కిన సామ్రాజ్యాన్ని గూడ తృణప్రాయంగా త్యజించాడు. ఇంతకన్నా త్యాగానికి మరో ఉదాహరణ లేదు.

కురుపాండవ యుద్ధం చేరువైన రోజుల్లో కుంతీదేవి చాలభయపడుతుంది. కర్ణుని చేతిలో పాండవులకు మరణం కలుగుతుందని ఆమె భయం. కర్ణుని దగ్గరకు వచ్చి శ్రీకృష్ణుడు చెప్పినట్లే చెప్పి "చక్రవర్తివి కమ్ము" అని బోధించింది. ఆమె మాటలు సత్యం అని సూర్యదేవుడు కూడా పలికాడు. కాని కర్ణుని ధర్మబుద్ధి మాత్రం చలింపలేదు. శ్రీకృష్ణుని కిచ్చిన సమాధానమే తల్లికి కూడ లభించింది. కాని కుంతి తనకు తల్లి అంతేకాక పుత్రభిక్ష కోసం వచ్చింది. ఆమె భయాన్ని తొలగించటం తన ధర్మం. ఆమె కోరిక తీర్చినచో దుర్యోధనుని మోసగించినట్లే అవుతుంది. ఇటువంటి మోసం కర్ణుడు చేయగలడా? కనుక పాండవులలో అర్జునుని తప్ప ఇతరులను వధింపనని తల్లికి మాట ఇచ్చాడు. ఇది ఆమెకు వరం. అర్జునుని మాత్రమే వధిస్తానని కర్ణుడు దుర్యోధనునికి మాట ఇస్తాడు. అందుచే ఈ వరం దుర్యోధనుని మోసగించడం కాదు. ఈ వాగ్దానం అనుసరించే యుద్ధంలో ఎన్ని అవకాశాలు వచ్చినా కర్ణుడు ధర్మరాజును భీముని వధింపక అవమానపరిచి వదిలివేస్తాడు. వారిని సంహరిస్తే భారతకథ మరొక విధంగా ఉండేది కదా! ఇంతకంటె కర్ణుని త్యాగశీలత్వానికి నిదర్శనమేమి కావాలి, త్యాగనిరతిలో కర్ణునికి కర్ణుడే సాటి.

## అభ్యాసవేదిక

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. కర్ణుని చూచి దుర్యోధనుడు ఏమి చేశాడు?
2. ఇంద్రుడు దేనిని యాచించాడు?
3. దుర్యోధనుడు దానగంటను విప్పటానికి కారణమేమి?
4. సూర్యుడు కర్ణునితో పలికిన విధానం?
5. ఇంద్రుని కపటనాటకం ఎటువంటింది.
6. కర్ణున్ని త్యాగశీలాన్ని వివరించండి?
7. కుంతీదేవి భయానికి కారణం ఏమి? కర్ణుడు అమెకు ఎటువంటి వరమిచ్చాడు?

## 2. సేవ (కర్మవీరుడు కామరాజు)

త్యాగం, నిరాడంబరత అనగానే మనకు జ్ఞప్తికి వచ్చే మహనీయుడు మహాత్మా గాంధీ. గాంధీ అడుగు జాడలలోనే పయనించి ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాయకులలో ఒకరు, తమిళనాడు రాష్ట్రానికి చెందిన కామరాజుగారు.



తమిళనాడు రాష్ట్రం విరుదు నగర్‌లో 1903వ సంవత్సరం జూలై, 15 వ తేదీన కుమారస్వామి, శివగామి అమ్మాళ్ పుణ్య దంపతులకు కామరాజు జన్మించారు. తనని తన అమ్మమ్మ 'కామాక్షి' అని పిలిచేది. తల్లి శివగామి అమ్మాళ్ ముద్దుగా 'రాజా' అని పిలుస్తుండగా, అమ్మమ్మ పిలిచే 'కామాక్షి' పేరుకి, తల్లి ముద్దుగా పిలిచే 'రాజా'ను కలిపి, తండ్రి కుమారస్వామి ఆ బిడ్డకు కామరాజు అని నామకరణం చేశారు.

కామరాజు తన 12 వ యేట విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పి తిరువనంతపురంలోని బోడినాయకనూరులో ఒక చిన్న చిల్లరకొట్టులో పనిచేసేవారు. కాని తాను చేసేపనిలో తనకి తృప్తి లేదు. అదే సమయంలో స్వాతంత్ర్యపోరాటం చేసే నాయకుల ప్రసంగాలను వినడానికి ఆసక్తి చూపించేవారు.

### రాజకీయ ప్రవేశం :

1918 మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత పత్రికల్లో యుద్ధం జరిగిన తీరును గురించి చదివారు కామరాజు. అదే సమయానికి మహాత్ముడు పంపిన భారత సంగ్రామ సందేశాన్ని చదివారు. ఆ మరుసటి సంవత్సరం 1919 ఏప్రిల్ 6న రౌలత్ చట్టాన్ని వ్యతిరేకించి సత్యాగ్రహం చేపట్టారు. అలాగే జలియన్ వాలాబాగ్ మారణకాండ కామరాజు జీవితంలో పెద్ద మార్పును తీసుకువచ్చింది. విదేశీ నియంతృత్వ పరిపాలనకు అడ్డుకట్ట వేసి స్వతంత్ర భారతదేశంగా రూపుదిద్దే భారత పౌరుడుగా ఉంటానని ప్రతిజ్ఞ చేశారు. కామరాజు సహాయనిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, విదేశీ వస్త్రనిరాకరణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1923న కల్లు దుకాణ నిషేధం చేయాలని పోరాటం చేసి, తరువాత గాంధీజీ ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహ పోరాటంలో పాల్గొని అలిప్పురం జైలులో రెండేళ్ళు శిక్ష అనుభవించారు.

### సత్యమూర్తిగారితో స్నేహం :

సత్యమూర్తిగారు మరణించే వరకు వీరి స్నేహం బలంగా ఉండేది. వీరిరువురు పాలు నీళ్ళ వలె కలసి మెలసి ఉండేవారు. ఒకసారి బ్రిటీషు ప్రభుత్వం "మదరాసు సర్వకళాశాలల"కు ఉపకులపతి (Vice-Chancellor) పదవికి సత్యమూర్తిగారి పేరును ప్రతిపాదించింది. కాని సత్యమూర్తిగారు కామరాజుగారితో చర్చించి సమాధానమిస్తానని చెప్పారు. వ్యక్తిగత శాసనోల్లంఘన ఉద్యమం రావడం వల్ల ఎలా ఉపకులపతి పదవికి

మీరు అంగీకరిస్తారు. పదవిని స్వీకరిస్తే రాజకీయ జీవితానికి మచ్చ ఏర్పడతుందని కామరాజుగారు సత్యమూర్తిగారితో అన్నారు. సత్యమూర్తి కామరాజు సలహా స్వీకరించి పదవిని తిరస్కరించారు. ఈ విధంగా సత్యమూర్తి, కామరాజు గారు క్లిష్టమైన పరిస్థితులలో ఇరువురు చర్చించి మంచి నిర్ణయం తీసుకొనేవారు.



## ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రి :

1954వ సం॥ ఏప్రిల్ 13వ తేదిన మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని స్వీకరించారు. తొలిరోజే ''రోజంతా కష్టపడేవాళ్ళను, పనివాళ్ళు, కూలివాళ్ళు అని తక్కువ చేసి మాట్లాడతాం. కొంత మంది కష్టపడకుండానే ఇతరులకష్టంపై ఆధారపడి బతికే సోమరులను యజమానులు, ధనికులు అని చెప్తున్నాం. ఇలాంటి అసమానతలను పోగొట్టడమే నా ప్రథమ లక్ష్యం. లేదంటే ఈ పదవి నాకు అవసరం లేదు'' అని సభాముఖంగా పలికారు.

భారతదేశంలోని ముఖ్యమంత్రులలో కామరాజు విశిష్టమైన వ్యక్తి అని అతి స్వల్పకాలంలోనే నిరూపించారు. మనసు చలించకుండా, ధైర్యసాహసాలతో ఓర్పుతో కార్యకలాపాలను గమనించారు. ప్రతిపక్షం యొక్క సలహాలను ఓర్పుగా విని నేర్పుగా సమాధానమిచ్చారు. ప్రజలనిత్యావసరాలైన కూడు, గుడ్డ, గూడులను ప్రజలకు అందించారు. ఆడంబరం, ముఖస్తుతి, మొదలైన వాటిని అసహ్యించేవారు. నిరాడంబరతను అనుసరించి ముఖ్యమంత్రి పదవికే వన్నె తెచ్చారు అంటే అతిశయోక్తి లేదు.

1955 వ సం॥ డిసెంబరులో భయంకరమైన తుఫాను, జడివానతో తమిళనాట చాలా ప్రాంతాలు బాధింపబడ్డాయి. వరద బాధితులను ఆదుకోవడానికై బయలుదేరి పరమకుడి ప్రాంతానికి కామరాజుగారు వెళ్ళారు. అక్కడ వంతెన ఒకటి తెగిపోగా పారుతున్న నీటిలో పగ్గాల సహాయంతో ఏరుదాటి వెళ్ళారు. ఇలా రాష్ట్రమంతా తిరిగి ప్రజలకష్టాలు గమనించి సరికొత్త పథకాలు ప్రవేశపెట్టారు.



## కామరాజు విద్యాసేవ :

భారతదేశం ఎన్నో సమస్యలకు నిలయంగా ఉండేది. అందులో నిరక్షరాస్యత ఒకటి. కామరాజుగారు నిరక్షరాస్యత నిర్మూలనకు నడుంకట్టి తమిళనాడు ప్రజలందరిని అక్షరాస్యులను చేయాలని, విద్యావ్యవస్థను గ్రామ ప్రాంతాలకు తీసుకెళ్ళారు. తొలిదఫా ప్రవేశ పెట్టిన 21500 పాఠశాలలను 30000 పాఠశాలలుగా పెరిగాయి. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నిర్బంధ ప్రాథమిక విద్యాపథకాన్ని ప్రవేశపెట్టి, వేలాది గ్రామాలలో ప్రాథమిక పాఠశాలల స్థాపనకు కృషి చేశారు.

కరువు కాటకాలతో కృశించిన శరీరం, వెలుగుచూడని కళ్ళు, చింపిరి జుట్టు, బట్టలు లేని శరీరం సమాజం తోసిపుచ్చిన పూరిగుడిసె జీవితం, కడుపునిండా గంజి లేక జీవితం గడిపే నిరుపేద తన బిడ్డనెలా పాఠశాలకు పంపుతాడని "మధ్యాహ్న భోజన పథకాన్ని" ప్రవేశ పెట్టి ప్రజలకష్టాలను తీర్చి ఆదుకున్నారు. పలువురి చేత ప్రశంసలు అందుకున్నారు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ పథకాన్ని కళ్ళార జూచి ఆనందపరవశుడైనారు. అంతే గాకుండా పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు ఇప్పించారు. కామరాజు విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన పథకాలు ఫలితంగా తమిళనాడులో పాఠశాల లేని గ్రామమే లేదు. విద్యాభివృద్ధితో పాటు విద్యాప్రమాణాలు దిగజారకుండా ఉండడానికి చర్యలు చేపట్టారు.

## కామరాజు పాలనలో వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధి :

దేశాభివృద్ధి వ్యవసాయం ద్వారా జరుగుతుందని గుర్తించి దిగువ భవాని, మణిముత్తారు, ఆరణి కాలువ, సాత్తనూరు, కావేరి, కృష్ణగిరి మొదలైన ప్రాంతాలలో నదులపై ఆనకట్టలు కట్టించి వ్యవసాయాభివృద్ధికి దోహదపడ్డారు. పరిశ్రమలు కూడా అభివృద్ధి పథంలో నడిచాయి. కోట్లాది రూపాయలతో పరిశ్రమలు నెలకొల్పారు. నైవేలి నేలబొగ్గు పథకం, గిండిలో క్యాన్సర్ వైద్యశాలతోపాటు అనేక చక్కెర ప్యాక్టరీలు, ఉప్పు ప్యాక్టరీలు, సిమెంటు

పరిశ్రమలు, పెరంబూరులో రైలు పెట్టెల కర్మాగారం, మేట్టూరు కాగిత పరిశ్రమలు కామరాజుగారి పరిపాలనలోనే వెలుగుచూశాయి.

తమిళనాడు రాజకీయ చరిత్రలో పూరిగుడిసెకు, కోటకు మధ్య వారధి నిర్మించి ప్రజల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నవారు కామరాజు. పదవీ వ్యామోహం లేకుండా ఇద్దరు ప్రధాన మంత్రులను ఎన్నిక చేసి 'కింగ్ మేకర్' అనే పేరు తెచ్చుకున్నారు. ఉదయాన్నే దినపత్రికలు చదివి ప్రజాసమస్యలను గుర్తించేవారు. కామరాజుగారి సహాయం కోరివచ్చేవారు ఎవరైనా సరే జాతి, మత, కుల భేదం లేకుండా స్వపక్షమా, ప్రతిపక్షమా, మిత్రపక్షమా అని కూడా చూడక అందరికి సహాయ సహకారాలు అందించేవారు.

ప్రజాసేవ లక్ష్యంగా, శ్వాసగా జీవించిన కామరాజు 1975 వ సం॥ అక్టోబరు 2 వ తేది గాంధీ జయంతి రోజున తుదిశ్వాస విడిచి 'ప్రజాహృదయాలు' అనే దేవాలయాల్లో దేవుడై కొలువున్నారు.

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. కామరాజుగారు తల్లిదండ్రులు ఎవరు? ఎక్క డ జన్మించారు?
2. కామరాజుగారి విద్యాసేవ ఎలాంటిది?
3. కామరాజు ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రి అని ఎలా పేరు తెచ్చుకున్నారు?



# 3. కరుణ (మదర్ థెరిసా)

తల్లిఋణం తీర్చుకోలేనిది అంటారు. అందుకే 'మాతృదేవో భవ' అని ముందుగా చెప్తారు. యావత్ప్రపంచానికే తల్లి అయి, ఊహించలేని విధంగా ఎందరో దీనులను ప్రేమతో దగ్గరకు తీసి వారికి సేవచేసిన కరుణామూర్తి, యావత్ ప్రపంచం చేత మదర్‌గా పిలిపించుకొని అదే సార్థక నామధేయంగా కీర్తి కెక్కిన మానవతామూర్తి మదర్ థెరిసా. మదర్ థెరిసా ఋణం ఎవరూ తీర్చుకోలేనిది.



మదర్ థెరిసా 1910 వ సంవత్సరం ఆగస్టు 27 వ తేదిన యుగోస్లేవియా దేశంలో స్కోప్జే అనే గ్రామంలో పుట్టింది. ఆమె తల్లిదండ్రులు 'ఆల్బేనియన్'లు. ఆమె అసలు పేరు 'ఆగ్నెస్ గోన్హా బొజాక్ష్యువా' తండ్రి ధర్మబుద్ధి గలవాడు, దైవభక్తుడు. కానీ తండ్రి ప్రేమను పొందే అదృష్టం ఆ పిల్లలకు లేదు. ఆగ్నెస్ ఏడవ ఏటనే తండ్రి మరణించాడు. తల్లి ఎంతో కష్టపడి పిల్లలను చదివించింది. ఆగ్నెస్ సేవాగుణం చిన్న వయస్సులోనే అందరినీ ఆశ్చర్యపరచింది. ఆమె ఒక రోజు తరగతికి ఆలస్యంగా వెళ్ళింది. 'ఎందుకు ఆలస్యం?' అని టీచర్ అడిగింది. ' ఒక ముసలి మనిషి జ్వరంతో ఉండి, సొమ్మసిల్లి రోడ్డు మీద పడిపోతే ఆయనను ఆస్పత్రిలో చేర్పించి వస్తున్నాను'' అని చెప్పింది. కోపంగా ఉన్న ఉపాధ్యాయిని మనస్సు సంతోషంతో నిండిపోయింది. ఆ టీచర్ ఆగ్నెస్‌ను చాలా మెచ్చుకుంది.

యుగోస్లేవియాకి చెందిన 'జెస్యూట్' లు భారతదేశానికి మత ప్రచారానికి వచ్చారు. కలకత్తా నగరంలో వారు నిరుపేదలకు చేసిన సేవలను గురించి రాసి, వారి మిషనరీలకు తెలిపేవారు. అది తెలుసుకున్న ఆగ్నెస్ కూడా తన జీవితాన్ని మానవసేవకే అంకితం చేయాలని నిశ్చయించుకొంది. 1928 నవంబరు 29 న ఐర్లాండులోని డబ్లిన్‌లో ఉన్న 'లోరెటో' అనే సేవాకేంద్రంలో చేరింది. 1931 మే 24 వ తేదీన ప్రమాణ స్వీకారం చేసి ఆగ్నెస్ ''థెరిసా''గా మారింది.

మదర్ థెరిసాకి ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. కలకత్తాలోని సెయింట్‌మేరీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. ఆ తర్వాత అదే పాఠశాలకి 1944 లో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసింది. కలకత్తా మురికివాడ 'మోతీజీల్'లో నివసిస్తున్న పిల్లలకు తినడానికి తిండి, ధరించడానికి బట్టలు ఉండేవి కావు. అపరిశుభ్రంగా జీవిస్తుండేవారు. ఆ మురికివాడలోని పిల్లలకు తిండి, బట్టలను కల్పించింది. వారికోసం ఒక పాఠశాలను ప్రారంభించింది. తెల్లని రంగులో నీలం అంచున్న నూలు చీరను ధరించింది. పాఠశాలలో నల్లబల్లలు లేకున్నా ఇసుకలో అక్షరాలను దిద్దిస్తూ మురికివాడలోని పిల్లలకు పాఠాలను బోధించింది.

మదర్ థెరిసా 1952 లో గుండెను పిండిచేసే ఒక దృశ్యాన్ని చూసింది. ఒక ఆసుపత్రి ఎదురుగా ఒక స్త్రీ పడి ఉంది. ఆమెను ఎలుకలు పీక్కు తింటున్నాయి. ఈ దృశ్యం ఆమె మెత్తటి హృదయంపై ఎంతో

ప్రభావాన్ని చూపింది. దానితో అనాథలకు, రోగపీడితులకు, మృత్యువుతో పోరాడుతున్న వారికి ఒక ఆశ్రమాన్ని ఏర్పరించింది. ఆ ఆశ్రమానికే 'నిర్మల్ హృదయ్' అని పేరు పెట్టింది. దీనిని ఒక దేవాలయంగా చూసుకుంది. అలాగే కుష్ఠురోగులకు ప్రత్యేకంగా ఒక ఆశ్రమాన్ని ఏర్పరిచి దానికి 'ప్రేమ్‌దాన్' అని పేరు పెట్టి వారికి సేవలు చేసింది. అనాథలైన శిశువులకొరకు 'శిశుసదన్' ను స్థాపించి అక్కున చేర్చుకుంది.



1962 ఏప్రిల్‌లో మదర్ థెరిసా సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదు నిచ్చి సత్కరించింది. 1971 జనవరిలో పోప్‌జాన్, శాంతి బహుమానం అందచేసి ఆమెను 'శాంతిదూత'గా అభివర్ణించారు. 1979 సంవత్సరంలో ఆ కరుణామయికి 'నోబెల్ బహుమతి' లభించింది. 1980 లో అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఈ కరుణామూర్తికి 'భారత రత్న' బిరుదునిచ్చి సత్కరించారు. అందిన పురస్కారాలు, డబ్బంతా అనాథలకు, పేదలకు, రోగులకు, చావుబ్రతుకులమధ్య నలిగిపోతున్నవారికి ఖర్చుపెట్టేది.

1971లో బంగ్లాదేశ్ యుద్ధం జరిగినపుడు వేలాది శరణార్థులు భారతదేశం లోకి వచ్చారు. తాగడానికి నీరు, తినడానికి తిండిలేక దిక్కుతోచని పరిస్థితులలో వారికి ప్రత్యేక శిబిరాలను నిర్మించి ఆశ్రయం కల్పించింది. కొన్ని శిబిరాలలో కలరా వచ్చి ప్రజలు నిరాశ నిస్పృహలకు గురైనారు. ఆ కరుణామూర్తి, సహచరులతో శిబిరాలను లోషన్లతో కడిగి, బట్టలు ఉతికి వారికి మందు లిచ్చి సేవచేసింది.

1977 నవంబరులో ఆంధ్రప్రదేశ్ దివిసీమ పెను తుఫానుకు గురైంది. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఎక్కడచూచినా ఆర్తనాదాలే, ఏడ్పులే. పరిస్థితిని తెలుసుకొన్న ఆ కరుణామయి తన సహచరులతో కొండంత అండగా నిలిచి ప్రజలకు సేవలు చేసింది.

మదర్ థెరిసా లక్షలాది నిరాశ్రయులకు సేవచేస్తూ జీవితం గడిపింది. ఇలా కలకత్తా వాసులకు, తర్వాత భారతదేశ ప్రజలకు, ఆ తర్వాత మొత్తం ప్రపంచ ప్రజలకు అమ్మ అయి, "విశ్వమాత"గా ఎదిగారు. కోట్లాది జనులహృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొనింది.

అటువంటి పవిత్రమూర్తి, కరుణామయి అయిన మదర్థెరిసా 1997 సెప్టెంబరు 5వ తేదిన పరమపదించింది. ఎదుటి వారి కష్టాలను తన కష్టాలుగా భావించి ప్రేమ, కరుణ, దయ, చూపించింది. విశ్వమాతగా ప్రేమాభిమానాలు పొందిన మదర్ థెరిసా మన హృదయాలలో ఎన్నటికి నిలిచే ఉంటుంది.

### ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఆగ్నెస్ ఎప్పుడు, ఎక్కడ జన్మించింది?
2. ఆగ్నెస్ స్కూలుకు ఎందుకు ఆలస్యంగా వచ్చింది?
3. మదర్ థెరిసా "నిర్మల్ హృదయ్" లో చేసిన సేవలను గూర్చి వ్రాయండి.
4. కలకత్తా మురికివాడ "మోతీజీల్" లో థెరిసా చేసిన సేవలను వివరించండి.
5. మదర్ థెరిసా సేవలకు అందుకున్న సత్కారాలను పేర్కొనండి.

**ఉపాధ్యాయులకు చూచనలు :**

మరికొంతమంది సంఘసేవకులను విద్యార్థులకు పరిచయం చేయండి.

**విద్యార్థులకు సూచనలు :**

మీకు తెలిసిన సంఘ సేవకుణ్ణి గురించి వ్యాసం రాయండి.



# 4. వినయం (ఏకలవ్యుడు)

పూర్వం హిరణ్యధన్వుడనే ఎరుకరాజు ఉండేవాడు. అతని కుమారుడు 'ఏకలవ్యుడు'. కౌరవ పాండవులకు విలువిద్య నేర్పిస్తున్న గురువు 'ద్రోణాచార్యులు'. ఒక రోజు ఏకలవ్యుడు విలువిద్యను నేర్చుకోవాలని ద్రోణాచార్యులదగ్గరకు వెళ్ళాడు. 'ఆచార్యా! నాకు కూడా విలువిద్యను నేర్పించండి'! అని అడిగాడు. దానికి ద్రోణాచార్యులు, 'నీవు ఎవరు?' అని అడిగాడు. 'నేను ఎరుకల వాని కుమారుడను. నా పేరు ఏకలవ్యుడ'ని బదులిచ్చాడు. ద్రోణాచార్యులు 'విలువిద్య క్షత్రియ వంశీయులకే గానీ నీలాంటివారికి కాదు' అని అతనిని శిష్యునిగా అంగీకరించలేదు. ఏకలవ్యుడు నిరాశతో అడవిలోకి తిరిగి వెళ్ళాడు.

ఏకలవ్యుడు అడవిలో మట్టితో ద్రోణుని 'ప్రతిమ' ను చేశాడు. దానికి వినయంతో, భక్తితో ప్రదక్షిణలు చేశాడు. తానే ఎడతెగని విలువిద్యా సాధన ప్రారంభించాడు. క్రమంగా విలువిద్యా రహస్యాలన్నీ గ్రహించాడు. ఒకరోజు హస్తినాపురం నుండి కౌరవపాండవులు కలిసి భటులను, కుక్కలను వెంటబెట్టుకొని అడవికి వేటకు వెళ్ళారు. అందరూ అడవిలో తిరుగుతూ వుండగా ఒక భటుడి కుక్క దారి తప్పింది. అది పరుగెడుతూ ఒక చోట ఒంటరిగా బాణాలు వేస్తున్న ఏకలవ్యుడిని చూచి, దగ్గరకు వెళ్లి మొరిగింది. అప్పుడు ఏకలవ్యుడు తన నైపుణ్యంతో ఏడు బాణాలను ఒకేసారి వేసి మొరగనీయకుండా దాని నోటిని కట్టడిచేశాడు. దాంతో అది నోరు తెరవడానికి వీలుకాలేదు. అలాగే ఆ కుక్క బాణాలతో రాజకుమారుల దగ్గరికి పరుగెత్తుకొని వెళ్ళింది. దానికేమాత్రం దెబ్బ తగలకుండా, నోటిని మాత్రమే మూసి ఉన్న బాణాలను చూసి రాజకుమారులు ఆశ్చర్యపోయారు.

కౌరవపాండవులు ఈ విధంగా కొట్టినవారు ఎవ్వరా? అని అడవిలో వెదికారు. ఒక చోట జింక చర్మాన్ని ధరించి, మురికి పట్టిన నల్లని దేహాన్ని కలిగి, పదునుపెట్టిన బాణాన్ని చేతపట్టుకొని ఉన్న ఏకలవ్యుడిని చూశారు. ఆ రాజకుమారులందరూ ఆశ్చర్యంతో ఒకరి ముఖం ఒకరు చూసుకొన్నారు. రాజకుమారులు అతని బాణ ప్రయోగంలోని నేర్పరితనాన్ని మెచ్చి "నీవు ఎవ్వడవు? ఎవ్వరి వద్ద విలువిద్య నేర్చుకొన్నావు?" అని అడిగారు. దానికి "నేను హిరణ్యధన్వుడనే ఎరుకలరాజు కుమారుడిని. ద్రోణాచార్యుల శిష్యుడిని. ఏ దోషం లేనివాడిని. నన్ను ఏకలవ్యుడు అని పిలుస్తారు." అంటాడు.

కౌరవపాండవులు ఏకలవ్యుడు చెప్పింది విని, తిరిగి వచ్చి తమ గురువు ద్రోణునికి ఆ సంగతినంతా చెప్పారు. ఒక రోజు అర్జునుడు ఏకాంతంగా ఉన్న ద్రోణునితో ఈ విధంగా అన్నాడు. "విలు విద్యలో నా కంటే అధికులు ఎవరు లేకుండా నేర్పుతానని ఇది వరకు నాకు మాట ఇచ్చారు. ఇప్పుడు నాకే కాదు, ఈ ముల్లోకాలలో అందరి కంటే విలువిద్యలో అధికుడైన ఒక ఎరుకలవాడిని చూశాను. ఆ ఎరుకల వాడు నా కంటే, మీ కంటే ఈ లోకంలో అధికుడు. మహా బలవంతుడు. అతడు మీ ప్రియశిష్యుడట కదా!" అన్నాడు. అది విని ద్రోణాచార్యులు అడవికి బయలుదేరారు. విలువిద్య సాధనలో మునిగివున్న ఏకలవ్యుని దగ్గరకు వెళ్ళారు. ఏకలవ్యుడు ఎదురుగా వచ్చిన ద్రోణునికి నమస్కరించాడు. "నేను మీ శిష్యుడిని! మిమ్మల్ని సేవించి ఈ విలువిద్య నేర్చుకొన్నాను" అని చేతులు జోడించి నిలిచాడు.

అతడిని చూచి ద్రోణుడు 'అయితే నాకు గురుదక్షిణ ఇమ్మ'న్నాడు. అందుకు సంతోషించి ఏకలవ్యుడు ''ఇదే నా దేహం, ఇదే సాధనం, ఇదే నా సేవక సమూహం. వీటిలో మీకేది ఇష్టమో దానిని తప్పకుండా సంతోషంగా ఇస్తాను. దీనికి తిరుగు లేదు' అని ఏకలవ్యుడు చెప్పాడు. 'నీ కుడి చేతి బొటన వ్రేలిని కోసి ప్రీతితో నాకు గురుదక్షిణగా ఇవ్వు! అది నాకు ఇష్టం'' అని ద్రోణుడు అడిగాడు. ఏకలవ్యుడు వినయంతో తన కుడి చేయి బొటన వ్రేలిని కోసి ఆచార్యునికి ఇచ్చాడు.

ఏకలవ్యుడు కుడిచేతి బొటన వ్రేలిని ఇవ్వటం వలన అతడు బాణానికి ఉన్న 'నారి'ని సంధించలేక, విలువిద్యా ప్రదర్శనలో నేర్పరితనాన్ని కోల్పోయాడు. గురువు పట్ల గల ప్రేమతో, వినయంతో, భక్తి శ్రద్ధలతో ద్రోణాచార్యులకు ఏకలవ్యుడు గురుదక్షిణ సమర్పించాడు. చరిత్రలో ఈ సంఘటన ద్రోణాచార్యులకు అపకీర్తిని ఏకలవ్యుడికి స్థిరమైన కీర్తి కలగడమే కాక, గురువులపట్ల గల వినయ విధేయతలు ఎలాంటివో తెలియజేస్తాయి.

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. ఏకలవ్యుడు ఎవరు?
2. ఏకలవ్యుడు ఎవరి దగ్గరకు, ఎందుకు వెళ్లాడు?
3. ఏకలవ్యుని విలువిద్యా నైపుణ్యాన్ని వివరించండి.
4. ఏకలవ్యుని చూచి రాజకుమారులు ఏమని అడిగారు?
5. అర్జునుడు ద్రోణాచార్యున్ని ఏకాంతంగా ఏమని అడిగాడు?
6. ఏకలవ్యుని వినయం, భక్తి శ్రద్ధలను గూర్చి వివరించండి.



## 5. పరోపకారం (కపోతి - కపోతం కథ)

ఒక అడవిలో ఒక పెద్ద మర్రిచెట్టు. ఆ చెట్టు మీద ఓ పావురాల జంట అన్యోన్యంగా జీవిస్తున్నాయి. ఒక రోజు ప్రొద్దునే కపోతి (భార్య పావురం) ఆహారం కోసం వెళ్ళింది. ఆ రోజునే ఒక వేటగాడు అడవికి వచ్చాడు. అడవిలో ఒక చోట వలను వేసి దూరంగా ఒక పొదచాటున వేచిచూస్తున్నాడు. మేతకు వెళ్ళిన కపోతి ఆ వేటగాడి వలలో చిక్కుకుంది. చాలా సేపు తర్వాత వేటగాడు వలదగ్గరకు వచ్చి చూశాడు. వలలో ఉన్న పక్షులను చూసి ఆనందపడ్డాడు. వలతో పాటే ఆ పక్షులను పట్టుకొని ఇంటికి బయలుదేరాడు. సరిగ్గా అదే సమయంలో వర్షం కుండపోతగా కురిసింది. వేటగాడు ఆశ్రయం కోసం ఆ పెద్ద మర్రిచెట్టు నీడకు చేరుకొన్నాడు. సాయంకాలం అవుతున్నది. అయినా ఆహారం కోసం వెళ్ళిన కపోతి ఇంకా ఇంటికి రాలేదు. చెట్టుపై ఉన్న కపోతం (భర్తపావురం) చాలా దిగులుపడింది.



"ఎప్పుడో ప్రొద్దుపొడవగానే వెళ్ళిన కపోతి ఇంత వరకు తిరిగి రాలేదు. ఎక్కడ ఉందో? ఎలా ఉందో? నా ప్రాణేశ్వరికి ఏదైనా ఆపద వచ్చిందా? ఆమె లేని నా జీవితం వ్యర్థం. నా హృదయేశ్వరి ఏ వేటగాడి చేతిలోనో చిక్కలేదు కదా!" అని కపోతం బాధపడసాగింది. ఇంతలో వాన తగ్గు ముఖం పట్టింది. చలి చాలా తీవ్రంగా ఉంది. కపోతం భార్య కోసం ఎదురుచూస్తుండగా చెట్టు క్రింద ఉన్న వేటగాడు దాని కంటపడ్డాడు. అక్కడ అలసి ఉన్న వేటగాడిని, ప్రక్కనే ఉన్న వలను చూసి భయపడింది. భయంతో దానికి దు:ఖం తన్నుకు వచ్చింది. అంతలో "దు:ఖించకు ప్రాణనాథా!" అనే మాటలు వినిపించాయి. కపోతానికి ఆశ్చర్యం, సంతోషం కలిగాయి. వెంటనే "ప్రాణేశ్వరీ! నీవు ఎక్కడున్నావు?" అని ఆనందంతో అరిచింది. "నేను వేటగాడి వలలో చిక్కుకొని ఉన్నాను" అని పలికింది. "అయ్యో! నా ప్రాణేశ్వరీ! నీవు ఈ వేటగాడి వలకు బంధీవైనావా!" అని మరింత బిగ్గరగా ఏడవసాగింది.

ఆ ఏడుపు విని కపోతి "ప్రాణనాథా! ఏడవకు జరిగిందేదో జరిగిపోయింది.

గడిచిపోయిన కాలం మళ్ళీ తిరిగిరాదు. నీవు బాధపడకు, ధైర్యంగా ఉండు. ఈ శరీరాలు శాశ్వతం కావు. ప్రాణం ఉన్నంత వరకు మిగిలి ఉండేది మంచి ఒక్కటే. అలసి ఇంటికి వచ్చిన అతిథిని ఆదరించడం కంటే గొప్ప ధర్మం మరొకటి లేదని పెద్దలు చెప్పారు కదా? పాపం! ఈ వేటగాడు ఆర్తుడై మన గూటి దగ్గరకు వచ్చాడు. నా గురించి దిగులు పడడం మాని, అతిథి అయిన ఈ వేటగాడి బాధ తీర్చ" మని మధుర వాక్యాలు పలికింది. కపోతం వెంటనే ఆ వేటగాడి ముందు నిలిచి "అయ్యా! మీరు బాగా అలసిపోయినట్లు ఉన్నారు. నేనేమైనా సహాయం చేయగలనా! చెప్పండి." అని అడిగింది. దానికి వేటగాడు "ఓ పావురమా! నీవు ఎంత దయగలిగిన దానివి! నా శరీరం ఈ చలికి గడ్డకట్టుకొని పోతోంది. ఈ చలినుండి నన్ను కాపాడు." అన్నాడు.

కపోతం వెంటనే తన గూటిలో దాచుకొన్న పుల్లలన్నింటిని తెచ్చి చలిమంట వేసింది. ఆ పావురం చేసిన సహాయానికి వేటగాడు సంతోషించి చలి కాచుకున్నాడు. వేటగాడికి చలి తగ్గింది. తర్వాత వేటగాడు "ఓ పావురమా! నాకు చాలా ఆకలిగా ఉంది". అన్నాడు. కపోతం "అయ్యా! పక్షుల దగ్గర దాచిపెట్టుకునే ఆహారం ఏమీ ఉండదు. 'పరోపకారార్థం ఇదం శరీరం' అని పెద్దలు చెప్పారు. నా శరీరం తప్ప నేనేమీ ఇవ్వలేను, నన్ను తిని మీ ఆకలిని తీర్చుకోండి". అని పలికి ఆ అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేసి అందులోకి దూకింది. దాని సాహసాన్ని చూసి ఆ వేటగాడు ఆశ్చర్యపోయాడు.

ఆ దృశ్యం చూసిన తర్వాత ఆ వేటగాడు 'ఆహా ! ఈ పావురం ఎంత గొప్పది. నా ఆకలిని తీర్చడానికి తన శరీరాన్ని తృణప్రాయంగా ఆహుతిచ్చింది. ఏమి త్యాగం! ఏమి దయ! ఈ పావురం రూపంలో చిన్నదే అయినా గుణంలో గొప్పది. ఈ రోజు నుండి నేను ప్రాణి హింసను చెయ్యను. మోహం విడుస్తాను.' అని మనస్సులో గట్టిగా నిర్ణయించుకున్నాడు.

వెంటనే వేటగాడు తన వలలోని పక్షులన్నింటిని విడిచిపెట్టేశాడు. కపోతి ఎగిరిపోకుండా ఆ మంట ముందు నిలిచి ఇలా పలికింది "నీవు లేక క్షణమైనా మనజాలను. నాకెవ్వరు దిక్కు? బ్రతుకులోను, మరణంలోను, నీతోనే ఉంటాను" అని వెంటనే అగ్ని చుట్టూ ప్రదక్షిణం చేసి, ఆ నిప్పులోకి దూకి తాను కూడా శరీర త్యాగం చేసింది. ఇంతలో ఓ దివ్యవిమానం వచ్చి ఆ పావురాల జంటను స్వర్గలోకానికి తీసుకుపోయింది. ఇలాంటి అపురూప దృశ్యాన్ని చూడడం వేటగాడి పూర్వజన్మ సుకృతం. ఈ సంఘటనతో జ్ఞానోదయం అయిన వేటగాడు కూడా దివ్యత్వాన్ని పొందాడు.

'పరోపకారార్థం ఇదం శరీరం' అనే నీతి ఈ కథ ద్వారా గ్రహించవచ్చు.

### ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. చెట్టుపై ఉన్న కపోతం ఎందుకు దిగులుపడింది?
2. కపోతి, కపోతంతో ఏమని పలికింది?
3. కపోతం వేటగాడికి సహాయం చేసిన విధానాన్ని తెల్పండి.
4. వేటగాడికి ఎలా జ్ఞానోదయం కలిగిందో తెల్పండి.
5. 'కపోతి - కపోతం' - అనే పాఠంద్వారా గ్రహించిన నీతి ఏమిటి?

# వ్యాకరణం

## 1. అచ్చులు, హల్లులు, ఉభయాక్షరాలు

### 1.1. అచ్చులు

అచ్చులనే 'స్వరములు' అని కూడా అంటారు. అంటే ఈ అచ్చులు ఇతర వర్ణాల సహాయం లేకుండా ఉచ్ఛరింపబడుతాయి. అంటే స్వయంగా ప్రకాశించేవి కాబట్టి వీటికి స్వరములు, ప్రాణములని పేర్లు వచ్చాయి. 'అచ్' అనే పేరు అష్టాధ్యాయి కర్త పాణిని మహేశ్వర సూత్రాల ఆధారంగా ఏర్పడింది.

1. అ ఇ ఉ (ణ్)
2. ఋ, ౡ, (క్)
3. ఏ, ఓ (ఙ్)
4. ఐ, ఔ (చ్)

పై దానిలోని మొదటి వర్ణమైన అ నుండి చివరి వర్ణమైన 'చ్' వరకు మధ్యలో గల అక్షరాలను కలిపి 'అచ్చులు' అంటారు.

**అచ్చులు - రకాలు**

ఉచ్చారణను బట్టి అచ్చులు రెండు రకాలు. అవి

1. హ్రస్వాలు
2. దీర్ఘాలు

1. **హ్రస్వాలు :** పొట్టిగా పలుకపడేవి.

   ఉదా: అ,ఇ,ఉ,ఋ,ఌ,ఎ,ఒ.

2. **దీర్ఘాలు :** పొడవుగా, దీర్ఘంగా పలుకపడేవి.

   ఉదా: ఆ,ఈ,ఊ,ౠ,ౡ, ఏ,ఐ,ఓ,ఔ

అక్షరాల రూపాన్ని బట్టి ఇవి రెండు రకాలు.

1. వక్రములు
2. వక్రతమములు

1. **వక్రములు** :- వంకరగా ఉండే అక్షరాలను 'వక్రములు' అని అంటారు.

   ఉదా : ఎ,ఏ,ఒ,ఓ

2. **వక్రతమములు** :- మిక్కిలి వంకరగా ఉండే అక్షరాలను 'వక్రతమములు' అని అంటారు.

   ఉదా : ఐ,ఔ

## 1.2. హల్లులు

ఈ హల్లులనే ప్రాణులని, వ్యంజనాలనీ అంటారు. ఇవి స్వయంగా ఉచ్చరించబడక అచ్చులసహాయంతో పలుకబడతాయి. అంటే ప్రాణములనే అచ్చులసహాయంతో జీవం పొందుతాయి కనుక వీటిని ప్రాణులు అని అంటారు.

5. హయవరట్
6. ల(ణ్)
7. ఞమఙణన(మ్)
8. ఝభ(ఞ్)
9. ఘఢధ(ష్)
10. జబగడద(శ్)
11. ఖఫఛఠథచటత(వ్)
12. కప(య్)
13. శషస(ర్)
14. హ(ల్)

వీటిలో 5వ సూత్రంలోని 'హ' కు 14వ సూత్రంలోని 'ల్' కలవగా 'హల్' ఏర్పడుతుంది. అంటే ఈ రెండు అక్షరాల మధ్య ఉన్న వర్ణాలసమూహానికే 'హల్' అని పేరు. ఈ 'హల్'నే తెలుగులో 'హల్లులు' అంటారు.

### హల్లుల్లో విభాగాలు.

హల్లులను ఈ క్రింది విధంగా విభజించారు

| | | |
|---|---|---|
| 'క' వర్గం | - | క ఖ గ ఘ ఙ |
| 'చ' వర్గం | - | చ చే ఛ జ జే ఝ ఞ |
| 'ట' వర్గం | - | ట ఠ డ ఢ ణ |
| 'త' వర్గం | - | త థ ద ధ న |
| 'ప' వర్గం | - | ప ఫ బ భ మ |
| అంతస్థాలు | - | య ర (ఱ) ల (ళ) వ |
| ఊష్మాలు | - | శ ష స హ |

ప్రస్తుత వ్యావహారిక భాషలో సందర్భాన్ని బట్టి చే, జే, ల ను ఉచ్చరిస్తున్నారు.

పై హల్లుల్లోని మొదటి వర్గంలోని మొదటి అక్షరం 'క' నుండి 'ప' వర్గంలోని చివరి అక్షరం 'మ' వరకు గలఅక్షరాలను 'వర్గాక్షరాలు' అంటారు.

ఈ హల్లుల్లో కఠినంగా పలికే అక్షరాలను 'పరుషాలు' అంటారు. అవి అన్ని వర్గాలలో మొదటి అక్షరాలైన క, చ, ట, త, ప లు.పై హల్లుల్లో సరళంగా పలుకబడే వాటిని సరళాలు అంటారు. అవి అన్ని వర్గాలలోని 3వ అక్షరాలు గ,జ,డ,ద,బ లు.

పై హల్లుల్లో ప్రతివర్గంలోని అంటే 'క' నుండి 'ప' వర్గం వరకు అన్ని వర్గాల్లోని 2వ అక్షరాన్ని, 4వ అక్షరాన్ని వర్గయుక్కులు అంటారు. అవి. ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ

మొత్తం 10 వర్గయుక్కులఅక్షరాలు వస్తాయి. అవి అన్నీ ఒత్తు అక్షరాలే. వీటినే "మహాప్రాణములు" అని అంటారు.

ప్రతి వర్గంలోని చివరి అక్షరాలను 'అనునాసికాలు' అంటారు.

ఙ, ఞ, ణ, న, మ

పై హల్లుల్లో ఊది పలికే అక్షరాలను 'ఊష్మాలు' అంటారు.

శ, ష, స, హ

## 1.3. ఉభయాక్షరాలు

ఉభయాక్షరాలు మూడు. అవి: పూర్ణానుస్వారం (ం), అర్ధానుస్వారం ( ఁ ), విసర్గ ( ః )

వీటిని విడిగా పలుకలేము. ఇవి అచ్చుతోగాని, హల్లుతోగాని చేరి పలుకబడతాయి. కనుక వీటిని ఉభయాక్షరాలు అంటారు.

## అభ్యాసము

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి

1. అచ్చులను పరిచయం చేయండి.
2. హ్రస్వాలు అంటే ఏవి?
3. దీర్ఘాలు అంటే ఏమిటి? అవి ఏవి?
4. వక్రములు అంటే ఏమిటి? అవి ఏవి ?
5. వక్రతమములు అంటే ఏమిటి? అవి ఏవి ?
6. హల్లులు అనగానేమి?
7. పరుషాలు అనగానేమి? అవి ఏవి?
8. సరళాలు అనగానేమి? అవి ఏవి?

9. వర్గయుక్కు లనగానేమి? తెలపండి.
10. అనునాసికములను తెలపండి.
11. అంతస్థములు ఏవి?
12. ఊష్మములు ఏవి?
13. ఉభయాక్షరములు ఏవి?

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. ఒక్కొక్క అక్షరానికి ఉచ్చారణలో గల భేదాన్ని తెలియచేయాలి.
2. అక్షరాలను విద్యార్థులచేత స్పష్టంగా పలికించాలి.

### విద్యార్థులకు సూచనలు :

1. పెద్దల ఉపన్యాసాలలోని ఉచ్చారణను గమనించండి.
2. ఉపాధ్యాయుని భాషను గమనించాలి.
3. భాషా ప్రయోగశాలలో తెలుగు వర్ణాలను విని వాటి భేదాల్ని గుర్తించండి.



# 2. నామవాచకం

తెలుగు భాషలో ఐదు భాషాభాగాలు ఉన్నాయి. ప్రతి మాటను అది సూచించే స్వభావాన్ని బట్టి అది ఏ భాషాభాగానికి చెందిందో నిర్ణయిస్తారు.

భాషాభాగాలు ఐదు రకాలు అవి

1. నామవాచకం
2. సర్వనామం
3. క్రియ
4. విశేషణం
5. అవ్యయం

నామవాచకం అనేది పేర్లను తెలియజేసేది. దీనిని విశేష్యం అని కూడా అంటారు. మనకు గోచరించే ప్రతి ఆకారాన్ని తెలిపేదే నామవాచకం.

ఉదా: రేవతి, రామాపురం, గంగానది, గోపాలుడు, చెట్టు, పొలము.

నామవాచకాన్ని ఐదు రకాలుగా విభజించవచ్చు.

1. **సంజ్ఞా నామవాచకం** :- సంజ్ఞ అంటే పేరు. ఒక మనిషి, ప్రదేశం, పట్టణం మొ॥న వాని పేర్లను తెలిపేది సంజ్ఞా నామవాచకం.

   ఉదా :- లోకేష్, తిరువళ్ళూరు మొ॥నవి.

2. **జాతి నామవాచకం** :- ఒక వస్తువు, తెగ లేక జాతి పేర్లను తెలిపేది జాతి నామవాచకం.

   ఉదా :- స్త్రీ, అడవి, ఆవు మొ॥నవి.

3. **గుణ నామవాచకం** :- గుణాలను తెలిపేది గుణ నామవాచకం.

   ఉదా :- పులుపు, నలుపు, పేదరికం.

4. **క్రియా నామవాచకం** :- క్రియా పదాలనుండి పుట్టేవే క్రియా నామవాచకాలు.

   ఉదా :-

| క్రియ | | క్రియా నామవాచకం |
|---|---|---|
| చేయు | - | చేత, |
| ఆడు | - | ఆట, |
| వ్రాయు | - | వ్రాత, |
| కోయు | - | కోత మొ॥నవి. |

5. **సముదాయక నామవాచకం** :- సమూహం(లేదా) గుంపును గూర్చి తెలియజేసేది సముదాయక నామవాచకం.

   ఉదా :- గుంపు, సంఘం మొ॥

## అభ్యాసవేదిక

ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి

1. భాషాభాగాలను తెల్పండి.
2. నామవాచకం అంటే ఏమిటి?
3. నామవాచకం ఎన్ని రకాలు? అవి ఏవి?

ఉపాధ్యాయులకు సూచనలు:

1. నామవాచకాల భేదాల్ని స్పష్టంగా తెలియచేయాలి.
2. నామవాచకాన్ని సూచించే ఉదాహరణలను రాయించాలి.
3. ఉదాహరణలిచ్చి అది ఏ నామవాచకమో అడగాలి.

విద్యార్థులకు సూచనలు:

1. సొంతంగా ఒక్కొక్క నామవాచకానికి ఉదాహరణలు రాయాలి.



## 3. సర్వనామం

**సర్వనామం :**

నామవాచకానికి బదులు ఉపయోగించే పదాలనే 'సర్వనామా'లని అని అంటారు.
ఉదా:అతడు, ఆమె, ఇతడు, ఈమె, అది, ఇది, వాడు, వీడు మొ॥

**సర్వనామాల రకాలు.**

1. **సంబంధ వాచక సర్వనామం :-** ఒక వాక్యంలో ఉపయోగించబడిన రెండు సర్వనామాలలో ఒకటి మరొక దానితో సంబంధం కలిగి ఉండే సర్వనామాన్నే 'సంబంధ వాచక సర్వనామం' అంటారు.
ఉదా॥ ఎవడు బాగా చదువుతాడో వాడు పరీక్షలో ఉత్తీర్ణుడు అవుతాడు.

2. **విశేషణ సర్వనామం :-** నామవాచకానికి విశేషణంగా వాడితే ఆ సర్వనామాన్నే 'విశేషణ సర్వనామం' అంటారు.
ఉదా॥ అందరూ మహానుభావులే.

3. **పురుష వాచక సర్వనామం :-** ఇవి మూడు రకాలు.
   1. ఉత్తమ పురుష ఉదా॥ నేను, మేము
   2. మధ్యమ పురుష ఉదా॥ నీవు, మీరు
   3. ప్రథమ పురుష ఉదా॥ వాడు, వారు

4. **ఆత్మార్థక సర్వనామం :-** తాను, తాము, తారు

5. **నిర్దిష్ట సర్వనామం :-** వివరంగా చూపించి చెప్పే సర్వనామమే నిర్దిష్ట సర్వనామం అంటారు.
ఉదా॥ ఇతడు, ఈమె. మొ॥నవి.

6. **అనిర్దిష్ట సర్వనామం :-** ప్రత్యేకించకుండా చెప్పే సర్వనామాన్నే అనిర్దిష్ట సర్వనామం అంటారు.
ఉదా॥ అందరూ రండి. కొందరు ఉండండి. మొ॥నవి.

7. **ప్రశ్నవాచక సర్వనామం :-** ప్రశ్న రూపంలో ఉండే సర్వనామాల్నే ప్రశ్నవాచక సర్వనామాలు అంటారు.
ఉదా॥ ఎవరు గోలచేశారు?

## అభ్యాస వేదిక

### ఈ క్రింది పేరాలోని సర్వనామాలను గుర్తించండి

ఒక అడవిలో మర్రి చెట్టు ఉంది. అది చాలా పెద్దది. ఆ చెట్టు మీద చాలా పక్షులు ఉన్నాయి. అవి పొద్దుపొడవగానే రెక్కలు రెపరెపలాడిస్తూ మేలుకొనేవి. గూళ్ళలో పక్షి పిల్లలు మాత్రం ఉండేవి. వాటికి పెద్ద పక్షులు ఆహారాన్ని తెచ్చిపెట్టేవి. ఆహారం తీసుకొని పెద్ద పక్షులు తిరిగి వచ్చేసరికి తమ పిల్లలు కనిపించలేదు. ఆ నాటి నుండి గద్దలనుంచి తమని తాము కాపాడుకోవాలని అనుకున్నాయి.

ఉదా: అది

1.

2.

3.

### కింది పట్టికలోని అక్షరాలతో సర్వనామాలను రాయండి

| | | | | |
|---|---|---|---|---|
| ఎ | పా | వ | ఇ | స |
| వ | వీ | రే | ద్ద | త |
| డు | క | అం | రు | గ |
| మ | యి | ద | జ | ఏ |
| ది | ఇ | రూ | డు | మి |
| అ | గ్ని | ర | వా | టి |

ఉదా : ఎవడు

1. ____________
2. ____________
3. ____________
4. ____________
5. ____________
6. ____________
7. ____________

### ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి

1. సర్వనామం అంటే ఏమిటి?
2. సర్వనామాలు ఎన్ని రకాలు? అవి ఏవి?
3. ఒక్కొక్క సర్వనామాన్ని వివరించండి.

### ఉపాధ్యాయులకు సూచనలు:

1. సర్వనామాల్ని కొన్నింటిని తెలియజేయాలి.
2. మరి కొన్ని సర్వనామాల్ని విద్యార్థులచేత రాయించాలి.
3. సర్వనామాల్ని కంఠస్థం చేయించాలి.

### విద్యార్థులకు సూచనలు:

1. ఒక్కొక్క సర్వనామాన్ని పరిశీలించాలి.
2. కొన్ని సర్వనామాలు రాయాలి.

# 4. పురుషలు

పురుషలు : మూడు విధాలు.

1. ఉత్తమ పురుష
2. మధ్యమ పురుష
3. ప్రథమ పురుష

**1. ఉత్తమ పురుష :-** ఉత్తమ పురుష అంటే తనను, తమను, గురించి చెప్పే సర్వనామాలు 'ఉత్తమ పురుష' అంటారు.

ఉదా: నేను, మేము, మనము మొ॥

**2. మధ్యమ పురుష :-** ఎదుట ఉన్న వారిని గురించి చెప్పే వాటిని 'మధ్యమ పురుష' అంటారు.

ఉదా: నీవు, మీరు మొ॥

**3. ప్రథమ పురుష :-** ఎక్కడో ఉన్న వారిని, వాటిని తెలియజేసే సర్వనామాల్ని 'ప్రథమ పురుష' అంటారు.

ఉదా: వాడు, అది, ఆమె, వారు మొ॥

పురుషలు గుర్తుంచుకోవడానికి సూత్రం:- తానుత్తమ, ఎదుట మధ్యమ, ఎక్కడో ప్రథమ.

## అభ్యాస వేదిక

### ప్రశ్నలు

1. పురుషలు ఎన్ని విధాలు?
2. ఒక్కొక్క పురుషను ఉదాహరణలతో వివరించండి.

### ఉపాధ్యాయులకు సూచన :

1. విద్యార్థులకు పురుషలమధ్య భేదాన్ని తెలియచేయాలి.

### విద్యార్థులకు సూచన :

1. మీరే కొన్ని పురుషలు రాయాలి.

# 5. విభక్తి ప్రత్యయాలు

వాక్యం రాసేటప్పుడు అనేక పదాలు వాక్యంలో వస్తాయి. ఆ పదాలు విడివిడిగా ఉంటే వాక్యార్థం వ్యక్తీకరించబడదు. అందువల్ల వాక్యంలోని ప్రతిమాటా ఇంకొకమాటతో సంబంధం ఉండేటట్లుగా కలుపబడితే అర్థం పూర్తిగా తెలుస్తుంది. ఇలా పదాల మధ్య సంబంధం తెలిపే వాటిని 'విభక్తు'లంటారు. ముందు ముందు వాక్య విభాగాలను నేర్చుకొనేటప్పుడు వివిధ వాక్య భాగాలకుగల సంబంధం ఎలా ఉంటుందో తెలుస్తుంది. అప్పుడు 'విభక్తి' యొక్క ఉపయోగం విశదీకృత మవుతుంది. ఈ సంబంధం తెలిపే వాటిని 'ప్రత్యయం' అంటారు.

**ఆంధ్ర భాషలో విభక్తులు ఎనిమిది (8) అవి :**

| విభక్తి | | ప్రత్యయాలు |
|---|---|---|
| 1. ప్రథమా విభక్తి | : | డు, ము, వు, లు. |
| 2. ద్వితీయా విభక్తి | : | ని, ను, ల, కూర్చి, గురించి. |
| 3. తృతీయా విభక్తి | : | చేత, చే, తోడ, తో. |
| 4. చతుర్థీ విభక్తి | : | కొఱకు, కై. |
| 5. పంచమీ విభక్తి | : | వలన, కంటె, పట్టి. |
| 6. షష్ఠీ విభక్తి | : | కి, కు, యొక్క, లో, లోపల. |
| 7. సప్తమీ విభక్తి | : | అందు, న. |
| 8. సంబోధనా ప్రథమా విభక్తి | : | ఓ, ఓయి, ఓరి, ఓసి. |

**ఉదాహరణలు :**

| | | |
|---|---|---|
| 1. ప్రథమా విభక్తి | : | రాముడు, పొలము, ఆవు, పాలు మొ॥ |
| 2. ద్వితీయా విభక్తి | : | శివుని, శివు గూర్చి, శివు గురించి, శివుల మొ॥ |
| 3. తృతీయా విభక్తి | : | కృష్ణుని చేత, కృష్ణుచే, కృష్ణు(ని) తోడ, కృష్ణు(ని)తో. |
| 4. చతుర్థీ విభక్తి | : | శివుని కొఱకు, శివునికై. |
| 5. పంచమీ విభక్తి | : | రాము(ని) వలన, రాము(ని) కంటె, రాము(ని) బట్టి. |
| 6. షష్ఠీ విభక్తి | : | శివు(ని)కి, శివు(న)కు. శివు(ని) యొక్క, శివు(ని)లో శివు(ని)లోపల. |
| 7. సప్తమీ విభక్తి | : | కృష్ణు(ని) యందు , భారతము న. |
| 8. సంబోధనా ప్రథమా విభక్తి | : | ఓ శివుడా! ఓయి శివుడా ఓరి నరుడా! ఓసి రాక్షసీ! |

ఇదే విధంగా వాడు, నీవు మొదలగు సర్వనామాలకు వచ్చే విభక్తి ప్రత్యయాలను గుర్తించాలి. కాని ఈ సర్వనామాలకు సంబోధనా ప్రథమావిభక్తి ప్రత్యయాలు చేరవనే విషయాన్ని జ్ఞాపకముంచు కోవాలి అంటే 'ఓ నీవు', 'ఓరి వాడు' అని వాడరాదు.

తెలుగు భాషలోని పదాలు కొన్ని చివర డు, ము, వు, లు అనే ప్రథమా విభక్తి ప్రత్యయం లేక పోయినా గాని ప్రథమా విభక్తి రూపాలుగానే ఉంటాయి.

ఉదా॥ తేనె, బావి, నాగలి, పలక.

అయితే వీటిని బహువచన రూపాలకు 'లు' ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ తేనెలు, బావులు, నాగళ్లు, పలకలు.

పంచమీ విభక్తి ప్రత్యయాలలో కొన్ని రూపాంతరాలు వాడుకలో ఉన్నాయి.

ఉదా॥ రాముని నుండి శబరి వరము పొందింది.
కృష్ణుడి వల్ల కాళీయుని పొగరు పోయింది.
ఆవు కన్న కుందేలు వేగంగా పరుగెత్తుతుంది.

వీటిలో నుండి, వల్ల, కన్న అనేవి పంచమీ విభక్తి ప్రత్యయాలని వలనన్, కంటెన్, పట్టి, యొక్క అన్య ప్రయోగాలుగా గమనించాలి.

## అభ్యాస వేదిక

### ప్రశ్నలు

1. విభక్తులు అంటే ఏమిటి?
2. ఆంధ్ర భాషలోని విభక్తులను తెల్పండి.

### ఉపాధ్యాయులకు సూచన :

విద్యార్థులచేత విభక్తులను కంఠస్థం చేయించాలి.

### విద్యార్థులకు సూచన :

పది వాక్యాలను తీసుకొని అందలి విభక్తులను గుర్తించండి.



# 6. వాక్యం - విభాగాలు

## వాక్యం

వాక్యం అంటే అర్థవంతమైన పదాల సమూహం.

ఉదా॥ 'కుక్క రామయ్యను కరిచింది'

దీనిలో మూడు పదాలు కలిసి ఒక భావంతో కూడిన వాక్యంగా రూపొందింది. వాక్యానికి ఉండవలసిన పదాల సంఖ్యకు పరిమితిలేదు. ఉదాహరణకు ఒకే ఒక పదం 'ఎక్కడికి' అని అనగానే దాని అర్థం తెలిసి వెంటనే సమాధానం చెబుతున్నారు. ఇక్కడ ఒకే పదం 'వాక్యం' గా రూపొందింది. వాక్యం అంటే అర్థవంతమైన కొన్ని పదాలసమూహం అని చెప్పవచ్చు. ఈ వాక్యంలో అనేక భాగాలు ఉన్నాయి.

## వాక్యరచనా భాగాలు

వాక్యరచనలో ఉపయోగించే పదాలన్నీ మూడు విధములు. అవి.

1) కర్త 2) కర్మ 3) క్రియ

'కుక్క రామయ్యను కరచింది'లో మూడు పదాలు మూడు రకాలైన అర్థాలు కలిగి ఉన్నాయి. ఇచ్చట జరిగిన పని కరవటం. కనుక 'కరిచింది అనే పదం క్రియ'. కరిచింది ఎవరు? కుక్క. కనుక ఈ పనికి ప్రధానమైన 'కుక్క' ఈ వాక్యంలో 'కర్త'. ఎవరిని కరిచింది? రామయ్యను. పని యొక్క ఫలితాన్ని పొందినది 'రామయ్య' కనుక 'రామయ్యను' అనే పదం కర్మ.

దీని వలన తెలిసింది ఏమిటి?

పనిని సూచించేది క్రియ.

పని పని చేసేవాణ్ణి సూచించేది కర్త.

పని యొక్క ఫలితాన్ని అనుభవించే వాణ్ణి సూచించేది కర్మ.

ప్రతి వాక్యంలో 'క్రియ' ఆధారంగా 'కర్త', 'కర్మ'లు ఉంటాయి. కర్తను గుర్తించడానికి క్రియమీద 'ఎవరు' మొదలైన ప్రశ్నలు వేయగా వచ్చే సమాధానం కర్త. క్రియమీద 'ఎవరిని', 'దేనిని' మొదలైన ప్రశ్నలు వేయగా వచ్చే జవాబు 'కర్మ' గా తెలుసుకోవాలి. కర్త, కర్మ క్రియలతో కూడుకున్న వాక్యాలు సంపూర్ణంగా ఉండి పూర్తి అర్థాన్ని తెలుపుతాయి. కాని కొన్ని సందర్భాలలో ఈ మూడింటిలో ఏదో ఒకటి లోపించినప్పటికీ పూర్తి అర్థాన్ని ఇచ్చే వాక్యాలు మనం వాడుతూ ఉంటాము.

1) ఉదా : మందు త్రాగు.

అంటే 'నీవు మందును త్రాగుము' అని అర్థం. ఇందులో 'త్రాగుము' క్రియ, 'మందును' కర్మ కాగా, కర్త అయిన 'నీవు' లోపించింది. అయినా అర్థం మాత్రం చెడలేదు.

2) ఉదా॥ విజయుడు గొప్ప ఆటగాడు.

ఈ వాక్యంలో 'విజయుడు' కర్త. వాక్యార్థం 'విజయుడు గొప్ప ఆటగాడు అయ్యాడు అని. 'అయ్యాడు' అనే క్రియ ఇక్కడ లోపించింది.

3) ఉదా॥ నేరం చేస్తే చట్టం శిక్షిస్తుంది.

ఇచ్చట 'శిక్షించు' అనేది క్రియ. శిక్షించేది చట్టం. కనుక ఆ పదం కర్త. కాని కర్మ ఏది? ఎవరిని శిక్షించేది? పూర్తిగా ఉన్న వాక్యం. 'నేరం చేస్తే చట్టం నిన్ను శిక్షిస్తుంది' అని ఉండాలి. 'నిన్ను' అనేది 'కర్మ'. కాని ఇది లోపించింది, అయినా అర్థం మాత్రం మారలేదు.

4) అన్ని క్రియలకూ కర్త ఉంటుందిగాని, కొన్నిటికి కర్మ ఉండదు. అనగా ఎవరిని, దేనిని అనే ప్రశ్నలు క్రియపై వేయగా సమాధానం రాదు.

ఉదా॥ గాలికి చెట్టు విరిగింది.

'విరిగింది' అనే క్రియకు కర్త 'చెట్టు'. కాని ఎవరిని విరిగింది? దేనిని విరిగింది? అనే ప్రశ్నలకు సమాధానం లేనివి. అందువల్ల 'విరిగింది' అనే క్రియకు ఇక్కడ కర్మలేదు. దీని వలన క్రియలను రెండు విధాలుగా తెలుసుకోవచ్చు. అవి

1) కర్మను కోరేవి 'సకర్మక క్రియలు'
2) కర్మను కోరనివి 'అకర్మకక్రియలు'

కర్త, కర్మలు ఒక నామవాచకంగా గాని లేక దాని బదులు వచ్చే సర్వనామంగా గాని ఉంటాయి. పైన చెప్పిన ఉదాహరణలలో కర్తగా వాడబడ్డ 'నీవు' సర్వనామం. 'విజయుడు', 'చట్టం' అనే మాటలు నామవాచకాలు. అలాగే కర్మగా వచ్చిన 'మందు', 'నిన్ను' అనే మాటలు నామవాచకం. సర్వనామంగా ఉన్నాయి. రెండవ ఉదాహరణలో 'ఆటగాడు అయ్యాడు' అనే క్రియకు కర్మలేదు.

## అభ్యాస వేదిక

### ప్రశ్నలు

1. వాక్యం అంటే ఏమిటి? వాక్య భాగాలు ఏవి?
2. ఒక వాక్యం ఆధారంగా కర్తను తెలపండి.
3. ఒక వాక్యం ఆధారంగా కర్మను రాయండి.
4. ఒక వాక్యం ఆధారంగా క్రియను విశ్లేషించండి.
5. కర్త, కర్మ, క్రియలలో ఒకటి లోపించినా వాక్యార్థం లోపించదు.
6. సకర్మకక్రియలు, అకర్మకక్రియలు అంటే ఏమిటి? వివరించండి.

### ఉపాధ్యాయులకు సూచనలు :

1. మరి కొన్ని వాక్యాలు తెలిపి కర్త, కర్మ, క్రియలను ఎలా గుర్తించాలో తెలియజేయాలి.
2. విద్యార్థులచేత కర్త, కర్మ, క్రియలను గుర్తింపచేయాలి.

### విద్యార్థులకు సూచనలు :

1. మీరే ఒక వాక్యంలో కర్త, కర్మ, క్రియలను గుర్తించండి.
2. మీ స్నేహితులకు కర్త, కర్మ, క్రియలు అంటే ఏమిటో తెలియజేయండి.